PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 17 | విజయవాడ, ఆదివారం 17 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 17 August 2025 | Rs



వరుస విజయాలతో అమరావతి రాయల్స్ దూకుడు

- సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై ఏడు వికెట్ల తేడాతో గెలుపు

8



కెనడాలో క్యూబిక్‌లోని డోర్వాల్‌లో ఉన్న మాంట్రియల్ - పియరీ ఇలియట్ ట్రూడో అంతర్జాతీయ విమానాశయంలో ఆందోళన చేస్తున్న విమానయాన సిబ్బంది

కెనడాలో విమానయాన సిబ్బంది పోరుబాట

- సమ్మెతో స్తంభించిన సేవలు
- 700 'ఎయిర్ కెనడా' సర్వీసులు రద్దు

7

ఎరువుల కేటాయింపుల్లో కోత

- కేంద్రంపై ఒత్తిడి చేయని కూటమి సర్కార్
- ఖరీఫ్ రైతుకు ఆదిలోనే కొరత
- వ్యవసాయశాఖపై మేనేజ్‌మెంట్ భారం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి



బంగారుపాళ్యంలో ఎరువుల కేంద్రం వద్ద యూరియా కోసం వేచివున్న రైతులు (ఫైల్)

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ ఎరువుల కేటాయింపుల కోతలు కొనసాగుతున్నాయి. కోతలపై కేంద్రంపై ఒత్తిడి చేయకుండా వచ్చిన వాటితో మేనేజ్ చేయాలని టిడిపి కూటమి ప్రభుత్వం వ్యవసాయశాఖ నెత్తిన భారం వేసింది. మేనేజ్ చేసే క్రమంలో వ్యవసాయశాఖ అస్తవ్యస్త విధానాల కారణంగా ఈ ఏడాది ఖరీఫ్ రైతుకు ఆదిలోనే ఎరువుల కొరత ఎదురైంది. అదనుకు యూరియా దొరకని దుస్థితి నెలకొంది. కొన్ని చోట్ల డిఎపి, కాంప్లెక్స్‌లకు సైతం సమస్య తలెత్తింది. జులై, ఆగస్టులోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే సెప్టెంబర్, అక్టోబర్‌లో ఇంకెలా ఉంటుందోనన్న ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది. నిరుడు ఎరువుల అమ్మకాలను ప్రాతిపదికగా చేసుకొని పది శాతం మేర వినియోగాన్ని తగ్గించాలని కేంద్రం ఆదేశించి ఆ మేరకు ప్రస్తుత ఖరీఫ్‌లో కేటాయింపులు తగ్గించింది. యూరియా 2024 ఖరీఫ్‌లో 6.32 లక్షల టన్నుల అమ్మకం జరిగింది. ఈ సంవత్సరం కేంద్రం 6.22 లక్షల టన్నులకు కేటాయింపులు తగ్గించింది. చివరాఖరుకు ఎంత మేర సరఫరా జరుగుతుందో చూడాలి. కొన్నేళ్ల అనుభవంలో మామూలుగా ప్రతి ఏడాదీ ఐదు నుంచి పది శాతం వరకు ఎరువుల వినియోగం పెరుగుతోంది. గతేడాది సేల్స్‌పై సగటున 45 వేల టన్నుల కేటాయింపులు పెరగాలి. కానీ కేటాయింపులు పది వేల టన్నులు తగ్గాయి.

అంచనాల్లో వైఫల్యం

అనూహ్యంగా రుతుపవనాలు ఈ సంవత్సరం మే 26న రాష్ట్రంలోకి ప్రవేశించాయి. సీజన్ 25-30 రోజులు ముందే వచ్చింది. రాయలసీమలో ముందస్తు వానలకు పంటలు వేశారు. ముందస్తుగా పంటలు వేసిన చోట ఎప్పటి కంటే ఎరువుల వినియోగం పెరిగింది. ఇక పంటలకు ధరల సమస్య కారణంగా రైతులు ఒక ఏడాది వేసిన పంటలను మరుసటి ఏడాది వేయకుండా మారుస్తున్నారు. రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో మిర్చి స్థానంలో పత్తి, వరి వేశారు. మిర్చికి కాంప్లెక్స్ వేస్తారు. పత్తి, వరికి యూరియా వాడతారు. మిర్చికి బదులు పత్తి, వరి వేసిన చోట్ల యూరియాకు డిమాండ్ వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో పంటల సరళిలో వచ్చిన ఈ మార్పులను క్షేత్ర స్థాయిలో వ్యవసాయశాఖ సరైన సమయంలో గుర్తించలేదు. ఈ కారణంగా యూరియాకు తీవ్ర కొరత ఏర్పడింది. నష్టనివారణలో భాగంగా జూన్‌లో రాయలసీమలో, ముఖ్యంగా నంద్యాలకు ఉమ్మడి కృష్ణా, గుంటూరు మిగతా 7లో

నిర్వాసితుల కష్టాలు పట్టవా?

పోలవరం పునరావాస కాలనీల్లో కనీస సదుపాయాలు కరువు

- ప్రభుత్వం బాధ్యతగా స్పందించకుంటే పోరాటం ఉధృతం
- మీడియా సమావేశంలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

ప్రజాశక్తి-రాజమండ్రి ప్రతినిధి, ఏలూరు అర్బన్

పోలవరం ముంపు ప్రజల కోసం నిర్మించిన పునరావాస కాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించలేదని, ఎక్కడ చూసినా సమస్యలే కానవస్తున్నాయని, వాటి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోకుంటే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని పోలవరం నిర్వాసిత తాళ్లూరు, నాగులపల్లి పునరావాస కాలనీల్లో ఆయన శనివారం పర్యటించారు. అనంతరం నాగులపల్లిలో, దీనికి ముందు మధురపూడి విమానాశ్రయం వద్ద మీడియాతో బేబీ మాట్లాడారు. తానూ, రాజ్యసభ సిపిఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ వేర్వేరు మార్గాల్లో రెండు రోజుల పాటు పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా భారీ సంఖ్యలో కుటుంబాలు నీట మునిగిపోతున్నాయని, నిర్వాసితుల్లో 85 శాతం మంది ఆదివాసీలు ఉన్నారని తెలిపారు. వారందరికీ గౌరవప్రదమైన పునరావాసం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కానీ, సుదీర్ఘకాలంగా నిర్లక్ష్యం జరుగుతూ వస్తోందని తెలిపారు. పునరావాస కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతాలోపం కారణంగా వర్షాకాలంలో స్లాబుల నుంచి నీరు కారుతోందన్నారు. మరుగుదొడ్లను సక్రమంగా నిర్మించలేదని, తాగునీటి సౌకర్యం పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ఉపాధి కోసం ప్రతిరోజూ 30 నుంచి 40 కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించినప్పటికీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాస గృహాలకు చాలామంది అర్హులు దూరమయ్యారని తెలిపారు. ఈ విషయాలను సిపిఎం ఆంధ్రప్రదేశ్



మంటూరు కాలనీలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎం.ఎ.బేబీ

రాష్ట్ర కమిటీ ఇప్పటికే ఆందోళనలు, వినతుల రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించాలని డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం మాట్లాడుతూ.. పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.55 వేల కోట్లు కాగా, నిర్వాసితుల పునరావాసానికి రూ.33 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిర్వాసితులకు పూర్తి మిగతా 7లో

బాధితులను గాలికొదిలేసిన ప్రభుత్వాలు

- పార్లమెంట్‌లో చర్చిస్తా : సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్

3



హిమాలయ ప్రాంత పర్యావరణ పరిరక్షణకు ఉద్యమిద్దాం

- వరుస విపత్తుల నేపథ్యంలో సిపిఎం నేత తరిగామి పిలుపు


నేటి నుంచి 'ఓట్ అధికార్ యాత్ర'

- బీహార్‌లో 16 రోజుల పాటు పర్యటించనున్న రాహుల్

7

దయనీయ స్థితిలో గాజా మహిళలు

5



అలాస్కాలోని యాంకరేజ్ నగరంలో నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పుతిన్, ట్రంప్

ఒప్పందం లేకుండానే ముగిసిన
పుతిన్ - ట్రంప్ భేటీ

- చర్చలపై ఇరువురు నేతల సంతృప్తి
- మాస్కోలో తదుపరి దఫా చర్చలు

యాంకరేజ్ : అలాస్కా రాష్ట్రంలోని యాంకరేజ్ నగరంలో శుక్రవారం అమెరికా, రష్యా అధినేతలు ట్రంప్, పుతిన్ మధ్య జరిగిన సమావేశం ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిసింది. నగరంలోని సైనిక స్థావరంలో జరిగిన ఈ సమావేశం కోసం దాదాపు దశాబ్ద కాలంలో మొదటిసారిగా రష్యా అధినేత అమెరికాలో పర్యటించారు. 2021 తర్వాత ఇరు దేశాల అధ్యక్షులు ముఖాముఖి సమావేశం కావడం కూడా ఇదే తొలిసారి. తొలుత ముఖాముఖి అనుకున్నారు కానీ చివరకు ఇరు పక్షాలవైపు ముగ్గురు చొప్పున పాల్గొన్నారు. అమెరికా వైపు ట్రంప్‌తో పాటూ విదేశాంగమంత్రి మార్కో రూబియో, అధ్యక్షుడి దూత స్టీవ్ విట్కాఫ్‌లు పాల్గొనగా రష్యా వైపు పుతిన్‌తో పాటు విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్, అధ్యక్షుడి సలహాదారు యూరి యుష్‌కొవ్‌లు పాల్గొన్నారు.

సమావేశం ముగిసిన అనంతరం ఇరువురు నేతలు సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ట్రంప్ మాట్లాడుతూ, అనేక అంశాలపై అంగీకారం కుదిరింది. గొప్ప పురోగతే సాధించాం, కానీ లాంఛనంగా ఎలాంటి ఒప్పందం మిగతా 7లో

కరేడులో పోలీసుల నిర్బంధ కాండ


- వాల్‌పోస్టర్ చించివేత - ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఉలవపాడు మండలం కరేడు ప్రాంతంలో పోలీసుల నిర్బంధకాండ కొనసాగుతోంది. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈనెల 18న రైతు సంఘాల సమన్వయ కమిటీ 'చలో కరేడు'కు పిలుపునివ్వడంతో శుక్రవారం రాత్రి కరేడు, ఉప్పరపాళెం, రామకృష్ణాపురం తదితర ప్రాంతాల్లో నాయకులు వాల్‌పోస్టర్లను అతికించారు. కరేడుకు తరలిరావాలని ప్రచారం నిర్వహించారు. ఆ వాల్‌పోస్టర్లను పోలీసులు శనివారం చించివేశారు. ప్రచారం నిర్వహిస్తున్న రామకృష్ణాపురానికి చెందిన గిరిజనుడు అంకమరావును అరెస్టు చేశారు. మరో వ్యక్తి విజయ్‌కుమార్‌ను అరెస్టు చేయ డానికి ప్రయత్నించగా తప్పించుకున్నట్లు సమాచారం. కరేడులో ఎలాంటి ఆందోళనలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించొద్దంటూ పోలీసులు హెచ్చరికలు జారీచేస్తున్నారు. 'చలో కరేడు' కార్యక్రమాన్ని నిర్వహించి తీరు తామని రైతుసంఘాల, ప్రజాసంఘాల నాయకులు తేల్చి చెప్పారు.

3 రోజులు భారీ వర్షాలు

- రేపు మరో అల్పపీడనం
- విపత్తుల నిర్వహణ సంస్థ




ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐఎండి సూచనల ప్రకారం అల్పపీడనం కొనసాగుతోందని, ఈ నెల 18న పశ్చిమ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. అల్పపీడనం నేపథ్యంలో ఈ నెల 19 వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని ఆయన సూచించారు. ఇప్పటికే ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ నెల 17న అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. 18న తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. 19న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని ప్రఖర్‌జైన్ తెలిపారు. శనివారం సాయంత్రానికి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో 30.2 మిల్లీమీటర్లు, మన్యం జిల్లా జియమ్మవలసలో 27.2 మిల్లీమీటర్లు, కర్నూలు జిల్లా పందికోనలో 27 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు.

ధర్మవరంలో 'ఉగ్ర' కలకలం

- అనుమానితుడిని అరెస్టు చేసిన ఎన్ఐఎ
- కడప సెంట్రల్ జైలుకు తరలింపు



నూర్ మహ్మద్

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

పాకిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధాలు కలిగి ఉన్నారన్న అనుమానంతో శ్రీసత్యసాయి జిల్లాలో ఓ వ్యక్తిని ఎన్ఐఎ అధికారులు శనివారం అరెస్టు చేశారు. దీంతో, స్థానికంగా కలకలం రేగింది. పోలీసుల కథనం ప్రకారం... ధర్మవరం పట్టణంలోని కోట ప్రాంతంలో ఉంటున్న నూర్ మహమ్మద్ అనే వ్యక్తి ఇంట్లో ఎన్ఐఎ అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 16 సిమ్‌కార్డులు లభించినట్టు సమాచారం. ఆయన పాకిస్తాన్‌కు చెందిన కొన్ని ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన సోషల్ మీడియా గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నట్టు ఎన్ఐఎ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన ఈ గ్రూపుల్లో ఎటువంటి కార్యక్రమాలకు పాల్పడ్డారు? ఆయన ఆలోచన ధోరణి ఏమిటి? తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నట్టు ధర్మవరం ఇన్‌ఛార్జి డిఎస్‌పి నర్సింగప్ప మీడియాకు తెలిపారు. విచారణ అనంతరం మెహమ్మద్‌ను కదిరిలో జడ్జి ముందు హాజరు పర్చారు. జడ్జి ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో, నూర్ మహమ్మద్‌ను పోలీసులు కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయన ధర్మవరం పట్టణంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నారు. నూర్ మహమ్మద్‌కు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. ఆయన మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకురని, ఈ నేపథ్యంలో తాను ఆరు నెలలుగా భర్త నుంచి విడిపోయి వేరుగా ఉంటున్నానని నూర్‌మహ్మద్ భార్య తెలిపారు. నూర్ మహమ్మద్ తల్లి తన కుమారుడు మంచివాడని, అటువంటి వాటిల్లో ఉండే అవకాశం లేదని చెబుతున్నారు.

పోలవరం కాఫర్ డ్యామ్ కొట్టుకుపోయినా కనిపించలేదా? : కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పోలవరం కాఫర్ డ్యామ్ రెండోసారి కొట్టుకుపోయినా నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ)కు కనిపించడం లేదా..? అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ట్విట్టర్‌లో ప్రశ్నించారు. కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని విమర్శలు చేసిన కాంగ్రెస్, బిజెపి నేతలకు 'పోలవరంను.. కూలవరం" అనే దమ్ము, ధైర్యం ఉందా..? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల వేళ అత్యంత అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై కేవలం 24 గంటల్లోపే ఎన్‌డిఎస్‌ఎను దించి బిఆర్‌ఎస్‌పై బురదజల్లిన బిజెపి నేతలు.. కండ్లముందు రెండోసారి కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్‌పై ఎందుకు మౌనంగా ఉన్నారు..? ఏకంగా 10 అడుగుల వెడల్పు.. ఏడు నుంచి ఎనిమిది అడుగుల లోతుకు కుంగిన పోలవరం కాఫర్ డ్యామ్‌ను గుట్టు చప్పుడు కాకుండా ఏపీలో యుద్ధప్రాతిపదికన రిపేర్ చేస్తున్నారన్నారు. 2020 లో పోలవరం డయాఫ్రం వాల్ రెండేళ్లకే కొట్టుకుపోయినా ఉలుకు పలుకూ లేదని పేర్కొన్నారు.

భారతావని డిజిటల్ వెలుగురేఖ కేరళ

- సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రం
- 21న ప్రకటించనున్న ముఖ్యమంత్రి



కేరళలోని కోజికోడ్ జిల్లా ఒలవన్న గ్రామ పంచాయితీలో స్మార్ట్ ఫోన్ ఉపయోగించడంపై శిక్షణ పొందుతున్న వయో వృద్ధులు

తిరువనంతపురం : దేశంలోనే సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా ఇప్పటికే విరాజిల్లుతున్న కేరళ మరో అద్భుత ఘనతను సొంతం చేసుకుంది. దేశంలోనే సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా ఖ్యాతి నొందింది. ఇందుకు సంబంధించి ఈ నెల 21న ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిరువనంతపురంలో అధికారికంగా ప్రకటించను న్నారు. రాష్ట్రంలోని మారుమూల పల్లెలకు సైతం డిజిటల్ అక్షరాస్యత నేర్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందుకోసం స్థానిక కళాశాలలు, ఉన్నత విద్యా సంస్థల సహకారంతో వయో వృద్ధులకు సైతం ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించింది. సెల్‌ఫోన్‌లోని టార్చ్‌లైట్‌ను ఎలా ఉపయోగించాలి..వంటి విషయాలు మొదలుకొని కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లో ఎలా టైప్ చేయాలి..వాటిని నిత్య జీవితంలో వివిధ పనులకు ఎలా వినియోగించాలి అనే అంశాల వరకు ఈ శిక్షణ శిబిరాల్లో నేర్పించారు. 'డిజి కేరళం - ఫుల్ డిజిటల్' ప్రాజెక్టు పేరిట చేపట్టిన ఈ కార్యాచరణ లక్ష్యాలను సంపూర్ణంగా అధికమించిన నేపథ్యంలో కేరళను సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత రాష్ట్రంగా అధికారికంగా ప్రకటించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వయసు, విద్య, ఆర్థిక స్థితి వంటి అంశాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క పౌరుడికి డిజిటల్ టెక్నాలజీ ప్రయోజనాలు అందించాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం.

తిరువనంతపురంలోని పుల్లంపుర పంచాయితీలో తొలుత ప్రారంభమైన ఈ డిజిటల్ అక్షరయాత్ర అనతికాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. దేశంలోనే తొలి పూర్తి స్థాయి డిజిటల్ అక్షరాస్యత కలిగిన గ్రామంగా పుల్లంపుర ఖ్యాతినార్జించడంతో ఆ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని 2022లో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 'డిజి కేరళ..'ను అమల్జేసింది. ప్రభుత్వం సైతం అనేక సేవలను ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు అందిస్తోంది. చెల్లింపులు, ధ్రువపత్రాల జారీ వంటి అనేక అంశాలను ఆన్‌లైన్ విధానంలో ప్రజలకు సులభంగా అందిస్తూ మన్ననలు మిగతా 7లో

కరేడులో పోలీసుల నిర్బంధం పై సిపిఎం ఖండన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కరేడు ప్రాంతంలో రైతులు, ప్రజలు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం నిర్బంధకాండ ప్రదర్శించడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందన్న విషయాన్ని ప్రభుత్వం, పోలీసులు గ్రహించాలని పేర్కొన్నారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపాలేరని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలె వెంగయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ తెలిపారు.

18 నుంచి క్వాంటం టెక్నాలజీపై శిక్షణ

- ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్వాంటం టెక్నాలజీపై అధ్యాపకులకు రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె మధుమూర్తి వెల్లడించారు. జైపూర్‌లోని మాలవ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎన్‌ఐటి), సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డిఎస్‌టి), ఐబిఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ, మద్రాస్ ఐఐటి సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతుందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి సెప్టెంబరు 11 వరకు ఆన్‌లైన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భౌతికశాస్త్రం, రసాయన శాస్త్ర, కంప్యూటర్ సైన్స్, గణితం, లైఫ్ సైన్సెస్, ఆర్థికశాస్త్రం, వాణిజ్యం, వ్యవసాయం, వైద్య శాస్త్రాలు, మత్స్య, ఉద్యానవన, ఫార్మాస్యూటికల్స్ వంటి బహుళ విభాగాల్లో 1000 మంది అధ్యాపకులకు శిక్షణ ఇస్తామన్నారు. 2026 ఏప్రిల్ వరకు దశలవారీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

చెరువులో పడి రైతు మృతి

ప్రజాశక్తి - రుద్రవరం

నంద్యాల జిల్లా రుద్రవరం మండలం ఆలమూరు గ్రామ సమీప చెరువులో ప్రమాదవశాత్తు రైతు, రెండు ఎద్దులు మృతి చెందాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... రైతు గోవిందదిన్నె హుస్సేన్‌బాష (42) వ్యవసాయ పనులు చేసి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఎద్దులను శుభ్రం చేసేందుకు బండితో సహా చెరువులోకి దిగారు. ఎద్దులను శుభ్రం చేస్తుండగా నీటిలో శబ్దం కావడంతో ఒక్కసారిగా ఎద్దులు ముందుకు వెళ్లాయి. చెరువులోని పెద్ద గుంతలోకి పడిపోయాయి. హుస్సేన్‌బాష కూడా ఎద్దులతో పాటు వెళ్లిపోయారు. లోతు ఎక్కువగా ఉండడం, తిరిగి ఒడ్డుకురాలేకపోవడంతో ఊపిరాడక రైతు, రెండెద్దులు మృతి చెందాయి. సమీప రైతులు గమనించి చెరువులో చిక్కుకున్న హుస్సేన్‌బాషను ఎద్దులను బయటకు తీశారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హుస్సేన్‌బాషకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. సూపర్ సిక్స్ హిట్ ఎలా అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబును శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 20 లక్షల ఉద్యోగాల్లో ఒక్కరికైనా ఇచ్చారా? నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఏ ఒక్క నిరుద్యోగికైనా అందిందా? అని ప్రశ్నించారు. 18 ఏళ్లు నిండిన ఒక్క మహిళకైనా నెలకు రూ.1500 అకౌంట్‌లో పడ్డాయా? అని నిలదీశారు. అన్నదాతా సుఖీభవ కింద సొంతంగా రూ.20 వేలు ఇస్తామని మాట మార్చారని విమర్శించారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో లింక్ పెట్టి 30 లక్షల మంది రైతులకు పథకం దక్కకుండా పంగనామాలు పెట్టారని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకంలో 20 లక్షల మంది బిడ్డలకు కోత పెట్టారని, రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలకు సరిపెట్టారని విమర్శించారు. మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఎంతమందికి అందుతున్నాయో అర్థంకాని పరిస్థితి అని పేర్కొన్నారు.

గౌతు లచ్చన్న జీవితం ఆదర్శం

- త్వరలో ఆదరణ-3 పథకం
- జయంతి వేడుకల్లో మంత్రి సవిత



గౌతు లచ్చన్న 116వ రాష్ట్రస్థాయి జయంత్యోత్సవ కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న మంత్రులు, నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సర్దార్ గౌతు లచ్చన్న జీవితం అందరికీ ఆదర్శమని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు గౌతు లచ్చన్న 116వ రాష్ట్రస్థాయి జయంత్యోత్సవ కార్యక్రమం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో లచ్చన్న కీలకపాత్ర పోషించారని చెప్పారు. అంటరానితనంపై అలుపెరగని పోరాటం చేశారని, హరిజన, గిరిజన రక్షణ యాత్రలు నిర్వహించారని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల కోసం లచ్చన్న తన జీవితాంతం పాటుపడ్డారని తెలిపారు. త్వరలోనే ఆదరణ 3.0 పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. రంపచోడవరంలోని హార్టీకల్చర్ పరిశోధన కేంద్రంలో నూతన తాటి ఉత్పత్తులు తయారుచేసి, గీత కార్మికులకు ఉపాధి, ఆర్థిక వృద్ధి మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. ఆదరణ పథకం ద్వారా గీత కార్మికులకు మోపెడ్ ద్విచక్ర వాహనాలు అందిస్తామన్నారు. వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. పేద కుటుంబంలో జన్మించిన లచ్చన్న స్వాతంత్ర్య ఉద్యమంలో గొప్ప పాత్ర పోషించి దేశానికి మంచి చేసిన వ్యక్తి అని చెప్పారు.

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల కోసం, అంటరానితనంపై పోరాడిన గొప్ప వ్యక్తి లచ్చన్న అని కొనియాడారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. బలహీనవర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. గౌతు లచ్చన్న మనుమరాలు, ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ.. చిన్న వయసులో తన తాతయ్య దగ్గర పెరగడం వల్ల ఆయన ఆశయాలు, ఆలోచనలు తనపై ప్రభావం చూపిస్తాయని చెప్పారు. ముందుగా లచ్చన్న చిత్రపటానికి మంత్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఆర్‌టిఐ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, బొండా ఉమామహేశ్వరరావు, కాగిత కృష్ణ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో లచ్చన్న జయంతి వేడుకలు

గౌతు లచ్చన్న జయంతి వేడుకలు టిడిపి కార్యాలయంలో శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. లచ్చన్న ఆశయాలు, కలల సమాజం సాధనకు టిడిపి కట్టుబడి పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవులు, పార్టీకార్యాలయ కార్యదర్శి పి అశోక్‌బాబు, పర్యాటక అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశం పట్ల గౌరవం చూపని జగన్

- టిడిపి ఎంపి అప్పలనాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15న జాతీయ జెండాను ఆవిష్కరించకుండా భారతీయులను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవమానపర్చారని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. జగన్‌కు ప్రజల పట్ల గౌరవం లేదని, దేశం పట్ల భక్తి లేదని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ సమైక్యత, సాధికారతను జగన్ మరిచారని, దేశం పట్ల చూపాల్సిన గౌరవాన్ని విస్మరించారని విమర్శించారు. కడప జిల్లా జడ్‌పిటిసి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కకుండా ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని అన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతే టిడిపి విధానం : మాజీ మంత్రి సుజాత

మహిళలకు ఆర్థిక ప్రగతిని వృద్ధిలోకి తీసుకురావాలన్న సిద్ధాంతమే టిడిపి విధానమని మాజీ మంత్రి పీతల సుజాత మరో సమావేశంలో అన్నారు. మహిళా సాధికారతను తీసుకురావడంలో చంద్రబాబు ప్రభుత్వం ఎనలేని కృషి చేసిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఉచిత బస్సు పథకాన్ని మహిళలకు కానుకగా ఇచ్చారన్న ఆమె.. చంద్రబాబుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

'కొండవీటి' నీటిని పంపే పనులు ముమ్మరం

- ఎడిసి ఛైర్మన్ లక్ష్మీపార్థసారధి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కొండవీటి వాగులోకి పైఎత్తు నుంచి వస్తున్న నీటిని కృష్ణా నదిలోకి వేగంగా పంపించే పనులను ముమ్మరంగా చేపట్టాలని అధికారులను అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి లక్ష్మీపార్థసారధి ఆదేశించారు. ఇ-10, ఇ-14 రోడ్ల మధ్య ఉన్న 5 కల్వర్టులను తెరిచి నీటిని దిగువకు పంపిస్తున్న పనులను శనివారం ఆమె పరిశీలించారు. కురగల్లు వద్ద ఎన్-6 (పశ్చిమ బైపాస్) వద్ద ఉన్న 3 స్పాన్లలోని మట్టి, దాని బ్రిడ్జి కింద ఉన్న అడ్డుకట్టలను వెంటనే తొలగించేందుకు ఎక్స్‌లేటర్లను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలని నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులను ఆదేశించారు. కొండవీటి వాగులో నీటిని కృష్ణా నదిలోకి పంపించే ప్రక్రియ శరవేగంగా జరిపేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. అవసరం మేరకు యంత్రాలను ఏర్పాటు చేయాలని ఎడిసి, ఇంజినీరింగ్ అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో ఆమె వెంట ఎడిసి చీఫ్ ఇంజినీర్లు ఆర్ గోపాలకృష్ణారెడ్డి, సిహెచ్ ధనుంజయ, ఎస్‌ఇ నరసింహమూర్తి, ఇఇలు కె బసవేశ్వరరావు, వైకుంఠరావు ఉన్నారు.

రిమాండ్ ఖైదీ పరారీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు సబ్‌జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారయ్యారు. మూడు రోజుల క్రితం రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామంలో జరిగిన చోరీ కేసులో నిందితుడు రఫీని పోలీసులు అరెస్టు చేశారు. మూడు రోజులుగా సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రఫీపై రాష్ట్ర వ్యాప్తంగా 25 కేసులు నమోదయ్యాయి. జైలు గోడ దూకి పారిపోయిన ఖైదీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

గీత కార్మికుల ఉపాధి కోసం పోరాటం

- 58 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో పిలుపు


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మికుల సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. బెల్ట్‌షాపులు తొలగించాలని, కల్లుగీత వృత్తిని రక్షించాలని, నీరా పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు వాకా రామచంద్రరావు అధ్యక్షతన విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం రౌండ్‌టేబుల్ జరిగింది. బెల్ట్‌షాపులు తొలగించి కల్లుగీత కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ 58 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలనే తీర్మానాన్ని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి జె నరసింహమూర్తి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం గీత కార్మికుల ఉపాధిని దెబ్బతీయడం దుర్మార్గమన్నారు. మద్యం ఆదాయానికి రుచి మరిగిన ప్రభుత్వం కల్లు అమ్మకాలు దెబ్బతీసి కార్మికుల పొట్టకొట్టడం అత్యంత బాధాకరమన్నారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి నియోజకరవర్గంలోనే బెల్ట్‌షాపులు అక్రమంగా అధిక సంఖ్యలో ఉన్నాయని పేర్కొన్నారు. గీత కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న అన్ని జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, 30న జిల్లా ఎక్సైజ్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టాలని, సెప్టెంబరు 8న ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌ను కలిసి డిమాండ్ల పత్రాన్ని అందించాలని వెల్లడించారు. సెప్టెంబరు 10న ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వాలని తెలిపారు. చేతివృత్తిదారుల సంఘం సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం భాస్కరయ్య మాట్లాడుతూ.. మద్యానికి పాలసీ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల అభివృద్ధి కోసం ఇప్పటి వరకు పాలసీ ప్రకటించలేదన్నారు.

కార్మికులకు ఉపాధి చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని చెప్పారు. పోషక విలువలతో ఉన్న 'నీరా' పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఎపి మధ్యాహ్న భోజనం పథకం కార్యదర్శి దయా రమాదేవి, ప్రజానాట్యమండలి కార్యదర్శి అనిల్, చేనేత సంఘం అధ్యక్షులు పి బాలకృష్ణ సమావేశంలో పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరగడంతో మహిళలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే మద్యాన్ని అరికట్టాలని, లేదంటే ప్రజా సంఘాలతో ప్రజలను ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గీత కార్మికుల సంఘం నాయకులు అప్పారావు, పి నాగేశ్వరరావు, సూరిబాబు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యుపిక్స్ కేసులో ముగ్గురు అరెస్టు

- బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం
- రూ.23 కోట్ల ఆస్తులు అటాచ్

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన యుపిక్స్ చీటింగ్ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 14న పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన త్రిపురమల్లు శ్రీనివాసరావు, కలవకొల్లు దిలీప్ కుమార్ యుపిక్స్ మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం... సత్యనారాయణపురం ఆదిశేషయ్య వీధిలో యుపిక్స్ క్రియేషన్ కంపెనీలో హాలీవుడ్ సినిమాలకు యానిమేషన్ వర్క్‌లు జరుగుతున్నాయని, ఇది ఇంటర్ నేషనల్‌గా ఏర్పడిన కంపెనీ అని, దీనిలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు ఇస్తామని చెప్పి సుమారు రూ.20 కోట్ల వరకు పెట్టుబడి పెట్టించి మోసం చేశారు. బాధితుల ఇచ్చిన ఫిర్యాదులపై సత్యనారాయణపురం పోలీసులు కేసులు నమోదు చేశారు. దీనిపై ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఆదేశాల మేరకు డిసిపి కె.తిరుమలేశ్వర రెడ్డి ఆధ్వర్యాన నార్త్ ఎసిపి డాక్టర్ స్రవంతి రాయ్ విచారణాధికారిగా, నలుగురు సిఐలు, సిబ్బందితో ప్రత్యేక సిట్ బృందాన్ని ఏర్పాటు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఈ కేసుల్లో ప్రధాన నిందితుడైన విజయవాడ సత్యనారాయణపురం ప్రాంతానికి చెందిన నిడుమోలు వెంకట సత్యలక్ష్మి కిరణ్, గుంటూరు జిల్లా కృష్ణనగర్‌కు చెందిన మిట్టపల్లి రాజేంద్ర బాబు అలియాస్ రాజు, మిట్టపల్లి రాజీవ్ కృష్ణలను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి సుమారు రూ.90 లక్షల విలువైన 354 గ్రాముల బంగారు ఆభరణాలు, 21 కిలోల వెండి ఆభరణాలు, ఒక ఎక్స్‌యువి కారును, బిఎండబ్ల్యు బైక్‌ను, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. వారి బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేసి అరెస్టు చేశారు. నిందితులకు సంబంధించిన సుమారు రూ.23 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్‌చేశారు.


కేసు వివరాలను పరిశీలిస్తే... 2014లో నిడుమోలు వెంకటసత్యలక్ష్మి కిరణ్ అనే వ్యక్తి విజయవాడ సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆది శేషయ్య వీధిలో యుపిక్స్ అనే యానిమేషన్ కంపెనీని ఏర్పాటు చేశాడు. దీనిలో సుమారు 70 మంది సిబ్బంది పనిచేసేవారు. ఈక్రమంలో కిరణ్‌కు పేరం మాల్యాద్రి, అతని కుమారుడు పేరం మహేశ్వర రెడ్డి, కొత్తూరి వేణుగోపాల్ రావు, మిట్టపల్లి రాజేంద్ర బాబు, అతని కుమారుడు మిట్టపల్లి రాజీవ్ కృష్ణ పరిచయం అయ్యారు. అందరూ ఏవిధంగానైనా సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో 2018లో ఒక గ్రూప్‌గా ఏర్పడి 12 నెలలకు పదికి పది లక్షలు, పన్నెండు నెలలకు కోటికి కోటి రూపాయలు డిపాజిట్ చేసేవారికి అధికంగా డబ్బులు ఇచ్చే విధంగా ఆశచూపారు. ఈ కంపెనీలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని మాయ మాటలు చెప్పి అమాయక ప్రజలను మోసం చేశారు. ముందుగా పెట్టుబడి పెట్టి లాభాలు సంపాదించినట్లు చూపిస్తూ అమాయకులను మాయమాటల ద్వారా ఆకర్షించారు. ఈ క్రమంలో వీరు పెట్టుబడులు పెట్టి అధిక లాభాలు తీసుకున్నారు. అలాగే వీరి బంధువులు, స్నేహితులతో డిపాజిట్లు చేయించారు. డిపాజిట్లు చేయించినదుకు కమీషన్లను, పెట్టుబడుల నుండి వచ్చిన డబ్బులను తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకుని మోసం చేశారు. మోసపోయిన వారిలో నర్సరావుపేట, గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు చెందిన బాధితులు ఎక్కువగా ఉన్నారు. బాధితులు 183 మంది సుమారు రూ.353 కోట్ల నగదును యుపిక్స్ గ్రూప్స్ కంపెనీలో పెట్టుబడి పెట్టి నష్టపోయారు. ఈ కేసులో నిందితులు 2024 వరకు సుమారుగా రూ.194 కోట్ల డిపాజిట్లను తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకుని వాడుకున్నారు.

సాహితీవేత్త తంగిరాల చక్రవర్తి మృతి

- పలువురు నివాళి
- హైదరాబాద్‌లో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ సాహితీవేత్త, రచయిత, ప్రజాశక్తి, నవతెలంగాణ బుక్‌హౌస్, ఎడిటోరియల్ బోర్డులో సుదీర్ఘకాలం పని చేసిన తంగిరాల చక్రవర్తి(61) శనివారం ఉదయం హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో గుండెపోటుతో మరణించారు. తెల్లవారుజామున ఎడమ భుజం నొప్పితోపాటు గుండెల్లో మంటగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న సమయంలోనే మరోసారి తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆయన ఆస్పత్రిలోనే కన్నుమూశారు. ఆయనకు భార్య లక్ష్మీ ప్రసన్నకుమారి, కుమారుడు సాయిసుందర్ ఉన్నారు. తంగిరాల భౌతికకాయాన్ని శనివారం మధ్యాహ్నం బాలాపూర్‌లోని ఆయన ఇంటి వద్ద ఉంచారు. తర్వాత స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



తంగిరాల చక్రవర్తి విజయవాడ దగ్గర్లోని కపిలేశ్వరపురంలో 1964 సెప్టెంబరు 18న జన్మించారు. తండ్రి నాటకరంగ ప్రముఖుడు తంగిరాల వెంకటశివరామకృష్ణ ప్రసాద్. తెలుగు సాహిత్యంలో కథ, కవిత, నాటకం, వ్యాసం, నవల, గ్రంథసమీక్ష, విమర్శ మొదలైన ప్రక్రియలలో మూడు దశాబ్దాలుగా చక్రవర్తి కృషి చేశారు. తండ్రి పేరు మీద తంగిరాల మెమోరియల్ ట్రస్ట్‌ను ప్రారంభించి ప్రతి ఏటా ఒక నాటకరంగ ప్రముఖుడిని సత్కరిస్తూ వచ్చారు. ఆకాశవాణి విజయవాడ, హైదరాబాద్ కేంద్రాలతోపాటు లండన్ తెలుగు రేడియోలో ప్రసంగాలు చేశారు. చక్రవర్తి భౌతిక కాయాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, నవతెలంగాణ సిజిఎం ప్రభాకర్, బుక్‌హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లాభాపురం జనార్ధన, ఆనందాచారి సంతాపం తెలిపారు.

ఆగని డోలీ మోతలు.. గిరిజనులకు తప్పని కష్టాలు

ప్రజాశక్తి -మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)


రోగిని కుర్చీలో కూర్చోబెట్టి దుగ్గేరు సమీపంలో గెడ్డ దాటిస్తున్న గిరిజనులు

అనారోగ్యం వస్తే రహదారి సౌకర్యాలు అంతంత మాత్రమే కావడం, మరోవైపు వర్షాకాలం వస్తే వాగులు వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో వాటిని దాటుకుంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటూ గిరిజనులు జీవనం సాగించాల్సిన దుస్థితి నేటికీ కొనసాగుతోంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా గిరిశిఖర గ్రామాల గిరిజనుల వెతలు తీరడం లేదు. సరైన దారి లేక, వాగులు వంకలు దాటాలన్నా సరైన వంతెన సదుపాయాలు లేకపోవడంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. పార్వతీపురం మన్యం జిల్లాలోని మక్కువ, సాలూరు మండలాలతో పాటు సరిహద్దు ఒడిశా ప్రాంత గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదు.

మక్కువ మండలం గుంటభద్ర గ్రామానికి చెందిన కొండతామర మనోజ్ అనారోగ్య బారిన పడడంతో శుక్రవారం గ్రామస్తులు కుర్చీ డోలీలో గెడ్డ దాటించి దుగ్గేరు గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్‌కు తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సోమవారం రావాలని చెప్పడంతో స్వగ్రామానికి బయలుదేరారు. గెడ్డ ప్రవాహం ఎక్కువగా ఉండటంతో దుగ్గేరులోనే ఉండిపోవాల్సి వచ్చిందని మనోజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. సాలూరు మండలం పోయమూల గ్రామానికి చెందిన చోడపల్లి చంద్రరావు దుగ్గేరు గ్రామం సమీపంలోని అడారు గడ్డను ద్విచక్ర వాహనంపై దాటుతుండగా ప్రమాదవశాత్తు జారి పడిపోయారు. ఆయనకు ప్రమాదం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గెడ్డ ఉధృతికి ద్విచక్రవాహనం కొట్టుకుపోయింది. ఇలాంటి ఘటనలు తరచూ గిరిజన ప్రాంతాల్లో సంభవిస్తూనే ఉన్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దుగ్గేరు సమీపంలోని అడారు గడ్డపైన, గుంటభద్ర సమీపంలోని వాగుపైన వంతెనలు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఉచిత పంటల బీమా అమలు చేయండి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ప్రభుత్వం అమలు చేసిన రీతిలోనే కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ప్రీమియం మొత్తం చెల్లించి రైతులకు పంటల బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాతావరణ బీమా పేరుతో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు రైతుల వాటాగా చెల్లించాల్సిన బీమా ప్రీమియం మొత్తాన్ని భారీగా పెంచాయని తెలిపారు. పత్తికి హెక్టారుకు రూ.5 వేలు, మిరపకు రూ.11,500, వరికి రూ.2,150 ఇలా ప్రీమియం మొత్తం అధికంగా ఉండటంతో 14.15 లక్షల ఎకరాలకు మాత్రమే బీమా ప్రీమియం రైతులు చెల్లించారని తెలిపారు. మరో 57 లక్షల ఎకరాలకు బీమా దక్కలేదని, ఫలితంగా 75 లక్షల మంది రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితిని నివారించి, రైతులందరికీ బీమా ప్రీమియం దక్కేలా ప్రభుత్వమే ఉచిత పంటల బీమా అమలు చేయాలని, ఇ-క్రాప్ ఆధారంగా రైతులందరికీ ఉచిత పంటల బీమా అమలు చేయాలని కోరారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో కృష్ణానదికి వరదలు రావడం, బుడమేరు పొంగిపొర్లడంతో కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో లక్షల ఎకరాల్లో పత్తి, వరి, అరటి, పసుపు, కంద పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాయలసీమ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులతో దిగుబడి తగ్గిపోవడం, పంటలు దెబ్బతినడం వంటి రూపాల్లో రైతులు నష్టపోయారని పేర్కొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎపి ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నేతలు ముజఫర్ అహ్మద్, శివాజీ, దుర్గారావు

ఆటో డ్రైవర్లకు రూ.25 వేలు సాయం

- వెల్ఫేర్ బోర్డు తక్షణమే ఏర్పాటు
- ఎపి ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ డిమాండ్
- 18, 19 తేదీల్లో మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్త్రీశక్తి పథకం (మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం)తో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం తక్షణమే వాహనమిత్ర కింద రూ.25 వేలు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఎపి ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు విజయవాడ దుర్గాపురంలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో శనివారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ శివాజీ, ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, కోశాధికారి కె దుర్గారావు మీడియాతో మాట్లాడారు. ఆర్‌టిఎ జరిమానాల చలానా ఛార్జీలు తగ్గించాలని కోరుతూ ఈ నెల 18, 19 తేదీల్లో మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి అమలు చేస్తున్న ఫ్రీ బస్సు సౌకర్యంతో స్వయం ఉపాధి రంగంగా జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారన్నారు. సొంత పెట్టుబడితో ఒకపక్క ఫైనాన్స్ కిస్తీలు, మరోవైపు ఆర్‌టిఎ ఆఫీసులో పన్నులు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆటో రవాణా రంగ కార్మికులందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి, అధికారంలోకి వచ్చి 14 నెలలైనా హామీ ఇంత వరకు అమలుకు నోచుకోలేదన్నారు. రవాణా రంగం నుంచి ప్రభుత్వం పన్నుల రూపంలో రూ.కోట్లు వసూలు చేస్తున్నప్పటికీ రవాణా రంగ కార్మికులకు ఇంతవరకు సంక్షేమ చట్టాన్ని రూపొందించకపోవడమేమిటని ప్రశ్నించారు. వాహనమిత్ర పథకం కింద రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. ఆటో డ్రైవర్లకు జరిగే నష్టానికి ప్రభుత్వం బాధ్యత తీసుకుని ఆర్థికంగా ఆదుకోవాలని, లైసెన్సు ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.25 వేలు సాయం అందించాని నేతలు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయని పక్షంలో ఈ నెల 24న ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభల్లో ఆందోళన కార్యక్రమాల కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

కాంట్రాక్టు కార్మికులతో ఖాళీలు భర్తీ

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థలో ఖాళీ పోస్టులను సీనియార్టీ ప్రకారం కాంట్రాక్టు కార్మికులతో భర్తీ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె రాజశేఖర్, ఎవి నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లలో పదేళ్లకు పైగా పనిచేస్తున్న విద్యుత్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసును పరిగణనలోకి తీసుకొని ఖాళీ పోస్టుల్లో వెయిటేజ్ ఇవ్వాలని, ఏడాదికి 3 మార్కులు ఇవ్వాలని కోరారు. ట్రాన్స్‌కోలో డిప్లమో చదివిన వారందరికీ జూనియర్ ఇంజినీర్ పోస్టులు ఇవ్వాలని తెలిపారు. పోస్టుల భర్తీ సమయంలో వయసు 50 ఏళ్లకు పెంచాలని, ఎస్‌సిలకు ఐదేళ్లు, బిసిలకు మూడేళ్ల మినహాయింపు ఇవ్వాలని కోరారు. అర్హత ఉన్న నాన్ టెక్నికల్ పోస్టుల్లో ప్రస్తుతం పనిచేస్తున్న పిజి, డిగ్రీ పూర్తిచేసిన కార్మికులతో భర్తీ చేయాలని కోరారు.

జీవచ్ఛవాలుగా బతుకుతున్నాం

- బలవంతంగా తరలించి... గాలికొదిలేశారు
- సరైన గూడు లేదాయె... తాగునీరూ కరువాయె..
- 'ఉపాధి'కి తప్పని వెతలు
- ఎంఎ.బేబీ ఎదుట పోలవరం నిర్వాసితుల ఆవేదన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

'మా కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. చిన్నపాటి వర్షాలకే ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. మరుగుదొడ్లను సరైన రీతిలో నిర్మించకపోవడంతో బహిర్భూమికి బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇంటి నిర్మాణాల్లో నాణ్యత లేదు. కాంట్రాక్టర్‌ను సంప్రదిస్తే తనకు సంబంధం లేదని, తన కాలపరిమితి పూర్తయిందని, దిక్కున్న చోట చెప్పుకోండని తప్పించుకుంటున్నారు. అధికారులను సంప్రదిస్తే కనీస స్పందన కరువైంది. స్లాబులు కారిపోతున్నాయి. ఈ ఇళ్లలో ఎలా నివాసం ఉండాలి' అంటూ దేవీపట్నం మండలం తాళ్లూరు కాలనీకి చెందిన చదల పార్వతి ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత ఉన్నా తనకు పునరావాసం కల్పించలేదని వృద్ధురాలు తోకల సోమాలమ్మ తమ ప్రాంతంలో శనివారం పర్యటించిన సిపిఎం బృందం ఎదుట కన్నీటి పర్యంతమవుతూ తన గోడు విన్నవించుకున్నారు. గతంలో కొండమొదలు పంచాయతీలో నివసించేదాన్నని, అక్కడి నుంచి బలవంతంగా ఇక్కడికి తరలించారని, ప్రస్తుతం తనకు పింఛను కూడా రావడం లేదని, పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఇదే సమస్యతో బాధపడుతున్నట్లు సాధన పాపయమ్మ తన ఆవేదనను వ్యక్తం చేశారు. 'ప్రభుత్వం ఎటువంటి సాయమూ చేయకపోవడంతో ఇంటి నిర్మాణం సగంలో ఆగిపోయింది' అంటూ నాగులపల్లి కాలనీకి చెందిన చదల శ్రీనివాసరెడ్డి వాపోయారు. తనకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మాత్రమే ఇచ్చారని, పునరావాసం కల్పించలేదని తెలిపారు. దీంతో, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ డబ్బులతోనే ఇంటి నిర్మాణం ప్రారంభించానన్నారు. నగదు సరిపోక సగంలోనే నిర్మాణం నిలిపివేశానని వాపోయాడు. తన కుటుంబంలో నలుగురు అన్నదమ్ములం ఉన్నామని, పూర్తి స్థాయిలో పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించలేదని తెలిపారు. నాగులపల్లి కాలనీలో 73 కుటుంబాలకు పునరావాసం కల్పించినా, ఏ ఒక్క ఇంటి గోడకూ ప్లాస్టింగ్ చేయలేదని కుంజం వెంకటలక్ష్మి తెలిపారు. రేషన్ బియ్యం కోసం పది కిలోమీటర్లు వెళ్లవలసి వస్తోందని వివరించారు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ద్విచక్ర వాహనంపై గోకవరం మండల కేంద్రానికి వెళ్లి తెచ్చుకుంటున్నామని, ప్రయాణ ఖర్చులతో కలిపి ఒక టిన్ను నీటి ఖరీదు రూ.50 అవుతోందని వాపోయారు. తమ కాలనీలో అత్యధికమంది ఉపాధికి దూరమయ్యారని, అధికారులు గ్రామీణ ఉపాధి హామీ పనులు సైతం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితుల పునరావాస కాలనీల్లో ఏ ఇంటి తలుపు తట్టినా బాధితులంతా ఇలా తమ బాధను వెళ్లగక్కారు. జీవచ్ఛవాల్లా బతుకుతున్నామని తెలిపారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబీ, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథంతో కూడిన పార్టీ బృందం శనివారం పోలవరం నిర్వాసితుల పునరావాస కాలనీలైన తాళ్లూరు, నాగులపల్లిల్లో పర్యటించింది.

తాళ్లూరు కాలనీలో 240 కుటుంబాలకు, నాగులపల్లి కాలనీలో 73 కుటుంబాలకు ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఆయా కాలనీల్లో ఇంటింటికీ సిపిఎం బృందం వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంది. నాయకులకు అక్కడి ప్రజలు సాదర స్వాగతం పలికారు. పూలుజల్లుతూ, హారతులిస్తూ ఆహ్వానించారు. తమ సమస్యలను విన్నవించి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎ.బేబీ మాట్లాడుతూ నిర్వాసితుల పునరావాసం విషయంలో ప్రభుత్వం కనీస మానవత్వం పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు అనడానికి కూడా వీల్లేని పద్ధతుల్లో కాలనీలు నిర్మించారన్నారు. మధురపూడి విమానాశ్రయం నుంచి కోరుకొండ, గోకవరం, ఇందుకూరుపేట మీదుగా తాళ్లూరు కాలనీకి నాయకులు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, ఎం.వాణిశ్రీ, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పాల్గొన్నారు.



నాగులపల్లిలో తమ కష్టాలను ఎంఎ.బేబీకి చెబుతూ కన్నీరు పెట్టుకున్న మహిళ,



అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంఎ.బేబీ



మధురపూడి విమానాశ్రయం వద్ద సిపిఎం శ్రేణులతో పోలీసుల వాగ్వాదం



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు, సిపిఎం ఫ్లోర్‌లీడర్ జాన్ బ్రిట్టాస్

బాధితులను గాలికొదిలేసిన ప్రభుత్వాలు

- పార్లమెంట్‌లో చర్చిస్తా : రాజ్యసభ సభ్యులు, సిపిఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం నిర్వాసితుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని రాజ్యసభ సభ్యులు, సిపిఎం ఫ్లోర్‌లీడర్ జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. శనివారం ఏలూరు జిల్లాలోని పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించేందుకు ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయన అక్కడి నుంచి ఏలూరు సత్రంపాడులో సిపిఎం సీనియర్ నేతలు, కీర్తిశేషులు అన్నే వెంకటేశ్వరరావు, అనసూయమ్మ కుమార్తె కల్పన నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బ్రిట్టాస్ మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల లక్షా ఆరు వేల కుటుంబాలు నిర్వాసితులుగా మారాయని, వారికి భరోసా కల్పించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆసక్తి చూపడం లేదని అన్నారు. నిర్వాసితుల్లో 80 శాతం గిరిజనులు ఇంకా పునరావాస ఫలితాలు పొందలేదని, అందుకే నిర్వాసిత గ్రామాల్లో పర్యటించి, అక్కడ ప్రజలతో స్వయంగా మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకుని, పార్లమెంట్లో వారి పక్షాన తమ గొంతు వినిపిస్తామని చెప్పారు. అణచివేతకు గురవుతున్న వారి పక్షాన కేంద్రంతో మాట్లాడతామని తెలిపారు. పోలవరం వంటి పెద్ద పెద్ద ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రజలను వారి నివాస ప్రాంతాల నుంచి బలవంతంగా పంపించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయే తప్ప పునరావాసం కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. పునరావాసం కల్పించకుండా వారిని స్వస్థలాల నుంచి తరిమేస్తున్నారని చెప్పారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి రూ.33 వేల కోట్లు కావాల్సి ఉన్నప్పటికీ ఆ మేరకు నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వాసితులు తమ జీవనాధారం కోల్పోయి రోడ్డున పడుతున్నారన్నారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిపిఎంగా తమ వంతుగా నిర్వాసిత గ్రామాల్లో స్వయంగా పర్యటించి, వారితో మాట్లాడి, వారి సమస్యలను అర్థం చేసుకొని తగిన ప్రణాళికతో ముందుకు వెళ్తామని తెలిపారు. ఆయన వెంట సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, బి.బలరాం, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మొడియం నాగమణి ఉన్నారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

పోలవరం నుండి 4,31,813 క్యూసెక్కుల గోదావరి జలాలు విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్, పోలవరం

శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుండి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం మూడు గంటల సమయానికి ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పాదనతో 37,419 క్యూసెక్కులు, గేట్ల ద్వారా 40,836 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 30,653 క్యూసెక్కులు మొత్తం కలిపి శ్రీశైలం జలాశయానికి 1,08,908 క్యూసెక్కుల నీళ్లు వచ్చి చేరుతున్నాయి. అదే సమయానికి శ్రీశైలం డ్యాం 5 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి దిగువకు 1,33,720 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో గడిచిన 24 గంటల్లో 30,749 క్యూసెక్కుల నీటితో 15.357 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 39, 333 క్యూసెక్కులతో 16.892 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్‌కు 65,824 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడుకు 25,333 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,426 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు నీటిని నిలిపివేశారు. అదే సమయానికి జలాశయ నీటిమట్టం 885 అడుగులకుగానూ ప్రస్తుతం 882.10 అడుగులుగా, నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకుగానూ ప్రస్తుతం 199.7354 టిఎంసిలుగా నమోదైంది.



పోలవరం వద్ద పెరుగుతున్న గోదావరి జలాలు

గోదావరికి వరద

ఎగువరాష్ట్రాల్లో గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరుగుతోంది. గోదావరి ఉపనదులు కడెం, మంజీర, ఇంద్రావతి, మానేరు, ప్రాణహిత, కిన్నెరసాని, శబరి, సీలేరు నుండి, కొండవాగుల నుండి వస్తున్న జలాలతో గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 4,31,813 క్యూసెక్కుల వరద జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 29.680 మీటర్లు, దిగువన 20.240 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 29.950 మీటర్లు దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 19.800 మీటర్లు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 15.990 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు ఇఇ శ్రీనివాసరావు తెలిపారు. వేలేరుపాడు మండలంలో కొయిదా వెళ్లే మార్గంలో యడవల్లి వద్ద ఉన్న ఎద్దువాగుపై కాజ్‌వే మునిగిపోవడంతో కోయిదా, కట్కూరు, సిద్ధారం, టేకూరు, కాకిసినూరు, తాళ్లగొంది, పూచిగొంది తదితర 20 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కుక్కునూరు మండలంలో కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే పైకి వరద నీరు చేరుతోంది. పైనుంచి గోదావరి వరద ఉధృతి కొనసాగితే ఆదివారం నాటికి ఆ మార్గంలోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది.



కత్తి పద్మారావు

కత్తి పద్మారావుకు విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం

తెలుగు సాహిత్యంలో విశేషమైన కృషి చేసి, ఏడు పదుల వయసు పైబడిన ప్రముఖ సాహితీవేత్తకు ఇచ్చే విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారాన్ని కత్తి పద్మారావుకు ప్రదానం చేయనున్నట్లు విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం వ్యవస్థాపకులు శాంతి నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ సాహిత్యవేత్తలు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి (రాయలసీమ), కెపి.అశోక్‌కుమార్ (తెలంగాణ), గంటేడ గౌరునాయుడు (కోస్తా) జ్యూరీ సభ్యులుగా తమ సాహిత్య సంస్థ సూచించిన నిబంధనలను అనుసరించి కొంతమంది సుప్రసిద్ధ సాహితీవేత్తల పేర్లను పరిగణనలోకి తీసుకుని అందులో కత్తి పద్మారావును ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

గృహ రుణాలపై ఎస్‌బిఐ వడ్డీ రేట్ల పెంపు

- కొత్త ఖాతాదారులపై 25 శాతం భారం

ముంబయి : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) గృహ రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే నూతన రుణ గ్రహీతలపై మాత్రమే 25 బేసిస్ పాయింట్లు (పావు శాతం) పెంచుతున్నట్లు శనివారం వెల్లడించింది. సవరించిన వడ్డీరేట్లు ఆగస్టు 1 నుంచే అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. ముఖ్యంగా సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న ఖాతాదారులపై ఇది ఎక్కువ ప్రభావం చూపనుందని తెలిపింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా వడ్డీ రేట్లను పెంచింది. ఇతర బ్యాంక్‌లు కూడా ఇదే బాటలో నిర్ణయం తీసుకొవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాల వ్యవధిని బట్టి గృహ రుణాల వడ్డీరేట్లలో తేడా ఉండనుంది. ఇప్పటివరకు ఎస్‌బిఐ గృహ రుణ రేట్లు 7.50 శాతం నుంచి 8.45శాతంగా ఉండగా.. తాజా పెంపునతో ఇది 7.50శాతం నుంచి 8.70 శాతానికి పెరిగింది. సిబిల్ స్కోరు తక్కువగా ఉండేవారికి ఇకపై అధిక వడ్డీ రేట్లను చెలించాల్సి ఉంటుంది.

"సిబిల్ స్కోరు, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు ఆధారంగా విధించే వడ్డీరేట్లలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్పులు చేసింది. గృహ రుణాలపై మార్జిన్ పెంచుకునేందుకే వడ్డీరేట్లను పెంచాం. ఈ పెంపు కేవలం కొత్త కస్టమర్లకు మాత్రమే. ఇప్పటికే తీసుకున్న గృహరుణాలకు ఇది వర్తించదు" అని ఎస్‌బిఐ వర్గాలు స్పష్టం చేశాయి.



యూనియన్ బ్యాంక్ రుణ రేట్లు గతంలో 7.35శాతం ప్రారంభం కాగా.. ఇప్పుడు దాన్ని 10 బేసిస్ పాయింట్లు పెంచి 7.45 శాతానికి చేర్చింది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) రెపో రేటును 5.5 శాతానికి తగ్గించింది. అయినప్పటికీ బ్యాంక్‌లు వడ్డీ రేట్లను పెంచడం ఆర్థిక వ్యవస్థలో బలహీనత సంకేతాలను స్పష్టం చేస్తోన్నాయి.

బ్యాంక్ పేరు	రుణ రేటు(%)
ఎస్‌బిఐ	7.50-8.45 శాతం
యూనియన్ బ్యాంక్	7.45 శాతం
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్	7.90 శాతం
యాక్సిస్ బ్యాంక్	8.35 శాతం

నెలకు రూ.450 అదనం

ఎస్‌బిఐ తాజాగా వడ్డీ రేటు పెంపును విశ్లేషిస్తే.. ఉదాహరణకు 20 సంవత్సరాల కాల వ్యవధితో రూ.30 లక్షల గృహ రుణాన్ని 8.45 శాతం వడ్డీ రేటుతో తీసుకుంటే వాయిదా చెల్లింపు (ఇఎంఐ) సుమారు రూ.25,830 ఉండగా.. కొత్త రేటు 8.70 శాతం అమల్లోకి వస్తే ఇఎంఐ మొత్తం రూ.26,278కి పెరుగుతుంది. అంటే నెలకు రూ.450 అదనపు భారం పడనుంది. మొత్తం రుణ వ్యవధిలో రూ.1 లక్షకు పైగా అదనపు చెల్లింపు అవుతుందని అంచనా.



నిందితుడు మనోహర్

పదో తరగతి బాలిక ప్రసవం

- పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి - బనగానపల్లె

నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలో పదో తరగతి బాలిక ప్రసవించింది. లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు...బనగానపల్లె మండలంలో ఓ గ్రామానికి చెందిన పదవ తరగతి బాలికను అదే గ్రామానికి చెందిన మనోహర్ (21) మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. బాలిక గర్భం దాల్చి శనివారం బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. లైంగిక దాడికి పాల్పడిన మనోహర్‌పై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

స్పెషల్ బస్సులకు 'స్త్రీశక్తి' వర్తించదు

- రావులపాలెం డిపో నుంచి వాడపల్లి వెళ్లే బస్సులపై నోటీసు
- ఒరిజినల్ ఆధార్ లేకపోతే టికెటు కొనుగోలు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రమంతా స్త్రీశక్తి పథకం (ఉచిత బస్సు ప్రయాణం)ను ఎంతో ఆర్భాటంగా శుక్రవారం ప్రారంభించింది. అయితే, పక్క రాష్ట్రాలకు వెళ్లే బస్సులకు, దేవాలయాలకు వెళ్లే స్పెషల్ బస్సులకు స్త్రీశక్తి పథకం వర్తించదంటూ బస్సుపై పేపరు అంటించడంతో మహిళలు కంగుతున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలోని వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి సుమారు 30 డిపోల నుంచి వంద బస్సుల వరకు వివిధ ప్రాంతాల నుంచి ప్రతి శనివారం రాకపోకలు సాగిస్తాయి. రావులపాలెం డిపో నుంచి వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే స్పెషల్ బస్సులకు స్త్రీ శక్తి పథకం వర్తించదని బస్సుపై పేపరు అంటించడంతో యాత్రికులు కంగుతిన్నారు. చేసేది ఏమీ లేక టికెటు కొనుగోలు చేసి ప్రయాణించారు.



స్త్రీ శక్తి పథకం వర్తించదంటూ ఆర్‌టిసి బస్సుపై అంటించిన పేపరు

అనంతపురం జల్లాలో ఏ బస్సుకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందో దేనికి వర్తించదో తెలియక మహిళలు ఇబ్బందులు పడ్డారు. అనంతపురం రీజయన్ పరిధిలో అత్యధికంగా ఇంటర్ స్టేట్ రూట్లు ఉన్నాయి. ప్రధానంగా కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం సరిహద్దు ప్రాంతాల్లోని వారు కర్ణాటక వైపే అధికంగా ప్రయాణిస్తుంటారు. ఈ రూట్‌లలోని బస్సులకు స్త్రీశక్తి పథకం వర్తించకపోవడంతో ఛార్జీలు పెట్టుకునే వెళ్లాల్సి వస్తోంది. అనంతపురం రీజయన్ పరిధిలో మొత్తం 184 రూట్లలో ఆర్‌టిసి బస్సు సర్వీసులు నడుపుతుండగా 35 ఇంటర్ స్టేట్ రూట్లు ఉన్నాయి. ఇందులో 26 రూట్లు బెంగళూరు, పావగడ, బళ్లారి, చెళికేర వెళ్తాయి. ఈ ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ఉచిత ప్రయాణం లేదు. టికెట్టు తీసుకునే సమయంలో ఒరిజనల్ ఆధార్ కార్డు అడుగుతుండటంతో అది లేని వారు టికెట్టు తీసుకోవాల్సి వస్తోంది.

పేదరికం తగ్గిందనడం మోసం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

దేశంలో 25 శాతం పేదరికాన్ని తాము తగ్గించామని ప్రధాని మోడీ ఘనంగా చెప్పుకుంటున్నారని, అంత పేదరికమే తగ్గితే ఉచితంగా బియ్యం ఎందుకు పంపిణీ చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అదాని, అంబానిలను మోడీ ప్రభుత్వం పెంచి పోషిస్తోంది తప్ప పేదరికం తగ్గలేదన్నారు. ఈ రోజు కష్ట జీవుల సమస్యలు తగ్గలేదని, వారి జీవన ప్రమాణాలు మారలేదని వివరించారు. తాము జాతీయ జెండాను ఆమోదించడం లేదని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆర్ఎస్ఎస్ ఆనాడే చెప్పిందని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని కూడా తాము తిరస్కరిస్తున్నట్టు ప్రకటించిందని గుర్తు చేశారు. సెప్టెంబర్‌కు మోడీకి 75 ఏళ్లు నిండిపోతాయని, ప్రధాని పదవిలో వేరొకరిని కూర్చోబెట్టేందుకు ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవంలో ఆర్ఎస్ఎస్‌ను ఆకాశానికెత్తేశారని విమర్శించారు. నష్టపరిహారాన్ని తగ్గించేందుకు పోలవరం ఎత్తును తగ్గించాలని చూస్తున్నారని, దీంతో ఓ బ్యారేజీలా పోలవరం మిగిలిపోతుందని తెలిపారు.

శ్రీవాణి టికెట్ల కోసం యాత్రికుల నిరసన

- శ్రీవారి దర్శనానికి 30 గంటలు

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవాణి టికెట్ల విషయంలో గందరగోళం నెలకొనడంతో యాత్రికులు నిరసనకు దిగారు. శనివారం వేకువజామున నాలుగు గంటలకు టికెట్లను జారీ చేస్తామని ముందుగా టిటిడి ప్రకటించింది. అయితే శుక్రవారంతోపాటు వారాంతపు సెలవులు రావడంతో తిరుమలకు యాత్రికులు భారీగా తరలివచ్చారు. తక్కువ సమయం ఉండడంతో శ్రీవాణి టికెట్ల కోసం యాత్రికులు పోటీపడ్డారు. రద్దీని నియంత్రించలేక శుక్రవారం అర్ధరాత్రి నుంచే టికెట్ల విక్రయాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. రాత్రి టికెట్లు ఇచ్చిన విషయం తెలియక శనివారం ఉదయం శ్రీవాణి టికెట్ల కోసం వచ్చిన యాత్రికులు ఆందోళనకు దిగారు. టికెట్లు దొరక్కపోవడంతో అన్నమయ్య భవనం ఎదుట నిరసన తెలిపారు. అదనపు ఇఒ సర్దిచెప్పడంతో నిరసనను విరమించారు. వైకుంఠం-2, నారాయణగిరి షెడ్లు యాత్రికులతో నిండిపోయాయి. ఆక్టోపస్ బిల్డింగ్ సర్కిల్ వరకు క్యూలైన్‌లో యాత్రికులు వేచి ఉన్నారు. శ్రీవారి దర్శనానికి 30 గంటల పైనే సమయం పడుతోంది.



శ్రీవాణి టికెట్ల కోసం నిరసన తెలుపుతున్న యాత్రికులు

ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో 47 శాతం వృద్ధి : మంత్రి పియూష్ గోయల్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 47 శాతం పెరిగి 12.4 బిలియన్ డాలర్లకు చేరాయని కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ వెల్లడించారు. 2014-15లో 31 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి 2024-25 నాటికి 133 బిలియన్ డాలర్లకు చేరాయని గోయల్ తన ఎక్స్ ఖాతాలో తెలిపారు. మొబైల్ తయారీ యూనిట్లు 300కు పెరిగాయన్నారు.

ప్రపంచంలో భారత్ రెండవ అతిపెద్ద మొబైల్ ఫోన్ తయారీ దేశంగా మారిందన్నారు. సోలార్ మాడ్యూల్స్, నెట్‌వర్కింగ్ డివైసెస్, ఛార్జర్లు వంటివి ఎగుమతులను బలోపేతం చేశాయన్నారు.

గ్లోబల్ మార్కెట్‌పై ఓలా ఇవి దృష్టి

బెంగళూరు : అంతర్జాతీయ మార్కెట్‌పై దృష్టి పెట్టినట్లు ఓలా ఎలక్ట్రిక్ వెల్లడించింది. తమ కొత్త ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ డైమండ్‌హెడ్‌ను ఆవిష్కరించింది. దీని ధర రూ.5 లక్షలుగా నిర్ణయించింది. ఇది కమ్యూటింగ్, టూరింగ్ మరియు పెర్ఫార్మన్స్ రైడింగ్ కోసం రూపొందించబడిందని తెలిపింది. దీని డెలివరీలను 2027లో ప్రారంభమవుతాయని పేర్కొంది. 2026 నాటికి 10,000 హైపర్‌చార్జర్‌లతో ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించాలని ఓలా లక్ష్యంగా పెట్టుకుంది.

సంపాదకీయం

త్యాగాలకు మకిలి అంటదు

'**జీ**వించడానికి ఒక కారణం వుండాలి, మరణించడానికి ఒక విలువ వుండాలి' అంటారు అంబేద్కర్. ప్రపంచ చరిత్ర ప్రతి పుటలోనూ దేశం కోసం, జాతి విముక్తి కోసం చేసిన ప్రాణ త్యాగాలు మన కళ్ల ముందు కదలాడతాయి. స్ఫూర్తివంతమైన పోరాటాలతో త్యాగానికి పర్యాయ పదంగా నిలిచి, తమ జీవితాలను చరితార్థం చేసుకున్న వారు అనేకం. భారతదేశ స్వాతంత్య్రం...దాని నిజమైన వారసుల అసాధారణ ధైర్యం, తెగువ, నిస్వార్థతకు నివాళిగా నిలుస్తుంది. 'త్యాగాలు... చరిత్ర పుటల్ని వెలిగించే దీపస్తంభాలు' అంటారో రచయిత. తన చివరి శ్వాస వరకూ దేశ సేవకే అంకితమైన సైనికులు, స్వాతంత్య్రం కోసం ఉరిశిక్షను ధైర్యంగా ఎదుర్కొన్న యువకులు, సమాజం కోసం తమ మేధస్సును కొవ్వొత్తిలా కరిగించిన నాయకులు... వీరి చరిత్రలు, చరిత్రలో వీరి జ్ఞాపకాలు మనకు త్యాగం అంటే ఏమిటో నేర్పుతాయి. 'దేశం కోసం ప్రాణాలు అర్పించినవారు చనిపోలేదు, మనం వారి త్యాగాలను మరచినప్పుడే వారు నిజంగా చనిపోతారు' అంటారు అమెరికన్ రచయిత లారెన్స్ బిన్యాన్ తన 'ఫర్ ద ఫాలెన్' అనే కవితలో. బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా సాగిన అచంచల పోరాట స్ఫూర్తే... భారతదేశ సార్వభౌమత్వాన్ని నేటికీ కాపాడుతోంది. 'జీవితం కన్నా విలువైనది దేశం...' అన్న భావనను నకిలీ దేశభక్తి మసకబార్చే ప్రయత్నం పెద్దఎత్తున చేస్తోంది. దేశభక్తి ఒక జీవన విధానంగా కాక, ఒక ప్రచార బ్రాండ్‌గా మారిపోయింది.

త్యాగమనే పదం ఒకప్పుడు పవిత్ర గ్రంథంలా భావించబడేది. దేశం కోసం, జాతికోసం ప్రాణాలు అర్పించినవారు, స్వార్థాలను త్యజించి... సత్యం కోసం పోరాడినవారు త్యాగానికి పర్యాయపదంగా నిలిచారు. గాంధీజీ నుంచి గోపాలకృష్ణ గోఖలే వరకు, అల్లూరి నుంచి భగత్‌సింగ్ వరకూ అనేకుల జీవితాల బలిదానం ఈ దేశానికి స్వేచ్ఛనిచ్చింది. నేడు త్యాగం యొక్క అసలు అర్థాన్ని వక్రీకరిస్తూ, సత్యానికి మసిపూస్తూ... నకిలీ నిర్వచనాలను వల్లెవేస్తున్నారు. తాజాగా భారత ప్రధాని స్వాతంత్య్ర దినోత్సవంనాడు ఎర్రకోట నుంచి కాషాయోపనిషత్తులను వల్లించారు. గాంధీజీ హత్య తర్వాత నిషేధించబడిన ఆర్‌ఎస్‌ఎస్‌కు, ఈ హత్య కుట్ర కేసులో విచారణకు గురైన వి.డి.సావర్కర్‌కు స్వాతంత్య్రం మాతృకను కట్టబెట్టాలనుకునే వారి ప్రయత్నం.. చరిత్రను తిరస్కరించడమే. స్వాతంత్య్ర పోరాటాన్ని అవమానించడానికి, బ్రిటిష్ వారికి సేవ చేసిన వారిని, ఆర్‌ఎస్‌ఎస్‌ను కీర్తించడానికి ఎర్రకోటను వేదికగా చేసుకున్నారు ప్రధాని. కేంద్ర పెట్రోలియం మంత్రి అయితే, తమ శాఖ శుభాకాంక్షల కార్డులో గాంధీజీ ఫొటో కంటే, సావర్కర్ ఫొటోను ప్రముఖంగా ముద్రించారు. ఇవన్నీ కలిపి చూస్తే.. ఇదంతా పెద్ద కుట్రలో భాగమనే అర్థమౌతుంది. భారతీయులంతా కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా జాతీయ స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొంటే, ఆ సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ దేశద్రోహుల పాత్ర పోషించింది. భిన్నత్వంలో ఏకత్వాన్ని నిలబెట్టే జాతీయవాదానికి బదులుగా, మెజారిటీ మతతత్వమైన హిందూత్వ జాతీయవాదాన్ని సమర్థించారు. ఇది జాతీయోద్యమ స్ఫూర్తిని, స్వాతంత్య్రోద్యమ చరిత్రను కించపరచడమే అవుతుంది. స్వాతంత్య్ర పోరాటంలోని అన్ని దశల్లోనూ దూరంగా వున్న ఆర్‌ఎస్‌ఎస్, ఇప్పుడు జాతీయోద్యమంలో కూడా తన పాత్ర వుందని నిరూపించుకోడానికి తప్పుడు కథనాలను వండి వార్చడంలో నిమగ్నమైవుంది.

భారతదేశ గొప్ప స్వాతంత్య్ర పోరాట చరిత్ర- అమానవీయ మతతత్వ భావాజాలాన్ని మోసేవారిది కాదు. గాంధీజీ, భగత్‌సింగ్ వంటి వారి త్యాగాలతో నిర్మితమైన భారతీయ చరిత్రను తుడిచివేయాలనుకునే ఏ చర్యనైనా దేశం సమైక్యంగా ఎదుర్కోవాలి. రాజ్యాంగానికి బదులు మనుస్మృతిని అమలు చేయాలనుకునే వారి కుట్రలను తిప్పికొట్టాలి. 'నేను బలి కావడానికి సిద్ధంగా ఉన్నాను, ఎందుకంటే నా దేశం స్వేచ్ఛగా శ్వాసించాలి' అంటాడు భగత్‌సింగ్. ఇలాంటి త్యాగాలకు కొత్త నిర్వచనాలు కట్టాల్సిన అవసరం లేదు. త్యాగాలకు మకిలి అంటదు, నిప్పుకు చెదలు పట్టదు. త్యాగమూ అంతే. అది సమాజానికి ఒక శాశ్వత స్ఫూర్తి. ఈ విలువైన వారసత్వాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యం. 'జీవించడం అంటే ఇతరుల కోసం జీవించడం' అన్న స్వామి వివేకానంద మాటలు నిజమైన త్యాగానికి సరైన నిర్వచనం.

మహనీయుల మాట




దేశాన్ని ప్రజల పరం చేయాలి.
ధనికుల అధిక లాభాల కోసం
ప్రజలు బలికావడం అంతం కావాలి.
ఆదర్శరహితమైన గూడుపుఠాణి
రాజకీయాలూ ప్రజల జీవితంలో
స్థానం లేని మత సంపర్కాలూ
తక్షణం నిర్మూలనం కావాలి.
- కొడవటిగంటి కుటుంబరావు,
ప్రసిద్ధ తెలుగు రచయిత, హేతువాది.
జననం: 28.10.1909
మరణం: 17.8.1980

సందర్భం

మన దేశ వారసత్వాన్ని కాపాడుకుందాం
ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం

కుల, మత, జాతి, భాషా బేధాలు లేకుండా...రాజ్యాంగబద్ధంగా ఏర్పడ్డ మన ప్రజాస్వామిక దేశంలో...ప్రజలంతా ఐకమత్యంగా జీవించాలనేది జాతీయోద్యమ నాయకుల ఆకాంక్ష, లక్ష్యం కూడా. ఇవాళ కేంద్రంలో మెజార్టీ మతతత్వ రాజకీయాలు రాజ్యం చేస్తాయని మన జాతీయోద్యమ నాయకులు కలలో కూడా ఊహించి ఉండరు. ప్రజలు తినే తిండి మీద, కట్టుకునే బట్ట మీద, వ్యక్తిగత మత విశ్వాసాల మీద, జీవన శైలిమీద మతతత్వ శక్తులు దుర్మార్గమైన దాడికి తెగబడుతున్నాయి. మైనార్టీ మతస్తులను ముఖ్యంగా ముస్లింలను ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తున్నాయి. నిరసన, అసమ్మతి, భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేసిన వ్యక్తులు, సంస్థల మీద క్రూరమైన నిర్బంధానికి, అణచివేతలకు పాల్పడతాయి. మన రాజ్యాంగ సూత్రాలను నీరుగార్చే ప్రయత్నాలను మనమంతా ఐక్యంగా నిలబడి నిలవరించాల్సిన అవసరాన్ని ఈ స్వాతంత్య్ర దినోత్సవం తెలియచెబుతున్నది.

1947 ఆగస్టు 15న న్యూఢిల్లీ లోని రైసినా హిల్ దగ్గర పోగైన ప్రజానీకం



ప్రతి ఏటా మనం బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలన నుంచి సముపార్జించుకున్న రాజకీయ స్వాతంత్య్రాన్ని సంబరంగా జరుపుకుంటాం. మన జాతి నిర్మాతల ఆశయాలకు పునరంకితం అవుతామని విధేయంగా ప్రకటిస్తుంటాం. ఆ విధంగా దేశ స్వాతంత్య్రం కోసం సాగిన సుదీర్ఘ పోరాటాన్ని మనం ఈ పంద్రాగస్టునాడు స్మరించుకుంటాం. జాతి, మత, ప్రాంత, భాషాభేదాలకు అతీతంగా కోట్లాది మంది ప్రజానీకం ఈ వీరోచిత పోరాటంలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామరస్యం, సామాజికాభివృద్ధి వంటి ఉదాత్త విలువలు, సూత్రాల సాధన లక్ష్యంగా పెట్టుకున్నారు. కాబట్టి స్వాతంత్య్ర దినోత్సవ సంబరం జరుపుకోవడమంటే భారత రాజ్యాంగంలో పొందుపరుచుకున్న ఆశయాలను నెరవేర్చుకోవడంలో మనం ఇన్నేళ్లుగా సాధించుకున్న ప్రగతి ఏమిటని అవలోకించుకోవడమే.

జాతీయతా భావన సారాంశం-దానిని తారుమారు చేసే ప్రయత్నాలు

దీనిని అర్థం చేసుకోవాలంటే మనం జాతీయోద్యమ మూలాల్లోకి వెళ్లాలి. విముక్తి పోరాటం అంటే కేవలం పరాయి దేశపు జెండా బదులు మన జెండా ఎగురవేయడం కాదు. విముక్తి పోరాటం అంటే సుసంపన్నమైన, సంపద్వంతమైన దేశాన్ని సాధించుకోవడానికి ఎంచుకున్న మార్గం. దేశ వనరుల్లో ప్రజలందరికీ సమాన అవకాశాలు దక్కేలా, చట్టం ముందు అందరూ సమానం అన్న ఆదర్శప్రాయమైన లక్ష్యం సాధించుకునేందుకు సాగించిన సమరం. ఈ దేశంలో నివసించే ప్రతి పౌరుడూ ఆత్మగౌరవంతో తలెత్తుకు బతికేలా ప్రపంచం ముందు సగర్వంగా నిలబడేలా చెయ్యడమే మన జాతీయోద్యమ లక్ష్యం. కాబట్టి నిజమైన దేశభక్తులు ఎవరైనాసరే ముందు మన సమాజంలో అట్టడుగున నివసించే ప్రజానీకం జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి కృషి చెయ్యాలి.

ఈ స్వాతంత్య్ర దినోత్సవ శుభతరుణాన మన జాతి నిర్మాతలు కలలుగన్న మేరకు ఈ దేశం అభివృద్ధి చెందిందా లేదా, అణగారిన ప్రజానీకం జీవన ప్రమాణాలు మెరుగయ్యాయా లేదా అని మనకు మనం ప్రశ్నించుకోవాలి. మనం కొన్ని ఆర్థిక, సామాజిక ప్రమాణాల్లో చాలా మెరుగుదల సాధించాలి. కానీ అట్టడుగు ప్రజానీకం జీవన ప్రమాణాలను మెరుగుపరిచామా అంటే జవాబు ఆశాజనకంగా లేదు. సృష్టించబడుతున్న సంపదలో సింహభాగం గుప్పెడు మంది శతకోటీశ్వరుల బొక్కసాల్లోకి చేరుతున్నది. ఈ గుప్పెడు మందే ఇవాళ విధాన నిర్ణేతల మీద, విధాన నిర్ణయ వ్యవస్థల మీదా గట్టి పట్టు సాధిస్తున్నారు.



పినరయి విజయన్

నానాటికీ పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, పోషకాహార లేమి, దారిద్ర్యం బారిన పడి మెజార్టీ ప్రజానీకం సతమతం అవుతున్నారు. దీనికి కారణం ప్రభుత్వం శతకోటీశ్వరులు, బడా కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు అనుగుణమైన విధానాలు అవలంబించడమే. మార్కెట్ ఆధారిత వ్యవస్థకు తలుపులు బార్లా తెరవడంతో వ్యక్తిగత పోటీకి దారితీసే నయా సామాజిక-ఆర్థిక విధానాల వ్యవస్థ నెలకొన్నది. 'భారత దేశపు ఆత్మ'గా మహాత్మా గాంధీ భావించిన రైతులు వ్యవసాయం గిట్టుబాటుకాక తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. నయా ఉదారవాద విధానాల మూలంగా ఆర్థిక వ్యవస్థ ప్రతిష్టంభనకు లోనవుతున్నది. ఈ రకమైన దుర్భర పరిస్థితిని తక్షణమే సరిదిద్దడానికి అవసరమైన విధానపరమైన చర్యలు చేపట్టి మన జాతీయోద్యమ నాయకుల ఆకాంక్షలు నెరవేర్చే మార్గాన్ని అనుసరించాలి.

సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు వివిధ నిరసన రూపాల ద్వారా వ్యక్తం చేస్తున్నారంటే దాని అర్థం పాలకులు తాము అనుసరిస్తున్న విధానాల్లో లోపం ఎక్కడ ఉందో గుర్తించి సరిదిద్దుకోవాలని ఆకాంక్షిస్తున్నారనే. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద ఏదో ఒక రూపంలో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడాన్ని ప్రమాదకరంగానో తిరుగుబాటు ధోరణిగానో పరిగణించకూడదు. బాధ్యతగల పౌరులకు ఉండే హక్కు అది. కనీస హేతుకమైన విమర్శలను కూడా జాతీయ సమగ్రతకు ప్రమాదకరం అన్న ముద్ర వేసి అణచివేయాలనే ధోరణి నానాటికీ పెరుగుతున్నది.

భిన్నాభిప్రాయాన్ని, అసమ్మతిని వ్యక్తం చేసిన వారి మీద దేశద్రోహులని ముద్ర వేసి దేశభక్తి నిర్వచనాన్నే తారుమారు చేస్తున్నాయి కొన్ని తిరోగమన శక్తులు. ప్రజలలో నెలకొని ఉన్న అసంతృప్తిని విద్వేషం, మతోన్మాదం వైపు మళ్లిస్తున్నాయి. మెజారిటీ మత అస్తిత్వమే భారతీయతకు గుర్తింపు అని అర్థరహిత వాదనలు చలామణి చేస్తున్నాయి. ఈ రకమైన విద్వేషభరిత విభజన రాజకీయాలు మన సమాజంలో చీలికలు సృష్టిస్తాయి. మైనార్టీ మతస్తులను ప్రధాన స్రవంతి నుండి వేరు చేస్తాయి. నిజానికి ఈ విభజన రాజకీయాలు మన జాతీయోద్యమ వారసత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తాయి. కుల, మత, జాతి, భాషా బేధాలు లేకుండా...రాజ్యాంగబద్ధంగా ఏర్పడ్డ మన ప్రజాస్వామిక దేశంలో...ప్రజలంతా ఐకమత్యంగా జీవించాలనేది జాతీయోద్యమ నాయకుల ఆకాంక్ష, లక్ష్యం కూడా. ఇవాళ కేంద్రంలో మెజార్టీ మతతత్వ రాజకీయాలు రాజ్యం చేస్తాయని మన జాతీయోద్యమ నాయకులు కలలో కూడా ఊహించి ఉండరు. ప్రజలు తినే తిండి మీద, కట్టుకునే బట్ట మీద, వ్యక్తిగత మత విశ్వాసాల మీద, జీవన శైలిమీద మతతత్వ శక్తులు దుర్మార్గమైన దాడికి తెగబడుతున్నాయి. మైనార్టీ మతస్తులను ముఖ్యంగా ముస్లింలను ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తున్నాయి. నిరసన, అసమ్మతి, భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేసిన వ్యక్తులు, సంస్థల మీద క్రూరమైన నిర్బంధానికి, అణచివేతలకు పాల్పడతాయి.

ఈ స్వాతంత్య్ర దినోత్సవం మన దేశ పరిస్థితి ఎంతగా దిగజారిందో గుర్తుచేస్తున్నది. ఎలా ఉండే దేశం ఎలా అయిపోయిందో గమనిస్తే-మన రాజ్యాంగ సూత్రాలను నీరుగార్చే ప్రయత్నాలను మనమంతా ఐక్యంగా నిలబడి నిలవరించాల్సిన అవసరాన్ని తెలియచెబుతున్నది.

రాజ్యాంగ నిర్మాణం - సమాఖ్యతత్వం

పాలనా పరమైన విధాన నిర్ణయాలు రూపొందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధులు, బాధ్యతలు ఏమిటో మన రాజ్యాంగం స్పష్టంగా విభజించి చెప్పింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణాత్మకంగా ఇచ్చిపుచ్చుకునే ధోరణిని అవలంబిస్తూ దేశాన్ని, రాష్ట్రాలను ఒక దానికొకటి బలోపేతం చేసుకునే రీతిలో సహకార సమాఖ్యతత్వం ద్వారా ఎవరి విధులు ఏమిటో రాజ్యాంగ నిర్మాతలు స్పష్టంగా నిర్దేశించారు. దేశ రక్షణ, విదేశాంగ విధానాలపై కేంద్రానికి సంపూర్ణ అధికారాలు ఉంటాయి. శాంతి భద్రతలు, వ్యవసాయం, విద్య, వైద్య రంగాలపై రాష్ట్రాలకు గణనీయమైన రీతిలో స్వయం ప్రతిపత్తి అధికారాలు ఉంటాయి. శాసనసభ, గవర్నరు పాత్ర, ఆర్థిక వనరుల పంపకం వంటివి రాష్ట్రాలను కేంద్రానికి లొంగి ఉండే ఉద్దేశంతో కాక సహకార సుపరిపాలనకు తోడ్పడేందుకు రూపొందించారు.

"కేంద్రం అంటే కేవలం రాష్ట్రాల సమూహం కాదు, కేంద్రానికి దానికి తగ్గ సార్వభౌమాధికారం ఉన్నది. అలాగే రాష్ట్రాలు అంటే కేంద్రానికి తోకలు కాదు" అని డా॥బి.ఆర్.అంబేద్కర్ విస్పష్టంగా ప్రకటించాడు. ఈ రెండింటి మధ్య నెలకొని ఉండాల్సిన సమతుల్యత మన ప్రజాస్వామ్యంలో కీలకం. కానీ గత పదేళ్ళుగా రాజ్యాంగ పరమైన ఈ సమతుల్యతను మునుపెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఒక పద్ధతి ప్రకారం దెబ్బ తీస్తూ వస్తున్నారు. రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని పలుచన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' పేరిట రాష్ట్ర పరిపాలనా వ్యవస్థలో కేంద్రం జోక్యాన్ని విస్తరింప చేసుకునే కుట్రకు తెరతీసింది.

'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనేది కేవలం ఎన్నికల సంస్కరణ ఎంత మాత్రమూ కాదు. రాష్ట్ర శాసనసభల పదవీ కాలాన్ని పార్లమెంటు పదవీ కాలంతో అనుసంధానించడం అంటే ప్రజా తీర్పును వమ్ము చెయ్యడమే. రాష్ట్రాల ప్రజానీకానికి తమ తమ రాష్ట్రాలకు పూర్తి ఐదేళ్ళ పాటు ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే హక్కును కాలరాయడమే. తద్వారా రాష్ట్రాలు ఫెడరల్ యూనియన్‌లో సమాన భాగస్వాములుగా కాకుండా కేవలం కేంద్రం అనుసరించే విధానాలను అమలు చేసే కార్యాలయాలుగా తయారవుతాయి.

అలాగే కేంద్ర పరిశోధక సంస్థలు అధికార యంత్రాంగాలను ఆయుధాలుగా వాడుకుని ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయాలను ప్రభావితం చెయ్యడానికి పాల్పడే అవకాశం మరింత ఎక్కువ అవుతుంది. ఎన్నికల సంఘం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆఖరుకి గవర్నరు వంటి స్వయం ప్రతిపత్తిగల సంస్థలు, పదవులు కూడా తీవ్ర సవాళ్ళను ఎదుర్కొంటాయి.

గవర్నర్ల అధికార దుర్వినియోగం

అధికార కేంద్రీకరణలో భాగంగా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం గవర్నర్ల వ్యవస్థను ఎంతగా దుర్వినియోగం చేస్తున్నదో కళ్ళకు కట్టినట్లు కనబడుతున్నది. గవర్నరు రాజ్యాంగ బద్ధంగా ఎన్నికయిన రాష్ట్ర ప్రభుత్వాల సలహాలు, సహకారాల మేరకు తమ విధులు నిర్వర్తించాలి. కానీ ఇవాళ గవర్నర్లు కేంద్రం తరఫున పని చేసే ఏజెంట్లుగా తయారై బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనను దెబ్బ తియ్యడానికి ప్రయత్నిస్తున్నారు.

కేరళ సహా వివిధ ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభలో ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు ఆమోద ముద్ర వెయ్యకుండా నెలల తరబడి తొక్కిపెట్టి వాటిని చట్ట రూపం దాల్చకుండా అడ్డు పడుతున్నారు. శాసనసభ ఆమోదించిన బిల్లులను రాజ్యాంగపరంగా ఏ కారణాలతో ఆమోదించడానికి నిరాకరిస్తున్నారో కూడా తెలియ చెప్పకుండా కాలహరణానికి పాల్పడుతున్నారు. తద్వారా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందించిన విధానాలను అమలు చెయ్యడానికి వీల్లేకుండా అడ్డుపడుతున్నారు.

ఈ జోక్యం ఉన్నత విద్యారంగంలో మరింత మితిమీరిపోయింది. కేరళలో విశ్వవిద్యాలయాలు చాలా కాలంగా అకడమిక్ స్వయం ప్రతిపత్తితో వ్యవహరిస్తూ గొప్ప పేరు గడించాయి. గవర్నరు రాజ్యాంగపరంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా కూడా వ్యవహరించే అవకాశం ఉంది కాబట్టి దానిని అడ్డం పెట్టుకుని విశ్వవిద్యాలయాల్లో నియామకాలకు కూడా అడ్డు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైస్‌ఛాన్సలర్ పదవులకు సిఫార్సు చేసిన పేర్లను ఆమోదించకుండా తొక్కి పట్టడమే కాదు. రిజిస్ట్రార్, ప్రొఫెసర్ పోస్టులకు చేపట్టిన నియామకాలను కూడా అకారణంగా రద్దు చేశారు. దీనితో విశ్వవిద్యాలయాల్లో బోధనా ప్రమాణాల మీద తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతున్నది. వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్దేశించిన ఉదాత్త వ్యవస్థగా గవర్నరు వ్యవస్థను నిర్వహించడానికి బదులుగా రాజకీయంగా 'వీటో' అధికారాలు వినియోగించే సంస్థ స్థాయికి దిగజార్చారు. రాష్ట్ర ప్రభుత్వాల పని తీరును, ఉన్నత విద్యా వ్యవస్థను కేంద్రం సర్వభ్రష్టం పట్టించాలని చూస్తున్నది. కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి అనుసంధానంగా పని చెయ్యాల్సిన గవర్నర్ల వ్యవస్థ అడ్డుగోడగా తయారయ్యింది.

ఈ స్వాతంత్య్ర దినోత్సవాన రాజ్యాంగబద్ధమైన సమాఖ్యతత్వం, ప్రజాస్వామిక బహుళత్వం వంటి ఉన్నత విలువలకు పునరంకితం కావడం ద్వారా మన జాతీయ వారసత్వాన్ని గౌరవించుకుందాం. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి భంగం కలిగించే, రాజ్యాంగ పదవులను దుర్వినియోగం చేసే, లౌకికతత్వాన్ని దెబ్బ తీసే రాజకీయాలను నికరంగా ఎదుర్కొందాం.


మన స్వాతంత్య్ర పోరాట లక్ష్యం కేవలం వలస పాలన నుండి విముక్తి పొందడం వరకే పరిమితం కాదు. రాజ్యాంగపరమైన ప్రజాస్వామిక ఉదాత్త ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడూ స్వేచ్ఛగా, గౌరవప్రదంగా సహోదరత్వ, సమానత్వ భావనతో జీవించే ఆదర్శవంతమైన రాజ్యంగా ఈ దేశాన్ని మలుచుకుందాం. స్పష్టతతో, నిబద్ధతతో, ధైర్యంతో మనం నేటి జాతీయోద్యమ వారసత్వాన్ని పరిరక్షించుకోవడానికి పాటుపడదాం. తదనుగుణంగా ప్రతిన పూనుదాం. తద్వారా మనం సాధించుకున్న ఈ సత్వంత దేశాన్ని మరింత చురుగ్గా, సంపద్వంతంగా రాబోయే తరాలకు అందిద్దాం.

(వాసకర్త కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి, సిపి(ఐ)యం పొలిట్‌బ్యూరో సభ్యులు)
('హిందూ' సౌజన్యంతో)

ప్రస్తుతం

కేంద్రం కుత్సితాలు, కళ్లు తెరవని ప్రాంతీయులు


దక్షిణాసియాలో చాలా దేశాలలో ప్రజాస్వామ్యం కల్లోలాలు, కుట్రలు ఎదుర్కొన్నప్పటికీ భారతదేశం స్థిరంగా నిలబడగలిగిందంటే ఇక్కడ బలీయమైన రాజ్యాంగ పునాదులు, ప్రజా చైతన్యం, లౌకిక సంస్కృతి కారణం. కచ్చితంగా ఆ పునాదులకే ఇప్పుడు సవాలు ఎదురవుతున్నట్లు తాజా పరిణామాలు చెబుతున్నాయి. ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పలికిన పలుకులూ అదే తీవ్ర హెచ్చరికకు కారణమవుతున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యం మొత్తం మీద పదిలంగా కొనసాగడానికి కీలకమైన ఒక కారణం సార్వత్రిక ఓటింగ్ హక్కు. కుల, మత జాతి, భాష, లింగ వివక్ష లేని ఓటింగ్ హక్కు. పంజాబీ, సింధు, గుజరాత్, మరాఠా, ద్రావిడ, ఉత్కళ వంగ అనే రవీంద్రుడు రచించిన జాతీయ గీతాన్ని మనం పాడుకుంటున్నప్పుడు భారత భాగ్య విధాతను వీటన్నిటి ప్రతిరూపంగానే చూస్తాం తప్ప విభజనలు ఆలోచించం. ఈ నేపథ్యంలో ఎర్రకోట నుంచి చేసిన తాజా ప్రసంగంలో ప్రధాని మోడీ దేశ జనాభా పొందికను మార్చేందుకు కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని చేసిన ఆరోపణల్లో అతి పెద్ద అదృశ్య కుట్ర కనిపిస్తుంది. 140 కోట్ల జనాభా కలిగిన ఒక చారిత్రిక వైవిధ్యభరిత దేశ జనాభా పొందిక ఎవరైనా ఎలా మార్చగలరనేది పెద్ద ప్రశ్న. అయితే అలా మారిపోతుందన్న భయాందోళనలు జనంలో సృష్టించితే మిగిలిన పని దానికదే జరిగిపోతుందన్నది మోడీ, ఆయనను నడిపించే ఆర్.ఎస్.ఎస్ సంఘ పరివార్ వ్యూహం. అందుకనే ఈ వ్యాఖ్యలతో పాటే ప్రధానమంత్రి వందేళ్ళ ఆర్.ఎస్.ఎస్ ఘనతను కూడా కీర్తించి తరించారు. దేశంలోనే అతి పెద్ద ఎన్జీవో (ప్రభుత్వేతర సంస్థ)గా ఆయనే అభివర్ణించిన ఆర్.ఎస్.ఎస్ దేశానికి మార్గదర్శి కావటం కన్నా అభ్యంతరకరమైన విషయం ఇంకొకటి ఉండదు.



తెలకపల్లి రవి

మతాలు, జాతుల ముచ్చటేంటి?

కానీ గతంలో వాజ్‌పేయి వంటి వారి హయాంలో రహస్య ఎజెండాగా ఉన్నది కాస్త ఇప్పుడు ఏకంగా ఎర్రకోటపై జాతీయ జెండాతో పాటు ఎగురవేయబడటమే దిగ్భ్రాంతికరమైన విషయం. ఇరుగు పొరుగు దేశాల్లో నుంచి, ఇతర మతాల నుంచి ఈ ముప్పు పొంచి ఉందని మోడీ మాటల సారాంశం విడమర్చి చెప్పనక్కర్లేదు. కచ్చితంగా ఈ సమయంలోనే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, బిజెపి ని మించిన సనాతన సంఘీయుడు పవన్ కల్యాణ్ కూడా దేశానికి వ్యతిరేకంగా కుట్ర జరుగుతున్నదని ప్రతిపక్షాలపై నిందలు వేయడం యాదృచ్ఛికం కాదు. ఇంచుమించు ఇదే రీతిలో తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా "మార్వాడీలకు, గుజరాతీలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు ముసుగులో కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నదని" అర్థరహితమైన అభాండం వేశారు. రాజ్‌దీప్ సర్దేశాయ్ లాంటి పాత్రికేయుడు దేశంలో ముస్లింలకే కాక క్రైస్తవులకు కూడా వేధింపులు పెరిగిపోతున్నాయని సూటిగానే వ్యాసం రాశారు. అక్రమ వలసలను అడ్డుకునే పేరిట బిజెపి పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు అనేకం గీత దాటి వ్యవహరిస్తున్నారని స్వాతంత్య్ర దినోత్సవం రోజునే 'హిందూ' సంపాదకీయం రాసింది. అధికార పత్రాలు లేని బంగ్లాదేశీయులుగా ముద్ర వేసి ఆ పేరుతో బెంగాలీల ఓటు హక్కు హరించే ఒక పెద్ద కార్యక్రమం సాగుతున్నదని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శను పరోక్షంగా 'హిందూ' ప్రస్తావించింది. భారతదేశ విభజన సరిహద్దులను వలసవాద ప్రభుత్వం నిర్ణయించింది గనక సంయమనంతో వ్యవహరించాలని ఆ పత్రిక హెచ్చరిస్తే సరిగ్గా అదే అంశాన్ని వక్రీకరించి రాజకీయం నడిపిస్తున్నది బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్ లే. దేశ విభజన ముప్పును మర్చిపోరాదని మోడీ చెప్పగా అమిత్ షా మరింత దూరం వెళ్లారు. ఆయన నియమించిన కేరళ గవర్నర్ "విభజన దినమే జరిపారు. ఈ రకరకాల ఎత్తుగడల విడివిడి పరిణామాలను ఒక్క రేఖతో కలిపి చూడాలి. జాతీయత, పౌరసత్వం మంత్ర జపంతో ప్రజలను మత ప్రాతిపదికన విడగొట్టడం అసలు పథకం. పౌరసత్వం, ఓటు హక్కు అన్న అంశాలను కలగాపులగం చేయడం రాజ్యాంగ విరుద్ధమని గతంలో చాలాసార్లు చెప్పుకున్నదే కానీ ఈ చర్చ తీసుకొచ్చిన బి.జె.పి ఏకంగా కాంగ్రెస్ కీలక నేత సోనియా గాంధీకి అక్రమ ఓటు హక్కు కల్పించారని 45 ఏళ్ళ కిందటి ముచ్చటలు తవ్వి తీసి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నది. కేంద్రంలో పాలక కూటమికి పదేళ్లపాటు ఆధ్వర్యం వహించిన సోనియా గాంధీ పైనే నేరుగా ఆరోపణలు చేస్తున్నవారు...ఎక్కడో ఉత్తరాది రాష్ట్రాల్లో మారుమూల పల్లెల్లో కొండకోనల్లో అభాగ్య ఓటర్లను తప్పించివేయటం పెద్ద సమస్యనా?



ఎందుకీ తెగింపు?

బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్ మత రాజకీయాలు తెలిసినవే గనుక ఇందులో పెద్ద ఆశ్చర్యం ఏముంది అనిపించవచ్చు కానీ దేశ చరిత్రను, జనాభాను, మతాన్ని ప్రత్యక్షంగా కలిపి చూపించి చర్చకు పెట్టే ఈ ఎత్తుగడ నిస్సందేహంగా చాలా ప్రమాదకరమే. రాజకీయంగా తమ ప్రచారాలు, ఎత్తుగడలు ఇక పెద్దగా ఓట్లు తేవటం లేదని తెలిసిన తర్వాతనే ఎన్నికల వ్యవస్థను దాని మూల సూత్రాలతోపాటు పక్కదోవ పట్టించడం వారి అనివార్యమైన ఎత్తుగడగా పరిణమిస్తున్నది. గతంలో ప్రజాస్వామ్య చట్రం దెబ్బతిన్న దేశాల్లో కూడా ఇలాగే కుహనా విలువలు, కృత్రిమ ప్రచారాలు, రాజ్యాంగానికి విచిత్ర భాష్యాలు చెప్పడం ద్వారానే ప్రజలను రెచ్చగొట్టారని మర్చిపోకూడదు. పైగా ఈ దాడి ఏ ఒక్క రంగానికో పరిమితం చేయకుండా అన్ని వైపులా విస్తరించటం ప్రత్యేకంగా చూడవలసి ఉంటుంది. ఎన్నికల సమయంలో, అది కూడా తాము గెలవలేని రాష్ట్రాలలో ఆకస్మిక ఓట్ల ప్రక్షాళన పేరుతో నిర్మూలన చేయడం ఈ క్రమంలో అతి పెద్ద కుట్ర. స్వాతంత్య్రం వచ్చాక ఈ స్థాయిలో ఇంత పకడ్బందీగా ఇలాంటి కుట్ర చూసి ఉండమేమో. ఇలాంటి పరిస్థితుల్లో అత్యున్నత న్యాయస్థానం బీహార్ ఓట్ల తొలగింపుపై సంపూర్ణ వివరాలు సర్వజన సమక్షంలో ప్రకటించాలని స్పష్టంగా ఆదేశించటం ఒకింత ఉపశమనం. ఈ ఆదేశానికి పెద్ద విలువ లేనట్లుగా బడా మీడియాలో తగ్గించి చూపడం కూడా వ్యూహాత్మకమే. ఎన్నికల నిర్వహణ విషయంలో రాజ్యాంగమే కమిషన్‌కు పూర్తి అధికారం ఇచ్చిన మాట నిజమైనా దాని చర్యలు రాజ్యాంగబద్ధంగా ఉన్నాయా లేదా అని పరిశీలించే అధికారం మాత్రం సుప్రీంకోర్టుకే ఉంటుంది. కనుక 'సర్' (ప్రత్యేక సమగ్ర పరిశీలన) అనే ప్రక్రియ జరిపే అధికారం వారిదైతే అది రాజ్యాంగబద్ధమా కాదా చూసే హక్కు న్యాయస్థానందే. అన్ని వివరాలు లేకపోతే అలాంటి పరిశీలన సాధ్యం కాదు కనుక, సామాన్య ప్రజలకు, ఓటర్లకు అసలే తెలియదు కనుక సంపూర్ణ వివరాలు ఒక్కచోట పెట్టాలని న్యాయమూర్తులు నిర్దేశించారు. తద్వారా ఈ ఓట్ల ప్రక్షాళన (నిర్మూలన) తతంగం రంగేమిటో తెలిసిపోతుంది. ఇంత పెద్ద ప్రక్రియలో 65 లక్షలు ఓట్లు తొలగించి ఒక ఓటు కూడా కొత్తగా చేర్చకపోవటం అంటే పూర్తిగా ఏకపక్ష వ్యవహారమని దానికదే చెప్పుకుంటున్నది. చచ్చిపోయిన వారు బతికి ఉండడం, బతికున్న వారు చచ్చిపోవటం, బతికున్న వారిని చంపడం జాబితాలో జరిగిందంటే వాటిని మామూలు తప్పిదాలని ఎలా చెప్తాం? ఇలాంటివి జరుగుతూనే ఉంటాయని సమర్థించుకోవడం ఎలా కుదురుతుంది? ఓటర్ల జాబితాలు పక్కాగా రూపొందించడమే లక్ష్యమైనప్పుడు ఉన్న తప్పులు తొలగించబడాలని తప్పుగా తొలగించటం, కొత్త తప్పులు చేయడం కంటే ఘోరం ఏముంటుంది?

ప్రాంతీయ పార్టీల వింత వైఖరి

బాధాకరమైన విషయం ఏమంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బిజెపి మత రాజకీయాలను, ఏకపక్ష పొగడ్తలను ప్రశ్నించకపోవడమే కాదు. టి.డి.పి, జనసేనల వలె కేంద్రాన్ని పొగడ్డమే కాదు. పక్కదోవ పట్టించడం కూడా జరుగుతున్నది. ప్రజాస్వామ్యానికి మూల సూత్రం లాంటి సర్వజన ఓటు హక్కును రక్షించుకోవడం కోసం కేంద్రీకరించే బదులు రాష్ట్రాలలో తమ ఆధిపత్యంతో ప్రత్యర్థులను ఎదుర్కోవటం మాత్రమే వారికి పరమార్థంగా మారింది. టి.డి.పి కనీసం ఎ.పి లో ముందుగానే ఓట్ల పరిశీలన పూర్తి చేయాని కోరింది. కానీ వై.సి.పి మాట్లాడటమే లేదు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'సర్' ప్రక్రియ అప్రజాస్వామికంగా సాగిస్తున్న తీరును వదిలిపెట్టి, రాహుల్ గాంధీ ఎ.పి లో తమ ఓటమిపై ఎందుకు మాట్లాడరని ఆక్షేపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చివరి గంటలో దాదాపు 12 శాతం ఓట్లు అదనంగా పడ్డాయన్నది వై.సి.పి ఆరోపణ. కానీ దానికి బాధ్యత ఎన్నికల సంఘం వహించాలి తప్ప కాంగ్రెస్ లేదా మరో ప్రతిపక్షం చేయగలిగిందేమిటి? నిబంధనలకు విరుద్ధంగా నెల రోజుల్లో ఉత్తుత్తి పరిశీలన జరిపి లక్షల ఓట్లు తొలగించడం వేరు. ఎన్నికల్లో ఈవీఎంల పై ఆరోపణలు, సందేహాస్పద ఓటింగ్ వేరు. ఈ అన్ని విషయాలను కలిపి ఎన్నికల సంఘం తీరు పైన, కేంద్రం ఒత్తిడి పైన వామపక్షాలు, కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలు తమ తమ పద్ధతుల్లో అనేక విధాల పోరాడుతూనే ఉన్నాయి. వాటిలో వై.సి.పి ఏ రోజూ గొంతు కలిపింది లేదు. 12 శాతం అదనపు ఓటింగ్ అన్న విషయంపై రాహుల్ గాంధీ సరే, జగన్మోహన్ రెడ్డి క్రమబద్ధతిలో కేంద్రం ఒత్తిడిని విమర్శిస్తూ ఏనాడైనా మాట్లాడారా? కొద్దిమంది వై.సి.పి అభ్యర్థులు మినహాయిస్తే తమ నియోజకవర్గాల ఓటింగ్ సరళినైనా సవాలు చేశారా? చేసిన వాళ్ళు నిలబడ్డారా? ఇవన్నీ కాదనలేని ప్రశ్నలు.

కేంద్రం నిరంకుశత్వంగా జనాభా పొందిక పేరుతో మత రాజకీయాలు చేయటం, చొరబాటుదారుల పేరుతో అమాయకుల ఓట్లు అత్యధికంగా తొలగించటంపై వై.సి.పి ఎప్పుడైనా విమర్శించిందా? ఇప్పటికైనా ఎన్నికల సంఘం పోకడలను ఏకమొత్తంగా ఎదుర్కోవడానికి వారు సిద్ధంగా ఉన్నారా? జగన్ మాటలపై కాంగ్రెస్ రాహుల్ గాంధీ ఎలా స్పందిస్తారనేది ఒకటైతే ఈ సమయంలో ఓట్ల చర్చను ఏపీ ఈవీఎంల చర్చగా మార్చివేయడం ఎవరికి ఉపయోగం? తెలంగాణలో టి.ఆర్.ఎస్ కూడా ఈవీఎంలను మార్చివేసి బ్యాలెట్ పత్రాలకు తిరిగి వెళ్లాలని అంటున్నది. అదెలాగూ జరిగేది కాదని సుప్రీంకోర్టే వ్యాఖ్యానించింది. తప్పులను సవరించడానికి బదులు మొత్తానికి ఎసరు పెట్టడం, ఆచరణ సాధ్యం కాదని తెలిసే మాట్లాడటమంటే ఇదే. పవన్ కల్యాణ్ అయితే గెలిస్తే ఈవీఎంలు రైటు, ఓడిపోతే తప్పు అంటున్నారని ఎన్నికల సంఘం భాషను మాట్లాడుతున్నారు. అదే నిజమైతే 2009లో బి.జె.పి మాజీ ఎంపీ జి.వి.ఎల్ నరసింహారావు వాటిపై పుస్తకం రాయడం, దానికి చంద్రబాబు నాయుడు ముందు మాట రాయటం కూడా ఇదే నినాదంతో జరిగింది. ఈ ప్రాంతీయ పార్టీలు తెలుగు నాట విశాల జాతీయ ప్రయోజనాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోణాన్ని పూర్తిగా విస్మరించి పరస్పర తగాదాలకు, స్వల్పకాలిక అంశాలకు పరిమితం కావటం మరింత విచారం కలిగిస్తుంది. మన ఘన రాజ్యాంగ పునాదులనే ధ్వంసం చేసి, దేశ సామాజిక స్వరూపాన్ని తలకిందులు చేసే ఈ తీవ్ర పోకడలను విస్మరిస్తే వినాశనం తథ్యం.

★

దయనీయ స్థితిలో గాజా మహిళలు

- ఒకవైపు కరువుతో విలవిల.. మరోవైపు హింస
- ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ తీవ్ర ఆందోళన

గాజా : ఇజ్రాయిల్ నెలల తరబడి గాజాలో సాగిస్తున్న ఉన్మాద దాడులు, అమానవీయ ఆంక్షలు కారణంగా దాదాపు 10 లక్షల మంది మహిళలు, బాలికలు దయనీయ దుస్థితిలో విలవిల్లాడుతున్నారని ఐక్యరాజ్య సమితికి చెందిన పాలస్తీనా శరణార్థుల సంస్థ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేసింది. గాజాలో మహిళలు మూకుమ్మడి కరువు పరిస్థితులను, హింసను, హక్కుల ఉల్లంఘనలను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఇజ్రాయిల్ ఆర్మీ అత్యంత ప్రమాదకరమైన వ్యూహాలను అనుసరిస్తోంది. ఆహారం, నీరు కోసం బయటకు వెళ్ళడమంటే తిరిగి ఇంటికి వస్తామో రామోననే భయం అందరిలోనూ నెలకొందని తెలిపింది. గాజా సరిహద్దుల వద్ద వేలాది ట్రక్కులు నిలిచిపోయినా ఇజ్రాయిల్ అన్ని దారులను మూసివేసి, అరకొరగా మానవతా సాయాన్ని లోపలకు అనుమతిస్తోంది. ఫలితంగా గాజాలోని 24లక్షల మంది ప్రజల్లో మూడో వంతు మంది ప్రజలు అనేక రోజుల పాటు ఆహారం లేకుండా కాలం గడుపుతున్నారని ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) హెచ్చరించింది.

కాగా 2023 అక్టోబరులో దాడులు మొదలైనప్పటి నుండి ఇప్పటివరకు గాజాలో 61,900 మందిని ఇజ్రాయిల్ పొట్టనబెట్టుకుంది. ఆహారం కోసం వెళ్ళి అశువులు బాసిన వారి సంఖ్య మే నుండి ఆగస్టు 13 నాటికి 1760కి చేరిందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం వెల్లడించింది. ఇదిలా వుండగా, గాజాలో కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చల కోసం పాలస్తీనా ప్రధాని మహ్మద్ ముస్తఫా ఆదివారం ఈజిప్ట్‌లో పర్యటించనున్నారు.


ఆహార శిబిరాల వద్ద మహిళల వెతలు

దేశ విభజనపై వక్రీకరణలు

- ఎన్‌సిఇఆర్‌టి పాఠంపై ప్రతిపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ : దేశ విభజన సమయంలోని భయానక పరిస్థితులను వివరిస్తూ.. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఆర్‌టి) రూపొందించిన ఒక ప్రత్యేక పాఠంలో చారిత్రిక వక్రీకరణలకు పాల్పడటాన్ని ప్రతిపక్షాల నేతలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. 1947లో జరిగిన దేశ విభజనకు ఒక వ్యక్తి మాత్రమే కారణం కాదని..ఇందులో ముగ్గురి పాత్ర ఉందని ఎన్‌సిఇఆర్‌టి ఈ ప్రత్యేక మాడ్యూల్‌లో పేర్కొంది. విభజనకు పట్టుబట్టిన ముస్లిం లీగ్ అగ్రనేత మహమ్మద్ అలీజిన్నా, దానికి అంగీకరించిన కాంగ్రెస్, అమలు చేసిన లార్డ్ లూయిస్ మౌంట్ బాటన్ అని తెలిపింది. ఈ విభజన వల్లే భారత్‌కు కాశ్మీర్ సమస్యగా మారిందని..నాటి నుంచి కాశ్మీర్‌ను పాక్ మార్గంగా చేసుకొని దేశంపై పలు ఒత్తిడులను తీసుకురావడానికి ఉపయోగించుకుంటోందని ఆరోపించింది. 1947లో జరిగిన భారత్ పాకిస్తాన్ విభజన సమయంలో ప్రజల బాధ, బాధితుల వేదనలను గుర్తు చేసుకుంటూ ఏటా ఆగస్టు 14న కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 'విభజన గాయాల స్మారక దినం' గురించి ప్రస్తావించారు. అయితే చరిత్రలో జరిగిన అసలు విషయాలు తెలియజేయకుండా వక్రీకరించారని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ఆరోపించారు. దేశంలోని లౌకికవాదాన్ని నిర్మూలించాలని చూస్తున్న ఆర్ఎస్ఎస్ ఈ దేశానికి చాలా ప్రమాదకరమని అన్నారు. కాగా గతేడాది తొమ్మిది నుంచి 12వ తరగతులకు సంబంధించిన సిలబస్‌లో అనేక అంశాలను ఎన్‌సిఇఆర్‌టి తొలగించిన విషయం తెలిసిందే. ఈ చర్యలను అప్పట్లో కాంగ్రెస్ వ్యతిరేకించింది. విద్యార్థులకు అసలైన చరిత్ర గురించి చెప్పకుండా.. సిలబస్‌ను కాషాయీకరణ చేస్తున్నారంటూ విమర్శించింది.

నేడు శ్రీసత్యసాయి యూనిటీ కప్ ఫైనల్స్

పుట్టపర్తి క్రైమ్ : భారతదేశంలో ఉన్న శ్రీసత్యసాయి సేవా సంస్థల మధ్య ఏడాది పొడవునా జరిగిన క్రికెట్ మ్యాచ్ ఆఖరి అంకానికి చేరుకుంది. సత్యసాయి ట్రస్టు వర్గాలు తెలిపిన వివరాలు.. హర్యానా, అస్సాం, వెస్ట్ బెంగాల్, తెలంగాణ, చత్తీస్‌గఢ్, గోవా రాష్ట్రాల జట్లు ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయన్నారు. ఈ నెల 17వ తేదీ శ్రీసత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో క్రికెట్ అభిమానులు మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి విశేష అతిథులుగా భారత మాజీ క్రికెటర్లు సునీల్‌జోషి, అమూల్ మజుంధార్, మురళీ కార్తీక్, ఎంఎస్‌కె ప్రసాద్, శ్రీలంక మాజీ క్రికెట్ కెప్టెన్ అర్జున రణతుంగ, వెస్టిండీస్ మాజీ క్రికెటర్ కలిచరణ్ హాజరుకానున్నారని తెలిపారు.

బ్యాంకు దోపిడీ ప్రధాన నిందితుడు అరెస్ట్

- త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం : డిఎస్‌పి

ప్రజాశక్తి - హిందూపురం

తీవ్ర సంచలనం రేకెత్తించిన హిందూపురం రూరల్ మండలం తూమకుంట చెక్‌పోస్ట్ ఎస్‌బిఐలో జరిగిన చోరీ కేసు కొలిక్కి వస్తోంది. చోరీ జరిగిన వెంటనే పోలీసు ఉన్నతాధికారులు సంఘటనను తీవ్రంగా పరిగణించి ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. బ్యాంకులో లభ్యమైన ఆధారాల మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించడంలో పోలీసులు సఫలీకృతులయ్యారు. అనంతపురం డిఐజి, పుట్టపర్తి జిల్లా ఎస్‌పి పర్యవేక్షణలో తనతో పాటు సబ్ డివిజన్‌లోని సిఐలు, ప్రత్యేక దర్యాప్తు బృందాలుగా గత 20 రోజులుగా కేసు విచారణలో భాగంగా పలు రాష్ట్రాల్లో పర్యటించినట్టు డిఎస్‌పి వికె.మహేష్ తెలిపారు. పలువురు పాత నేరస్తులను విచారించి, నేరస్థలంలో లభించిన సాంకేతిక ఆధారాలతో నిందితులు హర్యానా రాష్ట్రానికి చెందిన అనిల్ కుమార్ పన్వార్, అతని సహచరులు నేరం చేసినట్లు నిర్ధారణకు వచ్చామన్నారు. కేసులో ప్రధాన నిందితుడు అనిల్ కుమార్ పన్వార్‌ను హర్యానా రాష్ట్రంలో అదుపులోకి తీసుకుని తీసుకుని న్యాయ పరంగా వెంటనే శనివారం కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. అయితే ఈ కేసులో ఇంకా విచారణ కొనసాగుతోందని, కేసులో చోరీ కాబడిన సొత్తు వివరాలు తెలియాల్సి ఉందన్నారు. న్యాయ సూత్రాలను కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత తమపై ఉండడంతో నిందితున్ని వెంటనే కోర్టులో హాజరు పరచాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అతి త్వరలోనే వెల్లడిస్తామని డిఎస్‌పి వివరించారు.

పాడేరు ఘాట్‌లో విభిన్న వాతావరణం

- ఉదయం పొగమంచు... మధ్యాహ్నం భారీ వర్షం..

ప్రజాశక్తి- పాడేరు టౌన్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గత కొన్ని రోజులుగా ఉదయం వేళల్లో పొగమంచు కమ్మేస్తుంది. మధ్యాహ్నం భారీ వర్షాలు కురుస్తోంది. పాడేరు ఘాటీలో శనివారం విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కాస్త ఎండ కాసింది. మధ్యాహ్నం పన్నెండు తర్వాత ఘాటీ సగం వరకు పొగమంచు కమ్మేసింది. ఒంటిగంట తర్వాత కుంభవృష్టిగా వాన కురిసింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని భారీ వర్షం పడడంతో ఘాటీలో రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించలేదు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు శనివారం కురిసిన భారీ వర్షానికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలు కూలుతాయేమోనన్న భయంతో ప్రయాణం సాగించారు. ఎప్పుడు, ఎక్కడ చెట్టు కూలి రాకపోకలు నిలిచి పోతాయోనని వాహనదారులు ఆందోళన చెందారు.

హర్యానా సర్పంచ్ ఎన్నికల్లో ఇవిఎం గోల్‌మాల్

- మూడేళ్ల తరువాత సుప్రీం కోర్టులో రీ కౌంటింగ్
- ఫిర్యాదు చేసిన అభ్యర్థి గెలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హర్యానా సర్పంచ్ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎం) గోల్‌మాల్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అసాధారణరీతిలో దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ఒక గ్రామానికి చెందిన ఓట్లను రీ కౌంటింగ్ చేశారు. దీంతో ఫిర్యాదు చేసిన అభ్యర్థి మూడేళ్ల తరువాత గెలుపొందారు. హర్యానాలోని పానిపట్ జిల్లాలో బువానా లఖు గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి చెందినా అయినా వెనక్కి తగ్గలేదు. తనకే విజయం దక్కుతుందనే నమ్మకంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానంలోనే ఇవిఎంలను తెరిచి కోర్టు లెక్కింపు చేపట్టగా, 51 ఓట్ల తేడాతో ఫిర్యాదు చేసిన అభ్యర్థి మోహిత్ మాలిక్ విజయం సాధించారు. మూడేళ్ల తరువాత అనుకూలంగా తీర్పు సాధించారు.

అసలేం జరిగిందంటే?

పానిపట్ జిల్లాలోని బువానా లఖు గ్రామంలో సర్పంచ్ పదవిపై ఎప్పటి నుంచో వివాదం ఉంది. మూడేళ్ల క్రితం 2022 నవంబర్ 2న సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో అభ్యర్థి మోహిత్ మాలిక్ విజయం సాధిస్తారని అంతా అనుకున్నారు. కానీ కౌంటింగ్ జరగ్గా, మరో అభ్యర్థి కుల్దీప్ గెలిచారు. అయితే ఓట్ల లెక్కింపులో ఏదో పొరపాటు జరిగిందని అప్పుడే మోహిత్ అనుమానించారు. వెంటనే అధికారులతో వారించినా, లాభం లేకుండా పోయింది. బూత్ నంబర్ 69లో ఫలితాన్ని పొరపాటుగా మార్చారని మోహిత్ అన్నారు. జిల్లా కోర్టులో పిటిషన్ వేయగా, ఎలాంటి పురగోతి లేదు. హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో సుప్రీంకోర్టును కొన్నాళ్ల క్రితం ఆశ్రయించారు. ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. కోర్టుకు ఈవిఎంలను తెప్పించింది. ఓట్లను మళ్లీ లెక్కించింది. అప్పుడు మోహిత్ మాలిక్ 51 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు ప్రకటించింది. అంతేకాదు జిల్లా యంత్రాంగం రెండు రోజుల్లోపు మోహిత్‌తో సర్పంచ్ ప్రమాణ స్వీకారం చేయించాలని ఆదేశించింది. దీంతో అధికారులు మోహిత్ మాలిక్తో ప్రమాణం చేయించారు. తద్వారా ఆయన సర్పంచ్ అయ్యారు. మూడేళ్ల న్యాయపోరాటం తరువాత సుప్రీంకోర్టు తీర్పుతో ఆయన అనుకున్నది సాధించారు. అయితే సుప్రీంకోర్టులో ఈవిఎంలను తెరిచి, ఓట్లను మళ్లీ లెక్కించడం దేశంలోనే తొలిసారి.

ప్రతిపక్షాల పోరాటానికి ఆయుధం

ఈ వ్యవహారం దేశంలో ప్రస్తుతం ఓటు చోరీ, ఇవిఎంలపై అనుమానాలపై ప్రతిపక్షాలు చేస్తున్న పోరాటానికి ఆయుధంగా దొరికింది. ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ స్పందిస్తూ 'ఓడిపోయిన అభ్యర్థి గెలిచాడు. ఆయన పదవీకాలంలో 3 సంవత్సరాలు, ఇవిఎం దయతో నకిలీ అభ్యర్థి సర్పంచ్‌గా ఉన్నారు. చండీగఢ్‌లో ఇలాంటి కేసు జరిగింది. అక్కడ బిజెపి అభ్యర్థి మేయర్ ఎన్నికల్లో గెలవాలని నిర్ణయించగా, కోర్టు దానిని తిరస్కరించింది. ఎన్నికల కమిషన్‌తో పాటు బిజెపి అన్ని ఆధారాలను నాశనం చేసినప్పుడు. ఆ తరువాత కోర్టులో ఏ ఆధారాలు ఇస్తారు. ఇది పూర్తిగా ప్రజాస్వామ్యానికి విరుద్ధం. బీహార్ ప్రజాస్వామ్యానికి జన్మస్థలం. మీరు అప్రమత్తంగా, జాగ్రత్తగా, అవగాహనతో ఉండాలి" అని పోస్ట్ చేశారు.

నేడు భారత్‌కు శుభాంశు శుక్లా

న్యూఢిల్లీ : వ్యోమగామి శుభాంశు శుక్లా భారత్‌కు ఆదివారం నాడు తిరిగిరానున్నారు. ఈ విషయాన్ని ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపారు. అమెరికా చేపట్టిన 'యాక్సియం-4 మిషన్'తో రోదసి చరిత్రలో శుభాంశు శుక్లా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సంగతి తెలిసిందే. అమెరికా నుంచి స్వదేశానికి తిరిగి వచ్చేందుకు విమానంలో కూర్చున్నప్పుడు భావోద్వేగానికి గురైనట్లు శుక్లా తెలిపారు. యాక్సియం మిషన్ కోసం గతేడాది నుంచి తన స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇది తనను ఎంతో బాధించిందన్నారు.

వారిని కలిసి తన అనుభవాలను పంచుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను విమానంలో కూర్చొన్న ఫొటోను పంచుకున్నారు. ఆదివారం భారత్‌కు రానున్న శుక్లా.. సోమవారం మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ నెల 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో కూడా శుక్లా పాల్గొనేవీలుంది.

ఇటీవల నిర్వహించిన యాక్సియం-4 మిషన్ ప్రయోగం విజయవంతమైంది. రోదసిలో 18 రోజులు గడిపి మానవాళికి ప్రయోజనం కలిగించే పలు ప్రయోగాలను నిర్వహించిన శుక్లా బందం జులై 15న భూమికి తిరిగి వచ్చింది. వచ్చిన వెంటనే వ్యోమగాములను క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ (పోలండ్), టిబర్ కపు ఈ బందంలో ఉన్నారు.

'అపార్' తప్పనిసరిపై నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ : ఉన్నత విద్య పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నంబరును తప్పనిసరి చేస్తూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెంకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) ఇటీవల తీసుకున్న నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిర్ణయం ప్రకారం..సిబిఎస్ఇ కింద పది, 12వ తరగతుల పరీక్షలకు నమోదు చేసుకునే విద్యార్థులు అపార్ ఐడీలను సమర్పించటం తప్పనిసరి. అయితే సిబిఎస్ఇ తీసుకున్న నిర్ణయం.. డేటా భద్రత, వ్యక్తిగత గోప్యతకు సంబంధించి తీవ్ర ప్రభావం చూపుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అపార్ ఐడీ నకిలీ విద్యా సర్టిఫికెట్లను అంతం చేస్తుందని ప్రభుత్వం చెప్పినప్పటికీ.. సిబిఎస్ఇ చర్యపై నిపుణులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఇది గోప్యతకు భంగం కలిగించే ప్రమాదమున్నదని వాదిస్తున్నారు. ఇందుకు వారు 'ఆధార్'ను ఉదాహరణగా చూపుతున్నారు. ఆధార్ ద్వారా జరిగిన గోప్యత, వ్యక్తిగత సమాచార ఉల్లంఘనలను గుర్తు చేస్తున్నారు. అపార్ ఐడీని తప్పనిసరి చేయటం ద్వారా వ్యక్తిగత గోప్యత, సమాచార భద్రత, స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ ప్రజలను ఇప్పటి పాలకులు ప్రతీరోజూ ఏదొక గుర్తింపు పత్రాలను అడుగుతున్నారని..ఆధార్‌తో మొదలైన ఈ చర్య..ఇప్పుడు చిన్నారులను అపార్‌తో ముడిపెట్టే వరకు వచ్చిందని సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్ (ఎస్ఎఫ్ఎల్‌సి) వ్యవస్థాపకురాలు మిషి చౌదరి అన్నారు. ఇందుకోసం తల్లిదండ్రులను కూడా వేధిస్తున్నారని, వాస్తవానికి అపార్‌కు చట్టబద్ధత లేదని పేర్కొన్నారు. అపార్ అనేది 12 అంకెలున్న ఆధార్ తరహాలో ఒక ఐడి. కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) 2020 ద్వారా అపార్‌ను ప్రవేశపెట్టారు. విద్యార్థి ఎల్‌కెజీలో చేరినప్పటి నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు సంబంధించిన సమాచారం 'అపార్'లో నిక్షిప్తం చేస్తారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్ డిజిలాకర్ ద్వారా విద్యార్థుల రిపోర్ట్ కార్డులు, రికార్డులను యాక్సెస్ చేయడాన్ని ఈ ఐడిని వినియోగిస్తారు. అపార్ ఐడీని పొందటానికి ఒక విద్యార్థి పేరు, వయస్సు, పుట్టిన తేదీ, లింగం, ఫోటో, ఆధార్ నెంబర్‌తో సహా తన వ్యక్తిగత వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. 2023లో కేంద్రం ప్రారంభించిన 'వన్ నేషన్, వన్ స్టూడెంట్' పథకం కింద పాఠశాలలు తమ అపార్ ఐడీలను సృష్టించడానికి తల్లిదండ్రుల సమ్మతిని తీసుకోవాలని విద్యా మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు లేఖ రాసింది. విద్యా సంబంధిత అంశాలతో పాటు వ్యక్తిగత వివరాలు కూడా ఈ ఐడి ద్వారా యాక్సెస్ చేసే వీలుండటంతో సిబిఎస్ఇ నిర్ణయంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

కోర్టు హాలులో సర్జన్ 'చేతబడి' ?

న్యూఢిల్లీ : దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలోని ఒక కోర్టులో ఇటీవల ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఓ కేసు విచారణలో భాగంగా న్యాయస్థానంలో నిందితుడిగా హాజరైన సర్జన్.. కోర్టు హాలులో 'బియ్యం' విసరడం ఆశ్చర్యానికి గురిచేసింది. అతడి చేష్టలను చేతబడిగా అనుమానించిన న్యాయవాదులు.. న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో కొద్దిసేపు కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఈ చర్యలను తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి, నిందితుడికి శిక్షతోపాటు జరిమానా కూడా విధించారు. ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్న డాక్టర్ చందర్ విభాస్‌ను దిల్లీలోని అడిషనల్ సెషన్స్ కోర్టులో ఆగస్టు 11న హాజరుపరిచారు. ఆ సమయంలో నిందితుడు కోర్టు హాలులో ఉద్దేశపూర్వకంగా బియ్యం చల్లుతున్నట్లు న్యాయవాదులు గుర్తించారు. గత విచారణ సమయంలోనూ ఇదే విధంగా ప్రవర్తించాడని న్యాయమూర్తి షెఫాలీ బర్నాలా టాండన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిని చేతబడిగా అనుమానిస్తూ వాటిని తొలగించే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ చర్యలను తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి.. నేలపై విసిరిన బియ్యాన్ని సేకరించాలని నిందితుడిని ఆదేశించారు. దీంతోపాటు కోర్టు హాలును శుభ్రం చేసేందుకు స్వీపర్‌ను పిలిపించారు. ఓ పది నిమిషాల తర్వాత స్వీపర్ వచ్చి వాటన్నింటినీ తొలగించారు. ఆ సమయంలో వర్చువల్‌గా వాదనలు వినిపిస్తున్న నిందితుడి తరపు న్యాయవాది.. అనుమతి తీసుకొని వెంటనే కోర్టుకు హాజరయ్యారు. అంతలోపే నిందితుడు తాను తప్పు చేశానని న్యాయమూర్తిని క్షమాపణ కోరాడు.

మధ్యాహ్నం విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. నిందితుడి ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలు నిర్మూలనపై అవగాహన కల్పించాల్సిన వైద్య వృత్తిలో ఉంటూ..పైగా వత్తిరీత్యా సర్జన్ కూడా అయిన డాక్టర్ చందర్ విభాస్ ఈ తరహా ప్రవర్తన ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. అతడు క్షమాపణ చెప్పడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, మళ్లీ ఇటువంటి చర్యలు చేయడని నిందితుడి తరపు న్యాయవాది హామీ ఇచ్చారు. దీంతో న్యాయమూర్తి ఈ కేసులో ఒకరోజు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధించారు.


జారిన ఎగువ కాఫర్ డ్యాం

జారిన ఎగువ కాఫర్ డ్యాం

- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు

ప్రజాశక్తి- పోలవరం

పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యాం ఎడమవైపు ఎగువన కొద్దిగా జారింది. శుక్రవారం ఉదయం సమయంలో సుమారు పది అడుగుల వెడల్పు, ఏడు నుంచి ఎనిమిది అడుగుల లోతు మేర జారడంతో అధికారులు గమనించి యుద్ధప్రాతిపదికన పటిష్టపరిచారు. 2022 ఆగస్టు వరదలకు ఆ ప్రదేశంలో నీటిమట్టం ఎక్కువగా పెరిగే అవకాశాలున్నాయని భావించిన అధికారులు ఎగువ కాఫర్ డ్యాం వెడల్పు తొమ్మిది మీటర్ల ఎత్తును మరో రెండు మీటర్లు పెంచి పటిష్టం చేశారు. అదే ప్రాంతంలో ప్రస్తుతం కొంతమేర జారింది. సీపేజ్ నివారణకు విదేశీ నిపుణుల బృందం సిఫార్సు మేరకు ఎగువ కాఫర్ డ్యాం పొడవునా బట్రస్ డ్యాం నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. జారిన భాగాన్ని పునరుద్ధరించామని, బట్రస్ డ్యాం ఉండడం వల్ల ఎలాంటి సమస్య ఉండదని ఇంజనీరింగ్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు. ఈ విషయంపై పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఇంజనీరింగు అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

కేంద్రమంత్రిగా 'దగ్గుమళ్ల'..?

- త్వరలోనే క్యాబినెట్ విస్తరణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కేంద్రమంత్రివర్గ విస్తరణ త్వరలోనే జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం ఒక క్యాబినెట్, ఒక సహాయ క్యాబినెట్‌కు అవకాశం ఇచ్చారు. మూడో మంత్రి పదవిని ఆంధ్రాకు ఇవ్వనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆదివారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై జరిగే సమావేశానికి హాజరుకానున్న నారా చంద్రబాబుకు కేంద్ర క్యాబినెట్ విస్తరణ, ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి పదవి ఎవరికి ఇవ్వాలనే విషయమై చర్చ జరగనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బిజెపి, జనసేన నుంచి కేంద్రమంత్రి పదవి ఆశించినప్పటికీ, టిడిపికే ఇవ్వాలని ఎన్‌డిఎ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు మధ్యే పదవీ పోటీ నెలకొంది. ఎస్‌సి సామాజికవర్గం కోటాలో మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ లెక్కన చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు కేంద్ర సహాయ మంత్రి ఇచ్చే అవకాశం మెండుగా ఉంది.

బాపట్ల జిల్లాకు చెందిన దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్‌గా సేవలందించారు. ఆ తరువాత చంద్రబాబునాయుడు ఆహ్వానం మేరకు 2024 ఎన్నికల్లో రాజకీయ అరంగేట్రం చేశారు. ఎవరికీ సాధ్యం కాని విధంగా పార్టీలోకి వచ్చిన రెండు నెలలకే ఎంపిగా భారీ మెజార్టీతో గెలుపొందారు. 2024 ఎన్నికల్లో వైసిపి సమీప అభ్యర్థి రెడ్డెప్పపై 2 లక్షల 23వేల మెజార్టీతో గెలుపొంది పార్లమెంట్‌లో ప్రవేశపెటించారు. ఎంపిగా నియోజకవర్గంలో నెలలో 15-20 రోజులు ఉంటూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ఏడాది కాలంలో 10 కోట్లకు పైగా ఎంపి నిధులతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా సిసి రోడ్లు, కొత్తగా సిక్స్‌లైన్ పడడంతో గ్రామాల మధ్య కనెక్టివిటి కోసం రైల్వే బ్రిడ్జిలు, గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారని కూటమి కార్యకర్తలు చెబుతున్నారు. పార్లమెంట్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గానూ, ఎస్‌సి, ఎస్‌టి జాతీయ కమిటీలో మెంబర్‌గానూ ఉన్నారు. మరో మూడు జాతీయ కమిటీల్లోనూ దగ్గుమళ్ల చురుగ్గా ఉన్నారు. ఈ ఐదు కమిటీల్లో దగ్గుమళ్ల ప్రసాద్‌రావు చేస్తున్న కృషిని మోడీ ప్రధాని గతంలో వ్యక్తిగతంగా అభినందించారు. కేంద్ర క్యాబినెట్ విస్తరణ నేపథ్యంలో ఆంధ్రాలో మంత్రి పదవి ఎవరిని ఇవ్వాలనే చర్చ నడిచిన నేపథ్యంలో అధినేత సైతం 'దగ్గుమళ్ల' వైపే మొగ్గు చూపినట్లు విశ్వసనీయ సమాచారం.

మా కష్టాలు పాలకులకు పట్టడం లేదు

● సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్‌తో నిర్వాసితుల ఆవేదన ● పోరాడకపోతే సమస్యలు పరిష్కారం కావు ● పోలవరం ముంపు ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'సార్ పోలవరం ముంపు గ్రామాల సర్వేనాటికి నాకు పెళ్లికాలేదు. 13 సంవత్సరాలు. కానీ పెళ్ళయింది పరిహారం ఇవ్వడం లేదు'

- వెంకటరమణ, దాట్లవారిగూడెం

'25 ఏళ్ల క్రితమే మాకు భూమి, వాటికి హక్కులు కల్పిస్తూ పట్టా కూడా ఇచ్చారు. గిరిజనులుగా మేము సాగుచేసుకుంటున్నాం. కానీ ఇప్పుడు గిరిజనేతరులు యజమానులుగా వచ్చి వారే పరిహారం తీసుకుంటున్నారు. ప్రభుత్వం కూడా వారికే సహకరిస్తోంది.

- రెడ్డిగణపవరం గిరిజనులు

'ఇళ్లిచ్చారు. కానీ వర్షం వస్తే కారిపోతోంది. ఇప్పటికే ఒకసారి రిపేర్లు చేశారు. అయినా ఫలితం లేదు. గోడలు కూడా దెబ్బతింటున్నాయి. మరలా శ్లాబు కారిపోతోంది. రిపేర్లు చేయాలని అడిగితే పట్టించుకోవడం లేదు'

- పడిగింటి ఓగాయమ్మ, కుమారుడు వరహాలరెడ్డి. టేకూరు పునరావాస కాలనీ

ఇలా పోలవరం ముంపు ప్రాంత గిరిజనులు సిపిఎం ఎంపి, రాజ్యసభలో ఫ్లోర్‌లీడర్ జాన్ బ్రిట్టాస్ ముందు సమస్యలు ఏకరువు పెట్టారు. పోలవరం ముంపు బారిన పడిన గిరిజన గ్రామాల్లో ప్రజల ఆవేదన, తరలించి కాలనీలు నిర్మించిన గ్రామాల్లోనూ సమస్యలు ఒకటి కాదు రెండు కాదు గిరిజనుల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి నిలువుటద్దాలుగా ఉన్నాయి. పోలవరం ముంపు ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా, పునరావాస కాలనీలను పరిశీలించేందుకు సిపిఎం జాతీయ కార్యదర్శి ఎం.ఎ.బేబీ, రాజ్యసభలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ జాన్ బ్రిట్టాస్ ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లాలోని బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని పలు గ్రామాలతోపాటు పునరావాస కాలనీలుగా ఉన్న



బుట్టాయగూడెంలో జాన్ బ్రిట్టాస్‌కు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

టేకూరులోనూ పునరావాస ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తొలుత బ్రిట్టాస్‌కు బుట్టాయగూడెం మండలం కోర్లేటిగూడెం వద్ద గిరిజనులు పెద్దయెత్తున స్వాగతం పలికారు. అక్కడ నుండి రెడ్డిగణపవరం చేరుకున్నారు. అక్కడ గతంలో గిరిజనులకు కేటాయించి ప్రస్తుతం గిరిజనేతరులకు చెందినదిగా చూపించి వారికి పరిహారం ఇవ్వడంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దానికి సంబంధించిన ఆధారాలు, పట్టాలు గిరిజనుల వద్ద ఉన్నాయని ఎంపికి స్థానికులు వివరించారు. దీంతో ఆయన ఆ భూముల్లోకి వెళ్లి పరిశీలించారు. ఐదో షెడ్యూల్లో ఉన్న భూములపై గిరిజనులకు అన్ని హక్కులూ ఉంటాయని, ఈ విషయాన్ని రాష్ట్రపతి, పార్లమెంటు దృష్టికి తీసుకెళతానని తెలిపారు. అక్కడే కొమరం బాబూరావు స్మారకస్థూపానికి నివాళులర్పించారు. అలాగే జీలుగుమిల్లి మండలం టేకూరులోనూ పునరావాస కాలనీలో ఓగాయమ్మకు చెందిన ఇంటి శ్లాబును పరిశీలించారు. శ్లాబు కారిపోతోందని, గోడలు కూడా నాణ్యత లేకుండా ఉన్నాయని ఎంపికి ఓగాయమ్మ కుమారుడు వరహాలరెడ్డి వివరించారు. అక్కడే మరో బాధితురాలు వెంకటరమణ కూడా తనకు పరిహారం ఇవ్వలేదని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయించాలని ఎంపికి విన్నవించారు. గిరిజనుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాల్సి ఉందని అన్నారు.

పోరాడితేనే సమస్యల పరిష్కారం

గిరిజనుల సమస్యలు పరిశీలన సందర్భంగా రెడ్డిగణపవరం, టేకూరులో జరిగిన సభల్లో ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడారు. పోలవరం ముంపు బాధితుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. తాను పరిశీలించిన టేకూరులో 150 ఇళ్ల వరకూ ఉన్నాయని, ఇన్ని ఇళ్లు ఒకేచోట ఉంటే కేరళలో స్కూలు, ఆస్పత్రి, అంగన్‌వాడీ సెంటర్లతోపాటు గౌరవప్రదమైన శ్మశానం కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కానీ ఇక్కడ కాలనీ కట్టినా కనీస సదుపాయాలు లేవని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుండి పార్లమెంటుకు వచ్చే ఎంపిల్లో ఎక్కువ మంది శతకోటీశ్వరులే ఉన్నారని, కానీ గిరిజనులకు న్యాయం జరగడం లేదని అన్నారు. ప్రభుత్వాలు కూడా పెద్దలవైపు చూస్తున్నాయి మినహా నష్టపోయిన పేదలను పట్టించుకోవడం లేదని అన్నారు. 2004లో కేంద్రంలో వామపక్ష పార్టీల మద్దతు ఉన్న సమయంలో సమాచారహక్కు, విద్యాహక్కు, ఆహార భద్రత, ఉపాధి హామీ, గిరిజనుల హక్కులపై చట్టాలు చేయించామని తెలిపారు. అయితే నేటి ప్రభుత్వాలు వాటిని అమలు చేయకపోగా నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. పోలవరం ప్రాంతంలో నష్టపోతున్న గిరిజనులకు సంబంధించిన సమస్యలు ఇక్కడ ఎంపిలు ఎవరూ మాట్లాడటం లేదని అన్నారు. తాను పరిశీలించిన అంశాలను పార్లమెంటులో లేవనెత్తుతానని, అవసరమైతే రాష్ట్రపతి దృష్టికి తీసుకెళతానని ఎంపి బ్రిట్టాస్ వివరించారు. ఇదే సమయంలో గిరిజనులు కూడా పోరాడాలని, పోరాడకపోతే సమస్యలు పరిష్కారం కావని, పోరాటే వారందరికీ సిపిఎం అండగా ఉంటుందని హామీనిచ్చారు.

పెద్దయెత్తున వినతులు

గిరిజన పునరావాస కాలనీల్లో పర్యటిస్తున్న జాన్ బ్రిట్టాస్‌కు వేర్వేరు ప్రాంతాల్లో గిరిజనులు సుమారు 100 వరకూ వినతులు సమర్పించారు. వారెదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు.

అవన్నీ కూడా గిరిజనుల హక్కులు, వారికి జరిగిన అన్యాయం. 2013లో పునరావాస సర్వే సందర్భంగా నష్టపోయిన గిరిజనులకు సంబంధించిన అంశాలే ఉన్నాయి. ఈ పర్యటనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి బలరాం, బి తులసీదాస్, ఏలూరు జిల్లా కార్యదర్శి రవి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నాగమణి తదితరులు పాల్గొన్నారు.



వైఫల్యాలను ఎదుర్కొని విజయం సాధించాలి

● విట్ అవార్డుల ప్రదానంలో నటుడు కమల్ హాసన్

చెన్నయ్ : ప్రముఖ ప్రయివేటు విద్యా సంస్థ విట్‌లో ఆగస్టు 15న చెన్నయ్‌లో జరిగిన క్రిస్టల్ కనెక్షన్స్ అలుమ్ని మీట్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు అలుమ్ని ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. దీనికి ముఖ్య అతిథిగా నటుడు కమల్ హాసన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమల హాసన్ మాట్లాడుతూ.. వైఫల్యాలను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు. భారతీయ వైఫల్యాల్ని సిగ్గుగా చూడటం ద్వారా కలలను చంపుతుందని అన్నారు. మనం వైఫల్యాల గురించి చాలా అరుదుగా మాట్లాడతామన్నారు. వైఫల్యానికి భయపడితే దేశం తన నిజమైన సామర్థ్యాన్ని ఎన్నటికీ కనుగొనలేదన్నారు. భారతదేశంలో వైఫల్యాన్ని తరచూ జీవితాంతం శిక్షగా భావిస్తున్నారు. ఈ భయం పేదరికం కంటే ఎక్కువ కలలను చంపుతుందన్నారు. ప్రతీ విజయ గాథలో ప్రజలు ఆరాధించే దాని వెనుక అనేక వైఫల్యాలు దాగి ఉంటాయన్నారు. "ఎంత ఎక్కువగా విఫలమవుతామో, అంత ఎక్కువ విద్యను సంపాదిస్తాం. స్వేచ్ఛ అంటే పడి, భయం లేకుండా మళ్లీ లేవడం." అని ఆయన కమల్ హాసన్ అన్నారు. ఉన్నత విద్యతోనే భారత్ అభివృద్ధి సాధ్యమని విట్ స్థాపక చాన్సలర్ డాక్టర్ జి విశ్వనాథన్ తెలిపారు. విద్యార్థులు ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలని విట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జివి సెల్వం అన్నారు.

ఇద్దరి పిల్లలను చంపి తండ్రి ఆత్మహత్య

● గుంటూరులో విషాదం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు చిన్నారులకు ఎలుకలు మందు తినిపించి వారు చనిపోయిన తర్వాత తాను ఆత్మహత్యకు పాల్పడిన ఒక తండ్రి విషాదాంతం గుంటూరు లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబా కాలనీలో శనివారం రాత్రి వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... కొంతకాలం క్రితం నరసరావుపేట నుంచి గుంటూరు వచ్చి నివాసం ఉంటున్న షేక్ యూసఫ్ (28) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తరచూ భార్యతో ఘర్షణ పడుతున్నారు. శనివారం భార్యతో గొడవపడిన తర్వాత తన ఇద్దరి షేక్ సయ్యద్ హుస్నేన్ (6), ఆసీఫ్ (5)లకు తినుబండారాలతో కలిపి ఎలుకల మందు తినిపించారు. వారు మరణించిన కొద్దిసేపటికి తాను ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేరుకున్నారు. లాలాపేట సిఐ శివప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టిటిడి సారె

ప్రజాశక్తి - తిరుమల

ఆడికతిక పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుత్తణి శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు శనివారం శ్రీవారి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో తిరుత్తణి ఆలయ చైర్మన్ శ్రీధర్, తమిళనాడు దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ రమణి టిటిడి చైర్మన్‌కు స్వాగతం పలికారు. టిటిడి చైర్మన్ మాట్లాడుతూ... టిటిడి తరపున శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి శ్రీవారి పట్టువస్త్రాలను సమర్పించడం సంతోషంగా ఉందన్నారు.

నేరాన్ని అంగీకరించిన నమ్రత!

● సృష్టి ఫెర్టిలిటీ కేసులో కీలక పరిణామం
● కన్ఫెషన్ రిపోర్ట్‌లో కీలక అంశాలు వెలుగులోకి..

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కూపీ లాగితే డొంక కదులుతోంది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిట్ అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి డాక్టర్ నమ్రత నేరం అంగీకరించినట్టు కన్ఫెషన్ రిపోర్ట్‌లో పోలీసులు పేర్కొన్నారు. అందులోని వివరాలిలా ఉన్నాయి.. నమ్రత విజయవాడ, సికింద్రాబాద్, విశాఖలో ఫెర్టిలిటీ సెంటర్లు నడిపారు. సరోగసి పేరుతో దంపతుల నుంచి రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు వసూలు చేశారు. ఏజెంట్లను నియమించుకొని పిల్లలను కొనుగోలు చేశారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు డబ్బులు ఆశచూపి శిశువు విక్రయానికి ఒప్పందం చేసుకునేవారు. ప్రసవం తర్వాత బాలింతల నుంచి పిల్లలను కొనుగోలు చేశారు. అందుకు ఏజెంట్లకు రూ.3 నుంచి 5లక్షలు ఇచ్చేది. అయితే ఏజెంట్లు మాత్రం బాలింతలకు రూ.50 వేల నుంచి లక్ష వరకు మాత్రమే ఇచ్చేవారు. ఆ పిల్లలను సరోగసి ద్వారా పుట్టిన వారిగా నమ్మించారు. పలు పోలీసు స్టేషన్లలో తనపై కేసులు నమోదైనట్లు నమ్రత ఒప్పుకొన్నారు. మొదట మహారాణిపేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదైందని, ఆ తరువాత వైజాగ్ టూ టౌన్, గోపాలపురం పోలీస్ స్టేషన్లలో ఐదు కేసులు, గుంటూరు కొత్తపేటలో మరో కేసు నమోదైందని, 2020లో మహారాణిపేటలో నమోదైన కేసులో రిమాండ్‌కు వెళ్లి వచ్చానని నమ్రత అంగీకరించారు. 1998లో మొదటిసారి విజయవాడలో ఫెర్టిలిటీ సెంటర్‌ను స్థాపించిన నమ్రత.. 2007లో సికింద్రాబాద్‌లో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించారని అంగీకరించారు. ఆ తర్వాత వైజాగ్‌లోనూ మరో ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభించారు. నమ్రత రెండో కుమారుడు జయంతి కృష్ణ న్యాయవాదిగా ఉంటూ ఆమెకు సహకరించేవాడని కన్ఫెషన్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. ఏజెంట్ల ద్వారా పిల్లలను కొనుగోలు చేసేవారని తెలిసింది. పిల్లల్ని కొనుగోలు చేయడంలో సంజయ్‌తోపాటు సంతోషి కీలకంగా వ్యవహరించారు. సికింద్రాబాద్ సెంటర్లో సూపర్‌వైజర్ కం ఫార్మసిస్ట్‌గా కృష్ణ, రిసెప్షనిస్ట్‌గా పద్మ, టెలికాలర్‌గా అర్చన, మేరీ, సోనా, నర్సుగా సురేఖ, ల్యాబ్ టెక్నీషియన్‌గా ప్రభాకర్ ఉన్నారు. వైజాగ్ సెంటర్లో మేనేజర్‌గా కళ్యాణి, ల్యాబ్ టెక్నీషియన్‌గా రమ్య ఉన్నారు. విజయవాడలో డాక్టర్ మధులత, డా. కిషోర్ బాబు, డా.కరుణ కీలకంగా వ్యవహరించారని నమ్రత అంగీకరించింది.

ప్రశ్నిస్తే బెదిరించేవారు

పిల్లలు కావాలనుకునే దంపతులను నమ్రత మచ్చిక చేసుకునేవారు. వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకుని లక్షలు వసూలు చేశారు. కొనుగోలు చేసిన పిల్లలను సరోగసి ద్వారా పుట్టిన వారిగా దంపతులను నమ్మించేవారు. డబ్బులు తక్కువ ఇచ్చారంటూ బాలింతలు ప్రశ్నించినా, ఇటు డీఎన్ఏ ద్వారా నిజం తెలుసుకున్న దంపతులు ఎవరైనా గుర్తించి ప్రశ్నించినా వారిని నమ్రత రెండో కుమారుడు జయంతి కృష్ణ బెదిరించేవాడని తెలిసింది. దాంతో ఇంతకాలం ఈ వ్యవహారం పెద్దగా బయటకు రాలేదు. నమ్రతపై కేసులు నమోదైనా పెద్దగా పట్టించుకోలేదు. సంపాదన కోసం తిరిగి సృష్టి ఫెర్టిలిటీ సెంటర్లను కొనసాగించింది.

ఎఐతో మానవాళికి తీవ్ర ముప్పు

● కృత్రిమ మేధ గాడఫాదర్ హెచ్చరిక

వాషింగ్టన్ : సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ (ఎఐ)తో మానవాళికి తీవ్ర ముప్పు పొంచి ఉందని 'గాడ్‌ఫాదర్ ఆఫ్ ఏఐ'గా గుర్తింపు పొందిన జాఫ్రీ హింటన్ హెచ్చరించారు. లాస్ వెగాస్‌లో జరిగిన ఎఐ4 సమావేశంలో బ్రిటిష్-కెనడియన్ కంప్యూటర్ శాస్త్రవేత్త జాఫ్రీ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఎఐ మానవాళిని తుడిచిపెట్టే అవకాశం ఉందన్నారు. దీనిని నివారించడానికి భావోద్వేగ స్పందనలు కలిగి ఉండేలా ఎఐ వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. మానవుల సంరక్షణ పట్ల వాటికి అవగాహన కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఎఐ వ్యవస్థలు మానవుల నియంత్రణలోనే ఉన్నాయని.. ఎప్పటికీ ఇలాగే కొనసాగుతాయని మాత్రం చెప్పలేమని జాఫ్రీ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎఐ మానవమేధస్సును అధిగమించిన తర్వాత మనం పెట్టిన పరిమితులను దాటగలిగే మార్గాలను అన్వేషిస్తుందని హెచ్చరించారు. ఇటీవల ఓ ఎఐ వ్యక్తిగత రహస్యాలు బయటకు చెప్పే స్తానంటూ దాన్ని తయారు చేసిన ఇంజినీర్‌ను బెదిరించడాన్ని జాఫ్రీ గుర్తు చేశారు. భవిష్యత్తులో మానవులు ఇటువంటి అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి రావొచ్చన్నారు. ఈ నేపథ్యంలో తల్లీబిడ్డల రీతిలో భావోద్వేగ స్పందనలు కలిగి ఉండేలా ప్రత్యేక ఎఐ వ్యవస్థను రూపొందిచాలని సూచించారు. తద్వారా మానవాళికి ముప్పు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. కాగా.. ఎఐతో ప్రమాదాలు ఉన్నప్పటికీ ఆరోగ్య రంగంలో దాని వినియోగంతో ఎన్నో ప్రయోజనాలు పొందొచ్చన్నారు. ఔషధ అభివృద్ధి, క్యాన్సర్ చికిత్సలో పురోగతి, ముందస్తు రోగ నిర్ధరణ, చికిత్స ప్రణాళికకు ఎంతగానో సహకరిస్తుందని అన్నారు. వచ్చే 5 నుంచి 20 ఏళ్లలో ఎఐ సాంకేతికత అత్యంత అభివృద్ధి చెందిన స్థితిలో మానవ మేధస్సును అధిగమించి, మానవుల నియంత్రణను దాటి వెళ్లే అవకాశం ఉందని హెచ్చరించారు.

వర్షాలతో రోడ్లు కోత


ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)

రోడ్డు పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కోతకు గురవుతున్నాయి. మండలంలో మారుమూల పిన్నకోట, కివర్ల, పెద్దకోట పంచాయతీల పరిధి పెదకోట మెయిన్ రోడ్డు నుండి బోనూరు సిడిమెట్టు మీదుగా పూతికపుట్టు, టెంకలబంద 12 గ్రామాలకు సంబంధించి రింగ్ రోడ్డు పనులు చేపట్టేందుకు ఎంజిఎన్ఆర్ఇజిఎస్. పిఎం జన్మన్ పథకంలో భాగంగా 2020 సంవత్సరంలో నిధులు మంజూరయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు రోడ్డు పనులు పూర్తి కాలేదు. దీంతో, భారీ వర్షాల కారణంగా రోడ్లంతా కోతకు గురై వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆ రోడ్డుపై కాలి నడకన వెళ్లేందుకు కూడా వీలులేకుండా ఉంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పనులు జరగకుండా ఏళ్ల తరబడి నిలిచిపోయాయని గిరిజనులు విమర్శించారు. ఆయా గ్రామాల్లో అనారోగ్యానికి గురైన గిరిజన ప్రజలు, గర్భిణిలను సకాలంలో ఆస్పతులకు వైద్యం కోసం చేర్చలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి నిలిచిపోయిన రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన బోనూరు, పూతికపుట్టు రోడ్డు

ఛెత్రీకి నో ఛాన్స్



కోల్‌కతా: భారత ఫుట్‌బాల్ లెజెండ్ సునీల్ ఛెత్రీకి బిగ్ షాక్. జట్టుకోసం వీడ్కోలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న ఛెత్రీకి సెంట్రల్ ఆసియా ఫుట్‌బాల్ అసోసియేషన్(సిఎఎఫ్ఎ) నేషన్స్ కప్ ప్రాబబుల్స్ కోసం ఎంపిక చేసిన బృందంలో చోటు దక్కలేదు. ఛెత్రీని తీసుకోకపోవడానికి కారణం ఏమిటో తెలియరాలేదు. అటు భారత ఫుట్‌బాల్ సమాఖ్య(ఎఐఎఫ్ఎఫ్)గానీ, ఇటు కొత్త కోచ్ ఖలీత్ జమిల్‌గానీ ఈ విషయంపై ఎలాంటి అభిప్రాయాన్ని వెల్లడించలేదు. దాంతో, కొన్నేళ్లుగా బ్లూ టైగర్స్‌కు కీలక విజయాలను అందించిన ఈ మాజీ సారథి అంతర్జాతీయ కెరీర్‌పై సందేహాలు తలెత్తుతున్నాయి. గత ఏడాది జూన్‌లో వీడ్కోలు పలికిన ఛెత్రీ ఈ ఏడాది యూటర్న్ తీసుకున్నాడు. చెత్త ఆటతో వరుసగా ఓడిపోతున్న బ్లూ టైగర్స్‌ను విజయపథాన నడిపించేందుకు సిద్ధమయ్యాడు. అయినా సరే సెలెక్టర్లు అతడికి మొండిచేయి చూపించారు. నేషన్స్ కప్ కోసం ఎంపిక చేసిన 35 మందిలో ఛెత్రీ ఆడుతున్న బెంగళూరు ఎఫ్‌సికి చెందిన ఆటగాళ్లు ఉన్నారు. గుర్‌ప్రీత్ సింగ్, రాహుల్ భెకే, రోషన్ సింగ్, సురేష్ సింగ్‌లను తీసుకున్న సెలెక్టర్లు స్టార్ ఫార్వర్డ్ అయిన ఛెత్రీని విస్మరించారు. ఆగస్టు 29న ఉజ్బెకిస్థాన్, తజకిస్థాన్ వేదికగా నేషన్స్ కప్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో భారత జట్టు గ్రూప్-బిలో ఉంది. ఇందులోనే ఆతిథ్య తజకిస్థాన్, ఇరాన్, అఫ్గనిస్తాన్ ఉన్నాయి.

ఐసిసి అండర్-19 ప్రపంచకప్

● చివరి బెర్తు దక్కించుకున్న అమెరికా
● కొత్తగా టాంజానియా, జపాన్‌కు చోటు

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) అండర్-19 పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌కు రంగం సిద్ధమైంది. జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న ఈ మెగా టోర్నీలో పోటీపడే 16 జట్ల జాబితా ఖరారైంది. అమెరికాస్ క్వాలిఫయర్‌లో అద్భుత ప్రదర్శన చేసిన యుఎస్ఎ, చివరి జట్టుగా అర్హత సాధించి వరల్డ్‌కప్ బెర్తును దక్కించుకుంది. గత 2024 ఎడిషన్‌లో టాప్-10లో నిలిచిన జట్లు నేరుగా ఈ టోర్నీకి అర్హత సాధించాయి. వీటిలో భారత్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, ఇంగ్లండ్ వంటి బలమైన జట్లు ఉన్నాయి.

ఆతిథ్య దేశంగా జింబాబ్వేకు నేరుగా ప్రవేశం లభించింది. మిగిలిన ఐదు స్థానాల కోసం ఆఫ్రికా, అమెరికాస్, ఆసియా, ఈస్ట్ ఆసియా-పసిఫిక్, యూరప్ రీజియన్లలో క్వాలిఫయింగ్ టోర్నీలు నిర్వహించారు. ఈసారి టోర్నీలో కొన్ని కొత్త జట్లు తమ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాయి. ఆఫ్రికా క్వాలిఫయర్‌లో టాంజానియా, ఈస్ట్ ఆసియా-పసిఫిక్ నుంచి జపాన్ జట్లు అర్హత సాధించి అందరి దష్టిని ఆకర్షించాయి. ఈ జట్ల చేరికతో పాటు, బలమైన జట్ల మధ్య పోరుతో ఈ టోర్నమెంట్‌పై ఆసక్తి నెలకొంది. క్రికెట్ ప్రపంచంలో భవిష్యత్ తారలను పరిచయం చేసే ఈ వేదిక, మరోసారి ఉత్కంఠభరితమైన పోరుకు సిద్ధమవుతోంది.

టోర్నీలో పాల్గొనే జట్లు ఇవే:

ప్రధాన ఆతిథ్య దేశం: జింబాబ్వే

నేరుగా అర్హత పొందినవి: భారత్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, ఐర్లాండ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్.

క్వాలిఫయర్ల ద్వారా: టాంజానియా(ఆఫ్రికా), అమెరికా (అమెరికాస్), ఆఫ్ఘనిస్థాన్(ఆసియా), జపాన్(ఈస్ట్ ఆసియా-పసిఫిక్), స్కాట్లాండ్(యూరప్).

ఆస్ట్రేలియా తొలి కోచ్ సింప్సన్ కన్నుమూత




సిడ్నీ: ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ బాబ్ సింప్సన్(89) కన్నుమూశారు. అనారోగ్యంతో సిడ్నీలోని నివాసంలో సింప్సన్ మరణించారని ఆస్ట్రేలియా క్రికెట్(సిఎ) శనివారం వెల్లడించింది. ఒక లెజెండరీ ఆటగాడిని కోల్పోయామని ఆసీస్ బోర్డు ట్వీట్ చేసింది. 'టెస్టు జట్టు సారథి, కెప్టెన్, కోచ్, జాతీయ సెలెక్టర్.. ఇలా ఎన్నో పాత్రల్ని పోషించిన బాబ్ సింప్సన్ ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఒక శిఖరం లాంటివాడు. మా దేశంలో క్రికెట్ అభివద్ధికి ఆయన ఎంతో సేవ చేశాడు. ఒక దిగ్గజ ఆటగాడిని కోల్పోయాం. ఈ బాధాకరమైన సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు సానుభూతి తెలియజేస్తున్నాం' అని క్రికెట్ ఆస్ట్రేలియా పోస్ట్‌లో వెల్లడించింది. 1957లో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. 29టెస్టుల్లో ఆస్ట్రేలియాకు సారథ్యం వహించిన సింప్సన్ 62 టెస్టుల్లో 46.81 సగటుతో రాణించాడు. 71 వికెట్లు తీశాడు. వీడ్కోలు తర్వాత 1986లో కోచ్‌గా పగ్గాలు చేపట్టాడు సింప్సన్. మరుసటి ఏడాదే జాతీయ సెలెక్టర్‌గా జట్టు ఎంపికలో కీలక పాత్ర పోషించాడు. అతడు సెలెక్టర్‌గా ఉన్నప్పుడే డేవిడ్ బూన్, డీన్ జోన్స్, స్టీవ్ వా, మెర్వ్ హ్యూస్ ఆసీస్ తరపున ఆడారు.

హిమాలయ ప్రాంత పర్యావరణ పరిరక్షణకు ఉద్యమిద్దాం

- వరుస విపత్తుల నేపథ్యంలో సిపిఎం నేత తరిగామి పిలుపు

శ్రీనగర్ : హిమాలయ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ తక్షణమే ఉద్యమించాల్సిన అవసరం ఉందని జమ్ముకాశ్మీర్ ప్రజానీకానికి సిపిఎం నేత మహ్మద్ యూసుఫ్ తరిగామి పిలుపునిచ్చారు. కిష్త్వార్ ప్రాంతంలోని చిసోటీ పల్లెలో ఇటీవల కుండపోత కారణంగా 70 మంది చనిపోవడం, వందలాది మంది గాయపడిన నేపథ్యంలో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. జమ్ముకాశ్మీర్ అసెంబ్లీకి కుల్గాం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న తరిగామి పర్యావరణ కమిటీకి చైర్మన్‌గా కూడా ఉన్నారు. ప్రకృతి విపత్తులకు మానవ తప్పిదాలే కారణమని ఆయన చెప్పారు. ప్రకృతిని ఒక వస్తువుగా మార్చిన దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వైవిధ్యమైన పర్యావరణవాద స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. చిసోటి పల్లెలో సంభవించిన క్లౌడ్ బరస్ట్‌పై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హిమాలయ ప్రాంతంలో ఆకస్మిక వరదలు, కొండచరియలు, మంచుపెళ్లలు విరిగిపడడం వంటి ముప్పులు పొంచి వున్నందున మొత్తంగా వాతావరణ మార్పులపై, పర్యావరణ పరిరక్షణపై దృష్టి కేంద్రీకరించాల్సిన సమయం ఆసన్నమైందని తరిగామి పేర్కొన్నారు.

'గాలులు మనల్ని హెచ్చరిస్తున్నాయి, నదులు ఆక్రందనలు పెడుతున్నాయి. ఇది కేవలం విపత్తు కాదు, వ్యవస్థాగత మార్పుల కోసం ఇచ్చిన స్పష్టమైన పిలుపు' అని ఆయన వ్యాఖ్యానించారు. వాతావరణ న్యాయం కోసం సమైక్యంగా పోరాటం సాగించాలని, ఇందుకు పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలందరూ కార్మికులు, విద్యార్థులు, మేధావి వర్గం అందరూ కలిసి రావాలని ఆయన కోరారు. ఈ విషాద ఘటనపై అత్యవసరంగా, నిర్దిష్ట కాలపరిమితిలో దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.



భారీ వర్షాల కారణంగా కిష్త్వార్‌లో విరిగిపడ్డ కొండ చరియలు, ధ్వంసమైన ఇళ్లు, వాహనాలు (ఇన్‌సెట్‌లో తరిగామి)

- జమ్మూ ప్రాంతంలోనిఎత్తైన ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్‌లు, ఆకస్మిక వరదలు, భారీ వర్షపాతం గురించి ముందుగానే వాతావరణ విభాగ హెచ్చరికలు వున్నా ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. ఇది నేరపూరితమైన నిర్లక్ష్యం కిందకే వస్తుందన్నారు. దీనికి జవాబుదారీ ఎవరో నిర్ణయించి ఆ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.
- కార్పొరేట్ పర్యావరణ దోపిడీ, అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం, ప్రజల భద్రత పట్ల ఆందోళన లేకపోవడం ప్రకృతి విపత్తులకు ప్రధాన కారణాలని తరిగామి పేర్కొన్నారు. ఇలాంటి విపత్తులను కేవలం ప్రకృతి వైపరీత్యాలు అనలేమని, నిర్లక్ష్యంగా సాగుతున్న వనరుల దోపిడీ, అడవుల నరికివేత, అనధికారికంగా కొండరాళ్ళ కొట్టివేత, భూమిని ఒక వ్యాపార వస్తువుగా మార్చడం ప్రధాన కారణాలని అన్నారు. ప్రకృతి యావత్తూ న్యాయం కోసం విలపిస్తున్నా, పాలక వర్గాలకు మాత్రం ఏమీ పట్టడం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు.
- హిమాలయ ప్రాంతంలో పర్యావరణ సంస్థలు లేదా విభాగాలు ఎలాంటి సర్వేలైనా నిర్వహించాయా? క్లౌడ్‌బరస్ట్‌ల నివారణకు, ప్రజల భద్రతకు చర్యలేమైనా సిఫార్సు చేశారా అని ఆయన ప్రశ్నించారు. జమ్మూ కాశ్మీర్‌కు వాతావరణ న్యాయం జరగాలంటే కొన్ని చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.
- వాతావరణ విధాన రూపకల్పనలో సామాన్యులకూ పాత్ర కల్పించాలన్నారు. వాతావరణ ముప్పులను తగ్గించే వ్యూహాల్లో తమ వాణి వినిపించేందుకు, వివిధ ప్రభుత్వ విభాగాలు, సంస్థలతో పాటూ పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేసే కార్యకర్తలు, ఎన్‌జిఒలను కూడా చేర్చుకోవాలని, వారితో సమన్వయం చేసుకోవాలన్నారు.
- వాతావరణ నష్ట పరిహారాల కోసం కేంద్రం, కేంద్ర పరిపాలిత యంత్రాంగం తమయంత్రాంగాలను వ్యవస్థీకరించుకోవాలని కోరారు. బాధితులకు నష్టపరిహారం అందేలా వారికి పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అడవుల నరికివేతను అడ్డుకునేందుకు, నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు, కార్పొరేట్ల లూటీ నుండి పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించేందుకు ప్రజా ఉద్యమం ప్రారంభించాలన్నారు.
- ముమ్మరంగా వర్షాలు పడుతున్నప్పుడు ఆ వాస్తవిక తీవ్రతను గుర్తించేందుకు వాతావరణ ఉపగ్రహాలు, అడ్వాన్స్‌డ్ డాప్లర్ రాడార్లను మోహరించడం వంటి సత్వర వాతావరణ హెచ్చరికల వ్యవస్థలు అమలు చేయాలన్నారు. మొబైల్ ఫోన్లద్వారా సకాలంలో హెచ్చరికలు జారీచేయాలన్నారు. ప్రజలందరికీ తక్షణమే చేరేలా స్థానిక ప్రసారమాధ్యమాల్లో, లౌడ్ స్పీకర్ల ద్వారా సమాచారాన్ని అందించడానికి ప్రయత్నించాలన్నారు.

నేటి నుంచి 'ఓట్ అధికార్ యాత్ర'

- బీహార్‌లో 16 రోజుల పాటు పర్యటించనున్న రాహుల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో : ఎన్నికల సంఘం బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)కు, ప్రజల ఓటు హక్కుపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆదివారం 'ఓట్ అధికార్ యాత్ర'ను చేపట్టనున్నట్టు కాంగ్రెస్ సీనియర్ నేత అఖిలేశ్ ప్రసాద్ సింగ్ తెలిపారు. ఈ యాత్ర ద్వారా 16 రోజులు..1300 కిలోమీటర్ల పరిధిలోని ఓటర్లకు అవగాహన కల్పించ నున్నట్టు ఆయన వివరించారు. శనివారం పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'బీహార్‌లో ఓట్ అధికార్ యాత్రను ఆదివారం ససారం నుంచి రాహుల్ గాంధీ ప్రారంభించనున్నారు. ఈ యాత్ర ముగిసేవరకు రాహుల్ రాష్ట్రంలోనే ఉండనున్నారు. ఈ యాత్ర కోసం ముందుగానే అనుమతులు తీసుకున్నాం. ఈ యాత్ర రాష్ట్రంలోని 24 జిల్లాలు, 118 నియోజకవర్గాలను కవర్ చేస్తుంది. ఆగస్టు 20, 25, 31 తేదీల్లో యాత్రకు విరామం. సెప్టెంబర్ 1న పాట్నాలో జరిగే ర్యాలీతో ఈ యాత్ర ముగుస్తుంది.

ఓట్ల చోరీపై 'లాపతా ఓట్' వీడియో విడుదల

బీహార్ ఓటర్ల జాబితాలో లోపాలపై రాహుల్ గాంధీ విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా ఆయన శనివారం 'లాపతా ఓట్' (ఓట్లు కోల్పోయిన) అనే టైటిల్‌తో వీడియోను ఎక్స్‌లో విడుదల చేశారు. నిమిషం నిడివి ఉన్న ఆ వీడియోలో.. పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి తన ఓటు చోరీ చేశారని, ఇంకా లక్షల ఓట్లు చోరీ అయ్యాయని అధికారులకు ఫిర్యాదు చేస్తారు. పోలీసు సిబ్బంది చెక్ చేసి అందులో తమ ఓట్లు కూడా గల్లంతుకావడంతో నిర్ఘాంతపోతారు. అలా ఆ వీడియో ముగుస్తుంది. దీనిని రాహుల్ తన అధికారిక ఎక్స్‌లో పోస్టు చేస్తూ.. "ఓటర్లందరూ చైతన్యంతో ఓ ఉద్యమంలా ముందుకు సాగాలి. మీ ఓటు చోరీ అయితే మీ ప్రాథమిక హక్కు చోరీ అయినట్లే " అని పేర్కొన్నారు.

కేరళలో భారీ వర్షాలు

- ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

తిరువనంతపురం : కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భారత వాతావరణ శాఖ ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎర్నాకులం, ఇడుక్కి, త్రిస్సూర్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాకు భారత వాతావరణ శాఖ శనివారం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక మిగిలిన తొమ్మిది జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. 11 నుంచి 20 సెంటిమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉన్నప్పుడు ఆరెంజ్ అలర్ట్.. 6 నుంచి 11 సెంటిమీటర్ల వరకు కురిసే వర్షపాతానికి ఎల్లో అలర్ట్‌ను ఐఎండీ జారీ చేస్తుంది. ఇలాంటి వాతావరణం నేపథ్యంలో 40 కిలోమీటర్ల మేర బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు రాజస్థాన్‌లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రతినిధి శనివారం తెలిపారు. ఉదరుపూర్, జోదాపూర్‌లో రాబోయే ఐదు రోజుల్లో ఉరుములు. మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కోటా, అజ్మీర్, జైపూర్, భరత్‌పూర్, బికనీర్‌లలో తేలికపాటి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

అమెరికా సుంకాలతో తమిళనాడుకు తీవ్ర నష్టం

- మిగతా రాష్ట్రాలకంటే అధికం
- సిఎం ఎంకె స్టాలిన్ ఆందోళన

చెన్నై : అమెరికా భారత్‌పై 50 శాతం పన్నులను విధించింది. ఈ పన్నుల వల్ల మిగతా రాష్ట్రాల కంటే.. తమిళనాడుకే ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అన్నారు. 'మన ఎగుమతులు అమెరికా మార్కెట్‌తో ముడిపడి ఉన్నందున తమిళనాడు మిగతా రాష్ట్రాల కంటే తీవ్రంగా దెబ్బతింటుంది. వస్త్రాలు, తోలు, ఆటో యంత్రాలు, ఇతర రంగాలలో లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి" అని స్టాలిన్ ఈ మేరకు శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. మ్యాన్ మేడ్ ఫైబర్స్‌పై 5 శాతం జీఎస్టీని నిర్ణయించడం, పత్తి దిగుమతులపై సుంకాన్ని తొలగించడం, మారిటోరియంతో సులభమైన, తక్కువ వడ్డీ రుణాలను పొడిగించడం వంటి అనేక చర్యలు తీసుకోవాలని స్టాలిన్ ప్రధాని మోడీని కోరారు. సుంకాల సంక్షోభాన్ని పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వానికి తమిళనాడు పూర్తి మద్దతు ఇస్తోంది. ఈ వాణిజ్య సంక్షోభాన్ని అధిగమించడానికి తమిళనాడు కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుంది అని స్టాలిన్ అన్నారు.

ఒప్పందం లేకుండానే ముగిసిన పుతిన్ - ట్రంప్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

కుదరలేదని చెప్పారు. పుతిన్ మాట్లాడుతూ, ఉక్రెయిన్ భద్రతకు హామీ కల్పించేందుకు అంగీకరించినట్లు చెప్పారు. ఇప్పుడు కుదిరిన అవగాహన శాంతి వైపుగా మార్గం వేసేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఘర్షణల నుండి చర్చలకు వచ్చామన్నారు. ఏ సమస్యకైనా పరిష్కారమనేది నిలకడగా, స్థిరంగా వుండాలి, సంక్షోభానికి మూల కారణాలను పరిష్కరించేదిగా వుండాలని అన్నారు. శాంతి ప్రక్రియను దెబ్బతీయడాన్ని ఆపాలని కీవ్‌ను కోరారు. ఇరువురు నేతలు దాదాపు 12 నిముషాల పాటు విలేకర్ల ముందు నిలుచుని మాట్లాడారు. పురోగతి సాధించినట్లు ఇరువురు నేతలు నొక్కి చెప్పారు, కానీ నిర్దిష్టంగా వివరాలు వెల్లడించలేదు. కాగా చర్చలు సానుకూలంగా సాగాయని తెలిపారు. మాస్కోలో తదుపరి దఫా చర్చలు జరిగే అవకాశం వుంది. "జరుగుతున్నదంతా మాకు పెద్ద విషాదమే, భయంకరమైన గాయమే", దీనికి స్వస్తి పలికేందుకు రష్యా నిజాయితీగా ఆసక్తితో వుందని పుతిన్ చెప్పారు. అయితే ఈ ఘర్షణలకు గల ప్రాథమిక కారణాలను పరిష్కరించాల్సిన అవసరమైతే వుందని ఆయన నొక్కి చెప్పారు. కానీ, సమస్యలను సృష్టించొద్దని ఉక్రెయిన్‌ను, యురోపియన్ దేశాలను పుతిన్ హెచ్చరించారు. ఉక్రెయిన్ సమస్యను పరిష్కరించడానికే కాదు, రష్యా, అమెరికాల మధ్య వ్యాపార తరహా, ఆచరణాత్మక సంబంధాలు పునరుద్ధరించడానికి కూడా ఈ సమావేశం ఒక నాందీ ప్రస్తావనగా వుండగలదని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వాణిజ్యం, ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం,రోదసీ అన్వేషణ, ఆర్కిటిక్ వంటి రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారానికి మంచి అవకాశాలు వున్నాయని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, యురోపియన్ నేతలను కలవనున్నట్లు ట్రంప్ చెప్పారు. విలేకర్లు ప్రశ్నలు అడగకుండానే నేతలు చెప్పిన వెంటనే పత్రికా సమావేశం ముగిసింది. ఇరువురు నేతలు సమగ్రంగా చర్చల ఫలితాల సారాంశాన్ని చెప్పినందున ఇక మీడియా ప్రశ్నలు అడగడం అనవసరమని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు.

ఇక జెలెన్స్కీదే బాధ్యత

ఈ సమావేశం ముగిసిన వెంటనే ట్రంప్ ఫాక్స్ న్యూస్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ, ఇక కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాల్సింది జెలెన్స్కీనే అని ట్రంప్ వ్యాఖ్యానించారు. భూ ఆక్రమణలు, భద్రతా హామీలు వంటి అంశాలు పుతిన్‌తో జరిగిన సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయని సూచనప్రాయంగా చెప్పారు. త్వరలోనే పుతిన్, జెలెన్స్కీ, తాను సమావేశమవుతామని చెప్పారు.

యుద్ధానికి ముగింపు పలికేందుకు సిద్ధమే : జెలెన్స్కీ

యుద్ధం ముగించే దిశగా నిర్మాణాత్మక సహకారాన్ని అందించేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 18న సోమవారం అమెరికా వెళ్లనున్నట్టు ఆయన తెలిపారు.

స్వాగతించిన భారత్ : అలాస్కా వేదికగా అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య జరిగిన సమావేశాన్ని భారత్ స్వాగతించింది. శాంతి సాధన దిశగా వారి ప్రయత్నాలు ఎంతో ప్రశంసనీయమని, ఈ భేటీలో సాధించిన పురోగతిని అభినందిస్తున్నామని విదేశాంగ శాఖ తెలిపింది. చర్చలు, దౌత్యం ద్వారా ముందు కెళ్లాలని, ఉక్రెయిన్ సంక్షోభానికి వీలైనంత త్వరగా తెరపడాలని ప్రపంచం కోరుకుంటోందని పేర్కొంది.

ముస్లిం లీగ్‌లో దాడిలో గాయపడ్డ సిపిఎం కార్యకర్త కన్నుమూత

- 13 ఏళ్లుగా మృత్యువుతో పోరాటం

కన్నూర్ : కేరళలోని కన్నూరు జిల్లాలో 13 ఏళ్ల కిందట ఇండియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) కార్యకర్తలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి..అప్పటి నుంచి చికిత్స పొందుతున్న సిపిఎం కార్యకర్త వెలియారి మోహనన్ (60) శనివారం కన్నుమూశారు. స్థానిక మాతమంగళం పట్టణం శ్మశాన వాటికలో శనివారం ఉదయం 10 గంటలకు ఆయన అంత్యక్రియలు జరిగాయి. వామపక్షాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వెలియారికి నివాళులర్పించారు. సైద్ధాంతిక పోరాటం చేయడంలో చేవలేని ముస్లిం లీగ్‌కు చెందిన దుండగులు 2012 ఫిబ్రవరి 21న మోహనన్‌పై భౌతిక దాడికి దిగారు. 15 మంది గూండాలు మోహనన్ ఇంటి తలుపులు పగలగొట్టి లోపలకు చొరబడి ఇంట్లోని వస్తువులన్నీ ధ్వంసం చేసి, కిటికీలు, తలుపలను పగలగొట్టి, తన చిన్న కొడుకుతో కలిసి నిద్రపోతున్న మోహనన్‌ను మంచంపై నుండి బయటకు లాక్కుని వచ్చి దాడి చేశారు. ఈ దాడికి పాల్పడిన వారిలో స్థానిక నేతలు, ముస్లిం లీగ్‌లో చురుకుగా వున్న సభ్యులు మహ్మద్ సాలిహ్, ఎం రవూఫ్ కూడా వున్నారు. ఆ సమయంలో మరో గదిలో చదువుకుంటున్న మోహనన్ పెద్ద కుమారుడు మిథున్‌పైనా దాడి చేశారు. మోహనన్ భార్య రాధా, తల్లి కల్యాణి ఆ దుండగులను అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారినీ చితకబాదారు. మోహనన్‌ను బయటకు తరుముతూ.. వెంటాడి పదే పదే కొట్టారు. దీంతో మోహనన్ ఒక్కసారిగా కుప్పకూలడంతో వారు అతనిని లాక్కుంటూ దూరంగా గల అటవీ ప్రాంతంలో వదిలేసి వెళ్ళిపోయారు. మోహనన్ చనిపోయాడని భావించి అక్కడి నుంచి దుండగులు పరారయ్యారు. ఈ లోగా కొంతమంది స్థానికులు, పార్టీ కార్యకర్తలు రక్తపు మడుగులో పడివున్న మోహనన్ గుర్తించి ఆసుపత్రికి తరలించారు. ఆయన తలకు, ఛాతీకి, పొట్టకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనకు జ్ఞాపక శక్తి పోవడమే కాదు, మాటలు కూడా పోయాయి. 13 ఏళ్లుగా జీవచ్ఛవంగా చికిత్స పొందుతూ ఆఖరుకు శనివారం తుదిశ్వాస విడిచారు.



వెలియారి మోహనన్‌కు నివాళులర్పిస్తున్న వామపక్షాల నాయకులు

ఆ అధికారం కోర్టుకు ఉండదు

- రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధింపు అంశంపై సుప్రీంకోర్టులో కేంద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చట్ట సభలు ఆమోదించిన బిల్లులకు తమ ఆమోద ముద్ర వేసే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటం అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించేలా కోర్టులు వారిని నిర్దేశించవచ్చా? అన్నదానిపై సుప్రీంకోర్టు కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులకు జారీ చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో కేంద్రం స్పందిస్తూ ఇలా కోర్డులు గడువు విధించడం ద్వారా జోక్యం చేసుకోవడం రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉందని పేర్కొంది. బిల్లుల అంగీకారం అంశంలోనూ కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంది. బిల్లులపై గడువు విధింపుతో రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కూడా అభిప్రాయపడింది. ఆ రెండు స్థానాలు ప్రజాస్వామ్య పాలనకు ఉన్నత ఆదర్శాలుగా చెప్పుకొచ్చింది. అయితే వారి విధుల్లో ఏవైనా లోపాలు ఉంటే న్యాయ జోక్యాల కంటే.. రాజ్యాంగపరమైన యంత్రాంగంతో సరిదిద్దుకోవాల్సి వుంటుందని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. సుప్రీం కోర్టు నిర్ణీత కాలపరిమితిని విధించడం వల్ల రాజ్యాంగం స్థాపించిన సున్నితమైన సమతుల్యత చెదిరిపోతుందని, చట్టపాలనను తిరస్కరిస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు.

కెనడాలో విమానయాన సిబ్బంది పోరుబాట

- సమ్మెతో స్తంభించిన సేవలు
- 700 'ఎయిర్ కెనడా' సర్వీసులు రద్దు

టోరంటో : కెనడాలో పౌర విమానయాన సిబ్బంది పోరుబాట పట్టారు. వేతనాల పెంపు కోసం పదేపదే విజ్ఞప్తులు చేస్తున్నా యాజమాన్యాలు పట్టించుకోకపోవడంతో ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. చాలీచాలని వేతనాలతో వెట్టి చాకిరీ చేయించుకున్న యాజమాన్యం తమ వేతనాలను తక్షణమే పెంచాలని, ఆగస్టు 16, 2025లోగా వేతనాలపై నిర్ణయం తీసుకోకపోతే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామంటూ విమానాల్లోనూ, విమానశ్రయాల్లోనూ వివిధ రకాల సేవలందించే 'ఫ్లైట్ అటెండెంట్లు' సంఘం ఇదివరకే సమ్మె నోటీసు అందజేసింది. కానీ యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడం ఉద్యోగులంతా 'సమ్మె మొదలైంది' అని రాసివున్న ప్లకార్డులు చేబూని ఆందోళనలు చేపట్టారు.

కెనడాలో అతిపెద్ద విమానయాన సంస్థగా ఉన్న ఎయిర్ కెనడా నిత్యం 700 సర్వీసులు నడిపిస్తోంది. ఇందులో 10 వేల మంది ఫ్లైట్ అటెండెంట్లు పనిచేస్తున్నారు. విమాన ప్రయాణ సమయంలో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు వీరిదే బాధ్యత. అయితే, వేతనాల పెంపునకు సంబంధించి కెనడియన్ యూనియన్ ఆఫ్ పబ్లిక్ ఎంప్లాయిస్ (సియుపిఇ) ఆగస్టు 13న సమ్మె నోటీసులు ఇచ్చింది. శనివారంనాటితో ఆ గడువు ముగియగా.. ఇప్పటికీ ఒప్పందం కుదరకపోవడంతో సమ్మె ప్రారంభమైనట్టు ఉద్యోగ సంఘం వెల్లడించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా సేవలందించే దాదాపు 700 'ఎయిర్ కెనడా' విమానాలు గ్రౌండ్‌కే పరిమితమయ్యాయి. సమ్మె నేపథ్యంలో సర్వీసులను క్రమంగా రద్దు చేస్తున్నామని, శనివారం నాటికి పూర్తిగా నిలిపివేస్తామని ఎయిర్ కెనడా ముందస్తుగానే ప్రకటించింది. ఎయిర్ కెనడా, అనుబంధ సంస్థ ఎయిర్ కెనడా రూజ్ కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. థర్డ్ పార్టీ నిర్వహిస్తున్న ఎయిర్ కెనడా ఎక్స్‌ప్రెస్ సేవలు మాత్రం కొనసాగుతాయని తెలిపింది. తాజా పరిణామంతో రోజుకు 1.3 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడనుంది.



కెనడాలో ఒంటారియోలోని మిస్సిసాగాలో ఉన్న టోరంటో పియర్సన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆందోళన చేస్తున్న విమానయాన సిబ్బంది



పాకిస్థాన్‌లోని సలార్‌ర్జై ప్రాంతంలో వరదల కారణంగా చనిపోయినవారికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ప్రజలు

పాకిస్తాన్‌లో వరద బీభత్సం

- రెండు రోజుల్లో 321 మంది మృతి

లాహోర్ : పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఆకస్మిక వరదల కారణంగా రెండ్రోజుల్లోనే 321 మంది మరణించారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోనే 307 మంది చనిపోయినట్టు ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం శనివారం పేర్కొంది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని లోయర్ దిర్, బజౌర్, అబోటాబాద్, జబ్రారీతో సహా పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో భారీ విధ్వంసం చోటుచేసుకుంది. వరదల కారణంగా పదుల సంఖ్యలో భవనాలు, పాఠశాలలు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కూడా కొట్టుకుపోయాయి. అనేక రహదారులు జలదిగ్బంధమయ్యాయి. వరదల్లో అనేక మంది గల్లంతైనట్టు అధికారులు వెల్లడించారు. వీరికోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు దాదాపు రెండు వేల మందితో ఆపరేషన్ కొనసాగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. మరోవైపు పాక్‌లోని మరిన్ని ప్రాంతాలకు భారీ వర్ష ముప్పు పొంచి ఉన్నట్టు స్థానిక వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.

భారతావని డిజిటల్ వెలుగురేఖ కేరళ

(మొదటిపేజీ తరువాయి)

పొందుతోంది. అయితే ప్రతి రంగంలోనూ ఆన్‌లైన్ సేవలు విస్తృతమవుతున్న నేపథ్యంలో ఏ ఒక్క పౌరుడు వీటిని అందుకోవడంలో వెనుకబడరాదనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ 'డిజి కేరళ..' ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సర్వే చేపట్టి 14 ఏళ్ల పైబడిన వారిలో డిజిటల్ పరిజ్ఞానం లేనివారిని గుర్తించింది. ఆ తర్వాత వారికి డిజిటల్ శిక్షణ ఇచ్చారు. ఇందులో స్మార్ట్‌ఫోన్ వినియోగంతో పాటు ఇంటర్నెట్ బ్రౌజింగ్, వీడియో, ఆడియో కాల్స్ చేయడం, ఫొటోలు, వీడియోలు డౌన్‌లోడ్ చేయడం వంటి అనేక అంశాలు నేర్పించారు. దీంతో పాటు యూట్యూబ్, సోషల్ మీడియా వాడకంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న 'ఇ- సేవలు', బ్యాంకు సేవలకు సంబంధించిన ప్రాథమిక డిజిటల్ సేవలను అంటే నగదు పంపడం, ఇ-వ్యాలెట్ వాడటం వంటి అంశాలను నేర్పించారు.

రాష్ట్రవ్యాప్తంగా 83 లక్షల కుటుంబాల్లోని 1.5 కోట్ల ప్రజలను సర్వే చేశారు. ఇందులో 21,88,398 మందిని డిజిటల్ నిరాక్షరాస్యులుగా గుర్తించారు. అందులో 21,87,966 మందికి డిజిటల్ ట్రైనింగ్ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర ఆర్థిక, గణాంక వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ అక్షరాస్యత పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ డిజిటల్ అక్షరాస్యత పరీక్షల్లో 21,8,667 (99.98 శాతం) మంది పాస్ అయ్యారు. తొలిసారి ఈ పరీక్ష రాసి విఫలమైన వారికి మరోమారు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి మళ్లీ శిక్షణ అందించారు. ఆ తర్వాత వారు కూడా డిజిటల్ అక్షరాస్యత పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు.

నిర్వాసితుల కష్టాలు పట్టవా?

(మొదటి పేజీ తరువాయి)

స్థాయిలో మౌలిక వసతులతో కూడిన పునరావాసం కల్పించాల్సిన బాధ్యతను రాష్ట్రంలోని గత, ప్రస్తుత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని వివరించారు. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను పరిశీలిస్తామని ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేసిందన్నారు. నిర్వాసితులు తమ సమస్యలను విన్నవించుకునేందుకు నోడల్ అధికారి సైతం అందుబాటులో లేరని తెలిపారు. ఈ నేపథ్యంలో పోలవరం నిర్వాసితులు జీవచ్ఛవంలా బతుకుతున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి అరుణ్ పాల్గొన్నారు.

మధురపూడి విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం

పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటన కోసం మధురపూడి విమానాశ్రయానికి చేరుకొన్న ఎంఎ బేబీకి సిపిఎం శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం, సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి అరుణ్, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బి కిరణ్ ఆయనకు పూలమాలలు, భుకేలతో స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయంలో భాగమైన కొమ్మును ఎంఎ బేబీ తలపై ధరించారు. అనంతరం కొద్దిసేపు నాయకులతో ఆయన మాట్లాడారు. ఆ తర్వాత అక్కడి నుంచి రోడ్డు మార్గంలో దేవీపట్నం మండలంలోని పోలవరం నిర్వాసిత గ్రామాలకు వెళ్లారు.

పోలీసుల అత్యుత్సాహం

గిరిజన సంప్రదాయబద్ధంగా సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీకి స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్టుకు వచ్చిన సిపిఎం శ్రేణులు, గిరిజనుల పట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కొమ్ము, డోలు పరికరాలకు విమానాశ్రయంలోకి అనుమతి లేదంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణమే వాటిని బయటకు తీసుకెళ్లాలని, లేదంటే స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తూ వారిని లోనికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం శ్రేణులకు, పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు అడ్డుకోవడంతో విమానాశ్రం ముఖద్వారం వద్దే గిరిజనులు ఉండిపోయారు. అక్కడ నుంచే బేబీకి వారి సంప్రదాయంలో స్వాగతం పలికారు.

నిర్వాసితులను గాలికొదిలేసిన ప్రభుత్వాలు

పార్లమెంట్‌లో చర్చిస్తా : రాజ్యసభ సభ్యులు, సిపిఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్

పోలవరం నిర్వాసితుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని రాజ్యసభ సభ్యులు, సిపిఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. శనివారం ఏలూరు జిల్లాలోని పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించేందుకు ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయన అక్కడి నుంచి ఏలూరు సత్రంపాడులో సిపిఎం సీనియర్ నేతలు, కీర్తిశేషులు అన్నే వెంకటేశ్వరరావు, అనసూయమ్మ కుమార్తె కల్పన నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ రవి, కార్యదర్శివర్గ సభ్యులు పి రామకృష్ణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బ్రిట్టాస్ మీడియాతో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల లక్షా ఆరు వేల కుటుంబాలు నిర్వాసితులుగా మారాయని, వారికి భరోసా కల్పించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆసక్తి చూపడం లేదని అన్నారు. నిర్వాసితుల్లో 80 శాతం గిరిజనులు ఇంకా పునరావాస ఫలితాలు పొందలేదని, అందుకే నిర్వాసిత గ్రామాల్లో పర్యటించి, అక్కడ ప్రజలతో స్వయంగా మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకుని, పార్లమెంట్లో వారి పక్షాన తమ గొంతు వినిపిస్తామని చెప్పారు. అణచివేతకు గురవుతున్న వారి పక్షాన కేంద్రంతో మాట్లాడతామని తెలిపారు. పోలవరం వంటి పెద్ద పెద్ద ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రజలను వారి నివాస ప్రాంతాల నుంచి బలవంతంగా పంపించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయే తప్ప పునరావాసం కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. పునరావాసం కల్పించకుండా వారిని స్వస్థలాల నుంచి తరిమేస్తున్నారని చెప్పారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి రూ.33 వేల కోట్లు కావాల్సి ఉన్నప్పటికీ ఆ మేరకు నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వాసితులు తమ జీవనాధారం కోల్పోయి రోడ్డున పడుతున్నారన్నారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడడానికి ఎపి ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిపిఎంగా తమ వంతుగా నిర్వాసిత గ్రామాల్లో స్వయంగా పర్యటించి, వారితో మాట్లాడి, వారి సమస్యలను అర్థం చేసుకొని తగిన ప్రణాళికతో ముందుకు వెళ్తామని తెలిపారు. ఆయన వెంట సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి తులసీదాస్, బి బలరాం ఉన్నారు.

ఎరువుల కేటాయింపుల్లో కోత

(మొదటిపేజీ తరువాయి)

ఏరియా నుంచి యూరియాను తరలించారు. అలాగే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి కూడా యూరియాను తరలించారు. ఇప్పుడు కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో సీజన్ ముమ్మరమై కొరత ముందుకొచ్చింది.

వాస్తవానికి భిన్నంగా..

ఎరువుల కొరత లేదని ప్రభుత్వం, వ్యవసాయశాఖ చెబుతుండగా, క్షేత్ర స్థాయిలో వాస్తవం ఆ విధంగా లేదు. జులై నెల యూరియా కేటాయింపు 3.05 లక్షల టన్నులు కాగా, 2.85 లక్షల టన్నులే వచ్చాయి. లోటు 20 వేల టన్నులు. అన్ని జిల్లాలకు కలిపి 20 వేల టన్నుల కోత కనిపిస్తోంది. వ్యవసాయశాఖ డిబిటి ప్రాతిపదికన ఎరువుల నిల్వలను చెబుతోంది. డిబిటి నమోదులు సరిగ్గా చేయనందున రికార్డులకు, వాస్తవానికి మధ్య వ్యత్యాసం వస్తోంది. పిఎసిఎస్‌లకు పంపుతున్న యూరియాపై స్థానిక అధికార పార్టీల నాయకుల ఆధిపత్యం కొనసాగుతోంది. వారి కనుసన్నల్లో ఎరువుల పంపిణీ జరుగుతోంది. పార్టీ అనుయాయులకు ఎరువులను ముందుగా అమ్ముతున్నారు. స్టాక్ ఉండట్లేదు. దాంతో రైతుల్లో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగా పిఎసిఎస్‌లలో డిబిటి వివరాలు నమోదు చేయడం లేదు. దాంతో నిల్వలు ఉన్నట్లు కంప్యూటర్లలో కనిపిస్తోందంతే. సాధారణ పరిస్థితుల్లో ఆగస్టులో యూరియా 1.65 లక్షల టన్నుల అవసరం ఉంది. ఆగస్టు 13 నాటికి వ్యవసాయశాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం చూసుకుంటే మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో కావాల్సినదానికంటే తక్కువ స్టాక్ ఉంది. డిఎపి.. విజయనగరం, మన్యం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్లలో, కాంప్లెక్స్.. మన్యం, అనకాపల్లి, కర్నూలులో తక్కువ స్టాక్ ఉంది.

జింక బద్ధకం




ఒక అడవిలో ఓ కుందేలు, జింక కలిసిమెలిసి ఉండేవి. కుందేలు చాలా చురుకైనది, జింకకు మాత్రం చాలా బద్ధకం అని మిగిలిన జంతువులు అంటూ ఉండేవి. కానీ జింక మాత్రం ఆ మాటకు ఒప్పుకునేది కాదు. నేను కూడా చురుకైన దానిని అని గొప్పలకు పోయేది.

ఒకరోజు ఇదే మాట మీద జంతువుల మధ్య వాదన వచ్చింది. అప్పుడు అడవికి పెద్ద అయిన ఏనుగు మధ్యలో కల్పించుకుని సరే జింక 'తాను చురుకైన దానిని' అని వాదిస్తుంది కాబట్టి ఒక పోటీ పెడతాను. ఒక పెద్ద దుంపను మన అడవిలో దాచిపెడతాను. దాన్ని ఇద్దరిలో ఎవరు వెతికి తీసుకు వస్తే వారే విజేత. ఆ దుంప మొత్తాన్ని బహుమతిగా పొందవచ్చు' అని చెప్పింది. దానికి ఇద్దరు సరే అని పందెం మొదలుపెట్టాయి. కాసేపు గబగబా వెతికిన జింకకు అంతలోనే విసుగు వచ్చింది. ఇంత పెద్ద ప్రాంతంలో ఆ దుంపను వెతకడం కష్టమని ఒక చెట్టు వద్ద కూర్చుంది. కుందేలు మాత్రం ప్రతి చెట్టును వెతికి చివరకు దుంప సాధించింది. తీరా చూస్తే ఆ దుంప జింక కూర్చున్న చెట్టు తొర్రలోనే ఉంది. ఇంకేముంది? కుందేలు విజేతగా నిలిచిం ది. జింక తన తప్పును తెలుసుకొని అప్పటినుంచి చురుకుగా ఉండటం మొదలు పెట్టింది.



- టి.హర్షవర్ధన్,
5వ తరగతి, అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.

ఎద్దుపుండు కాకికి ముద్దు



'తాతా కథ చెప్పవా!' అని అడిగాడు రుద్రాంశ్.

'ఏ కథ కావాలి నీకు' అని అడిగాడు కాశీ తాత.

'నాకు కాకి కథ కావాలి తాత' అన్నాడు రుద్ర కళ్ళు పెద్దవి చేసుకుని.

'సరే చెప్తాను. ఒక చెట్టు మీద చిట్టి అనే కాకిపిల్ల ఉండేది. ఒకరోజు దానికి బాగా ఆకలి వేసింది. ఆహారం కోసం ఎగురుకుంటూ వెళ్ళింది. దారిలో దానికి ఒక ఆవు కనిపించింది. కాకిపిల్ల ఆవు దగ్గరికి వెళ్ళి 'ఆవూ..ఆవూ నాకు ఆకలి వేస్తోంది పాలు ఇవ్వవా!' అని అడిగింది.

'అబ్బా నా బుజ్జి పిల్లకి ఉండాలి కదా! నేనివ్వను!' అంది ఆవు. సరేనని ఎగురుకుంటూ ముందుకెళ్లిన కాకిపిల్లకు ఒక కోడిపెట్ట కనిపించింది. దాని దగ్గరకు వెళ్ళి 'కోడీ.. కోడి నాకు ఆకలిగా ఉంది నీ గుడ్డు ఇవ్వవా!' అని అడిగింది కాకిపిల్ల.

'ఆశ, దోశ నేనివ్వను. గుడ్లను పొదిగి పిల్లలను చేస్తా' అంది కోడిపెట్ట. చేసేదేమీ లేక ఎగురుకుంటూ ముందుకెళ్ళిన కాకిపిల్లకి పిల్లి కనిపించింది. "పిల్లి బావా, పిల్లి బావా నాకు ఆకలేస్తోంది. ఎలకని పట్టి ఇవ్వవా!' అని దీనంగా అడిగింది.

'తనకుమాలిన ధర్మం మొదలుచెడ్డ బేరం ఉంటుందా చెప్పు. నేనూ, ఆకలితోనే ఉన్నాను. ఎలుక దొరికితే నేనే తింటాను' అంది పిల్లి.

అలా ఎగురుకుంటూ మరికొంచెం ముందుకు వెళ్లేసరికి ఒక ఎద్దు కనిపించింది. ఆ ఎద్దు వీపుమీద పెద్ద పుండు ఉంది. అది చూసిన కాకిపిల్ల ఎద్దుపుండును ఎంతో ఇష్టంగా ముక్కుతో పొడుచుకుని తినడం ప్రారంభించింది. బాధ భరించలేక తోకతో కాకిని తరుముతూ అటూ ఇటూ తిరిగేది ఎద్దు.

ఆ దారంట పోతున్న మనుషులు ఆ దృశ్యాన్ని చూసి 'ఎద్దుపుండు కాకికి ముద్దు' అనుకుంటూ వెళ్ళేవారు. అలా అనాటి నుంచి ఈ సామెత వాడుకలోకి వచ్చింది. ఒకని కష్టం లేదా బాధ మరొకనికి సుఖం, సంతోషం అయినప్పుడు ఈ సామెతను ఉదహరించటం పరిపాటి అయ్యింది' అని కథ ముగించాడు తాతయ్య.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు, 94945 24445.

నేను గీసిన బొమ్మ





వి.శివకుమారం
7వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్,
కుల్చారం,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన సౌరభం

మనకు గల శక్తిని బట్టి మనల్ని మనం అంచనా వేసుకుంటాం. కానీ మనం చేసే పనులను బట్టి ఇతరులు మనల్ని అంచనా వేస్తారు.

మీ కోసం

యాలకులను నోట్లో వేసుకుని చప్పరిస్తూ ఉంటే దుర్వాసనతో పాటు నోటి అల్సర్, ఇన్‌ఫెక్షన్ల వంటి సమస్యలూ తగ్గిపోతాయి.



JEEVANA జీవన the family

శవాగారాల్లో శిథిల బతుకులు

కొన్ని వాస్తవాలు చాలా కఠినంగా ఉంటాయి. వాటిని చాలామంది ఒప్పుకోరు. మొన్నీమధ్యే పార్లమెంటు సాక్షిగా ఓ బిజెపి కేంద్రమంత్రి చేతులతో మానవ వ్యర్థాలు తీసేవారు అంటే 'మాన్యువల్ స్కావెంజర్స్' ఈ దేశంలో అస్సలు లేరని చెప్పారు. అదంతా ఎప్పుడో మాసిపోయిన చరిత్ర అనీ చెప్పారు. అదెంత వాస్తవ దూరమో అందరికీ తెలుసు. ఇప్పుడు దాని గురించి కాదు మనం చర్చించుకుంటోంది. అంతకంటే దారుణమైన పని గురించి. శవాగారంలో కుళ్లిన, పురుగులు పట్టిన, ఉబ్బిపోయిన శవాలను నామమాత్రపు పరికరాలతో పరీక్షలు చేసే పోస్టుమార్టం పని గురించి.



ఛత్తీస్‌గఢ్ అడవుల్లో నర్వాపూర్ అనే ఊరికి చివరన సిమెంటుతో కట్టిన ఓ చిన్న గది ఉంది. ఆ గది గోడపై హిందీలో 'నవీన్ శవ్ గృహ్' అని రాసిపెట్టారు. అక్కడ గత 20 ఏళ్లుగా 1200 పైచిలుకు శవాలకు పోస్టుమార్టం నిర్వహించింది 42 ఏళ్ల సంతోషి దుర్గ. పోస్టుమార్టం చేయడానికి ఆమెకి ఉన్న అర్హత ఎంబిబిఎస్ చదువు కాదు.. ఆమె కులం. కులం ఆమెని ఈ పనికి బలవంతంగా నెట్టివేసింది. ఈ పని 'మాన్యువల్ స్కావెంజింగ్' కంటే దారుణమైన పని. కానీ దీని గురించి ఎక్కడా.. ఎవరూ మాట్లడరు.

నర్వాపూర్ కమ్యూనిటీ సెంటర్‌లో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న దుర్గని శవ పరీక్ష ఉన్న ప్రతిసారీ అక్కడికి తీసుకెళ్తారు. కులం ఆధారంగా ఆమెకి ఈ పని కేటాయించడం దేశంలో తొలిసారి కాదు. ఢిల్లీ నుండి గురుగ్రామ్ వరకు దేశంలో ఏ శవాగారంలోనైనా వేలాదిమంది పారిశుధ్యకార్మికులు కేవలం కులం ఆధారంగా ఈ పనికి కేటాయించబడుతున్నారు. కత్తులు, సుత్తులు, రంపాలు వంటి ఆధునిక పరికరాలు, గ్లౌజులు, రసాయనాలు వంటి మౌలిక వసతులు వంటివేవీ లేకుండానే వారంతా ఈ పనులు చేస్తున్నారు. కనీసం ఈ పనికి అందాల్సిన గౌరవ వేతనం కూడా వారికి అందడం లేదు. దుర్గ లాంటి మహిళలు ఈ పనిలోకి వారసత్వంగా కూడా తోసివేయబడుతున్నారు. దుర్గ కంటే ముందు వాళ్ల నాన్న ఈ పనిలో నిమగ్నమయ్యాడు. ఆ అనుభవాలను ఆమె ఇలా చెబుతోంది.

వారసత్వంగా వస్తోంది..

'నాన్న ఇక్కడ పోస్టుమార్టం చేసేవాడు. శవపరీక్ష చేస్తున్నంత సేపూ అతను మద్యం మత్తులోనే ఉండేవాడు. అలా తాగి తాగి ఆరోగ్యం క్షీణించి నాన్న చనిపోయాడు. నాన్నకి సహాయంగా చిన్నపిల్లగా ఉన్న నేను వెళ్లేదాన్ని. అప్పుడే శవాలను ఎలా, ఎక్కడ కోయాలో నేర్చుకున్నాను. నాన్న చనిపోయిన తరువాత నన్ను ఈ పనికి కుదిర్చారు. అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చాను. ఆల్కహాల్ సేవించకుండా కూడా ఈ పని చేయొచ్చని చూపించాలనుకున్నాను' అని దుర్గ చెప్పింది. పోస్టుమార్టం ఉన్నప్పుడు తను చేసే పని, తన పట్ల చూపించే గౌరవం గురించి కూడా దుర్గ చాలా విషయాలు మాట్లాడింది.



దేశంలో పారిశుధ్యకార్మికులుగా గుర్తించబడిన వారిలో చాలామంది మూడు రకాల పనులకు బలవంతంగా నెట్టివేయబడుతున్నారు. రోడ్ల మీద ఊడ్చేవారు అందరికీ కనిపిస్తారు. కానీ చాటుగా వీరితో మాన్యువల్ స్కావెంజింగ్, శవపరీక్షలు చేయిస్తారు. మూడో రకం పని గురించి ఎవరికీ అవగాహన లేదు.

బ్లేడ్లతోనే పని చేయాలి..

దుర్గ ఈ పని ఉన్నప్పుడు ఓ నల్ల సంచిలో రెండు బ్లేడ్లు, ఆప్రాన్లు, మాస్కులు, గ్లోవ్స్ వేసుకుని బయల్దేరుతుంది. ఈ 20 ఏళ్లలో ఆమె ఎప్పుడూ ఎముకలు కత్తిరించే రంపాలు, రిబ్ షేర్స్, పోస్టుమార్టం కత్తులు వంటి వాటిని ఉపయోగించనేలేదు. తను పనిచేసే కమ్యూనిటీ సెంటర్‌లో ఓ మూలన ఈ నల్ల సంచి పెట్టి ఉంటుంది. దానిపై 'పదునైన వస్తువులు' అని హెచ్చరిక రాసి ఉంటుంది. 'పరీక్షల కోసం ఏదేని శరీర భాగం భద్రపరచాల్సి వస్తే కూడా సరైన పరికరం ఇవ్వర'ని దుర్గ చెబుతోంది. అలాంటి పరిస్థితుల్లో ఒక ప్లాస్టిక్ డబ్బాలో ఆ అవయవాలను పెడతాన'ని ఓ డబ్బా చూపించింది.

రక్తం ఒళ్లంతా చిమ్మినా..

శవం గురించిన సమాచారం డాక్టరు ద్వారా గాని, పోలీసుల ద్వారా గాని దుర్గకి చేరుతుంది. శవాన్ని తీసుకుని డాక్టరు, దుర్గ ఒకే వ్యానులో శవాగారానికి వెళతారు. శవాన్ని గదిలో బండపై పెట్టి డాక్టరు దూరంగా వెళ్లి నుంచుంటారు. ఇక దుర్గ పని ప్రారంభమౌతుంది. దాని గురించి దుర్గ ఇలా చెబుతోంది. 'అది హత్య అయినా, ఆత్మహత్య అయినా, పురుగులు పట్టి దుర్వాసన వస్తున్నా నేను ఆ పని చేయాల్సిందే. ఒక్కోసారి పరీక్ష చేసేటప్పుడు ముఖమంతా రక్తం చిమ్ముతుంది. శరీరం నుండి దుర్గంధం వ్యాపించే ద్రవాలు బట్టలపై పడతాయి. శుభ్రం చేసుకునేందుకు కూడా నా దగ్గర సరైన పరికరాలు లేవు. ఒక్కోసారి బండని శుభ్రం చేసేందుకు నా దుస్తులనే ఉపయోగిస్తాను. పరీక్ష చేసే సమయంలో అవయవాలపై ఉన్న మచ్చలు, గాయాలు వంటివాటిని నేను చెబుతుంటే డాక్టరు పుస్తకంలో రాసుకుంటూ ఉంటాడు. ఇట్లాంటి పనికి నా పిల్లలను అసలు రానీయను. వాళ్లని బాగా చదివిస్తాను' అని దుర్గ చెబుతున్నప్పుడు ఆ మాటల్లో ఎంతో ఆవేదన కనిపించింది.

రాత్రుళ్లు నిద్ర రాదు..

గురుగ్రామ్ శవాగారంలో పనిచేసే 40 ఏళ్ల రూపేష్ 22 ఏళ్లుగా ఈ పనిలో ఉన్నాడు. తన అనుభవాన్ని అతడు ఇలా చెప్పాడు. 'ఈ పని ఎంత కష్టమైనదో చెప్పడానికి మాటలు చాలవు. శవాన్ని కోస్తున్నప్పుడు రక్తం కళ్లల్లో పడుతుంది. లోపలి భాగాలను కత్తిరించి, కత్తిరించి అలసిపోతాను. కాలిపోయిన శవాలు, నీటిలో ఉబ్బిపోయిన శవాలు, కుళ్లిన శవాలకు పరీక్షలు చేసి చేసి రాత్రుళ్లు నిద్రరాదు. కళ్లు మూసుకుంటే శవమే గుర్తుకువస్తుంది. అధికారులు మాకు మాస్కులు మాత్రమే ఇస్తారు. వాళ్లిచ్చిన క్రిమిసంహారకాలు రాసుకుని పరీక్షలు చేస్తుంటే చేతులు భగభగ కాలుతున్నంత బాధ వస్తుంది. కుళ్లిన శవాలను పరీక్ష చేస్తున్నప్పుడు వాంతులు అవుతాయి. ఈ బాధలు ఎవరికీ పట్టవు. అసలు మేం చేస్తున్న పనికి గౌరవం కాదు, అవమానాలు పడతాం. మమ్మల్ని నీచమైన వ్యక్తులుగా సమాజం ముద్రవేసింది. కానీ మేము బాధితులం..' అని అతను ఎంతో బాధగా చెప్పాడు.

ఆర్థికంగా, మానసికంగా కుదేలైన ఈ వ్యక్తులు ఆరోగ్యాలని పణంగా పెట్టి మరీ ఈ పనులు చేస్తున్నారు. కులం నేటికీ వారితో ఈ పనులను చేయించడం 78 ఏళ్ల స్వతంత్ర భారతం సిగ్గుపడాల్సిన విషయం. నిచ్చెనమెట్ల ఈ కుల వ్యవస్థలో అధిక కులం, నిమ్న కులం అన్న తారతమ్యం ఎప్పుడూ ఉంది. విద్యావంతులు, నిరక్షరాస్యులు, మహిళలు అన్న తేడా లేకుండా నిరంతరం వాళ్లు బాధితులుగానే ఉన్నారు.

'ఓజీ' కన్మణి



పవన్ కల్యాణ్ నటిస్తోన్న తాజా చిత్రం 'ఓజీ'. 'సాహెూ' ఫేం సుజీత్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతోంది. తాజాగా ఈ మూవీ నుంచి చిత్రబృందం కథానాయికను పరిచయం చేశారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా ప్రియాంక మోహన్ నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె పాత్రను పరిచయం చేసింది చిత్రబృందం. ఈ సినిమాలో ప్రియాంక కన్మణి అనే పాత్రలో కనిపించబోతున్నారు.

రూపాయి తీసుకోలేదు..



రజనీకాంత్ నటించిన తాజా చిత్రం 'కూలీ'లో బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించారు. దాహా అనే డాన్ పాత్రలో ఆయన నటించారు. ఆ పాత్ర కోసం ఆమిర్ ఏకంగా రూ.20 కోట్లు తీసుకున్నాడంటూ పలు మీడియాలలో వార్తలు వైరల్ అయ్యాయి. తాజాగా ఈ వార్తలపై ఆమిర్ స్పందించారు. 'ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదు. 'కూలీ' సినిమా కోసం నేను ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు' అని తెలిపారు. తలైవర్‌పై ఉన్న ప్రేమని డబ్బులతో వెలకట్టలేను. రజనీకాంత్, కూలీ టీమ్ పట్ల ఉన్న ప్రేమ, గౌరవం కారణంగానే నేను ఈ సినిమాలో ఎటువంటి రెమ్యూనరేషన్ తీసుకోకుండా నటించాను' అన్నారు. ఇంకా లోకేష్ కనగరాజ్ కథ చెప్పకుండానే తాను ఈ ప్రాజెక్టుకు అంగీకరించానని, స్క్రిప్ట్ వినకుండా ఒక సినిమాకు ఓకే చెప్పడం తన కెరీర్‌లో ఇదే తొలిసారని అన్నారు.

నా పూర్వీకులు బ్రిటీష్ వారితో పోరాడారు.. నీ తాతలు వాళ్ల కింద బానిసలుగా ఉన్నారు..

బాలీవుడ్ దిగ్గజ లిరిక్ రైటర్ జావేద్ అక్తర్‌కి ఇండిపెండెన్స్ డే రోజున సోషల్‌మీడియాలో చేదు అనుభవం ఎదురైంది. దానికి ఆయన దీటుగా సమాధానమిచ్చారు. విషయానికి వస్తే.. 'భారత ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు' తెలుపుతూ జావేద్ అక్తర్ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌పై ఒక నెటిజన్ స్పందిస్తూ.. మీ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 14 (పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవ రోజు) కదా.. అంటూ రిప్లయ్ ఇచ్చాడు. దీనికి జావేద్ అక్తర్ స్పందిస్తూ.. 'బాబు. మీ తాతా, నాన్న ఆంగ్లేయుల చెప్పుల కింద బానిసలుగా ఉన్నప్పుడు నా పూర్వీకులు స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారితో పోరాడి కాలాపానీ జైలు (అండమాన్ సెల్యూలార్)లో మరణించారు. నీ హద్దుల్లో నువ్వు ఉండు' అని గట్టిగా సమాధానం ఇచ్చారు.



ఈ వ్యాఖ్యకి మరో నెటిజన్ స్పందిస్తూ.. 'కానీ, నువ్వు దేశద్రోహివే' అంటూ కామెంట్ చేశాడు. దీనిపై జావేద్ స్పందిస్తూ.. 'సహాయ నిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాలను వ్యతిరేకించిన వారే (ఆర్‌ఎస్‌ఎస్) దేశద్రోహులు. ఆంగ్లేయులకు చేతనైనంత సహాయం చేసిన వారే దేశద్రోహులు. మన రాజ్యాంగాన్ని, త్రివర్ణ పతాకాన్ని వ్యతిరేకించిన వారే దేశద్రోహులు. వాళ్లెవరో తెలుసుకుని నీ అజ్ఞానాన్ని కొద్దిగా తగ్గించుకో' అంటూ జావేద్ అతడికి కౌంటర్ రిప్లయ్ ఇచ్చారు.

'ఇష్టమొచ్చిన వారితో పనిచేయించుకుంటాం...'

- నిర్మాతల బెదిరింపు ధోరణి
- 50 ఏళ్లలో లేని షరతులు



మాట్లాడుతున్న కదిరి బాషా

తెలుగు సినీ పరిశ్రమలో సినిమా కార్మికుల ఫెడరేషన్-నిర్మాతల మండలి మధ్య కార్మికుల వేతనాలు 30 శాతం పెంపు అగ్రిమెంట్‌పై నెలకొన్న చర్చలు ఇంకా కొలిక్కి రాలేదు. మొత్తం 9 షరతులు నిర్మాతల మండలి నుంచి ప్రతిపాదనలు రాగా ఇప్పటికే ఐదింటిని ఒప్పుకున్నామనీ, మిగిలిన నాలుగింటిలో రెండింటిని సైతం అంగీకరించామని ఫెడరేషన్ నాయకులు చెబుతున్నారు. మిగిలిన రెండు షరతులు కూడా ఒప్పుకుంటేనే అగ్రిమెంట్ చేస్తామంటూ నిర్మాతల మండలి ప్రతినిధులు చెబుతున్నారు. కాల్షీట్ల పెంపు, స్టంట్, డ్యాన్సర్లు, టెక్నీషియన్ల వేతనాల పెంపుదలకు నిర్మాతల మండలి ఒప్పుకోలేదు. వీటికి కూడా ఒప్పుకుంటేనే తమ ఆందోళన ఆగుతుందని ఫెడరేషన్ నాయకులు స్పష్టం చేస్తున్నారు. 'నిర్మాతలు సంప్రదింపుల పేరుతో కాలయాపన చేస్తున్నారు. మేము ఒప్పుకోవట్లేదని బయట మాట్లాడుతున్నారు. మమ్మల్ని మీడియా ముందు మాట్లాడొద్దంటున్నారు. 50 సంవత్సరాల నుంచి లేని కండిషన్లు ఇప్పుడు పెడుతున్నారు. వాళ్లు డైవర్షన్ చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారు. నిర్మాతలు కూడా కష్టాల్లో ఉన్నారు. కాబట్టి మేము కూడా కొంత దిగొస్తాం. మేము చర్చలకు సిద్ధంగానే ఉన్నాం. కానీ నిర్మాతలెవ్వరూ అందుబాటులో ఉండటం లేదు. ఛాంబర్, కౌన్సిల్ నిర్ణయాలను బట్టి మేమూ స్పందిస్తాం. కరెక్ట్‌గా వేతనాల సమస్య వచ్చే సరికి ఎక్కడెక్కడా లేని పాయింట్లు మాట్లాడుతుండటం సమంజసం కాదు. మా కష్టానికి ప్రతిఫలాన్ని అడుగుతున్నాం. గతం గురించి మీరు మాట్లాడితే మేము కూడా మాట్లాడాల్సివుంటుంది. నిర్మాతల నిర్ణయం చెబితే మా కార్యాచరణ ప్రకటిస్తాం' అని ఫెడరేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 'కోడి కూయకముందు ఇంటి నుంచి వెళ్లిపోతాం. మళ్లీ ఇంటికి భార్య, పిల్లలు నిద్రపోయాక వస్తాం. ప్రతిరోజూ 16 గంటల వరకూ డ్యూటీలో ఉంటాం. ప్రస్తుతం డ్రైవర్లకు రూ.1195 మాత్రమే ఇస్తున్నారు. ఉదయం 6 గంటలకు ఆర్టిస్టులు, వర్కర్లు షెడ్యూల్‌కు వెళ్లాలంటే మేము ఉదయం 3 నుంచి 3.30 గంటలకే ఇళ్ల నుంచి బయలుదేరతాం. రాత్రి 6 గంటలకు షూటింగ్ పూర్తయితే ఇంటికి వచ్చే సరికి 9 గంటలు అవుతుంది. మా శ్రమకు తగ్గ వేతనాలు రావటం లేదు. ఇప్పటివరకూ సెలవు రోజుల్లో డబుల్ కాల్షీట్ ఇచ్చేవారు. ఇక నుంచి నెలలో ఒక్క ఆదివారమే డబుల్ కాల్షీట్ ఇస్తామని, మిగతా రోజుల్లో మామూలుగానే ఇస్తామంటూ చెప్పటం దారుణం. ఆదివారం, ప్రభుత్వ సెలవు దినాల్లో మా కుటుంబాలను వదిలేసి డ్యూటీకి వచ్చేది పది రూపాయలు వస్తాయనే. నెలలో నాలుగు ఆదివారాలుంటే ఒక్కటే ఇస్తామనటం సరికాదు. మిగతా ఆదివారాలు, సెలవుదినాల్లోనూ డబుల్ కాల్షీట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. 6 నుంచి 6 కాల్షీట్ ఎత్తేసి ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల కాల్షీట్ వర్తింపజేస్తే ఇప్పుడు వచ్చే వేతనాల్లో మేము 50 శాతం కోల్పోతాం' అని తెలుగు సినిమాడ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కదిరి బాషా, అధ్యక్షుడు బి.శ్రీరామ్, వెంకటేష్ ఆవేదన వ్యక్తంచేశారు.

వరుస విజయాలతో
అమరావతి రాయల్స్ దూకుడు

విహారి ఆల్‌రౌండ్ ప్రదర్శన
సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై ఏడు వికెట్ల తేడాతో గెలుపు



భారీ షాట్ కొడుతున్న హనుమ విహారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ - 4లో క్యాపిటల్ అమరావతి రాయల్స్ వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసుకొని పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. శనివారం మధ్యాహ్నం విశాఖపట్నంలోని ఎసిఎ - విడిసిఎ మైదానంలో సింహాద్రి వైజాగ్ లయన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిపోయి తొలుత బ్యాటింగ్ చేసిన సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 139 పరుగులు చేసి ప్రత్యర్థి ముందు 140 పరుగుల స్వల్ప విజయ లక్ష్యాన్ని ఉంచింది. సింహాద్రి వైజాగ్ లయన్స్ బ్యాటర్లలో కెహెచ్.రెడ్డి 34 బంతుల్లో ఐదు ఫోర్లతో 41 పరుగులు చేయగా, పిఆర్.కుమార్ 14 బంతుల్లో మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 30 పరుగులు సాధించాడు. ఆ జట్టులో జె.దుర్గాకుమార్ 14, కెఎ.కుమార్ 18 పరుగులు మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ కనీసం రెండు అంకెల స్కోర్ చేయలేకపోయారు. క్యాపిటల్స్ అమరావతి రాయల్స్ జట్టు బౌలర్లు వై.సందీప్ మూడు ఓవర్లలో 11 పరుగులు ఇచ్చి మూడు కీలక వికెట్లు తీయగా బిఎస్.కుమార్, హనుమ విహారి, బండారు అయ్యప్ప రెండేసి వికెట్లు తీశారు.

అనంతరం 140 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన అమరావతి రాయల్స్ బ్యాటర్లు హనుమ విహారి, మాన్యాల ప్రణీత్‌లు తొలి వికెట్‌కు 33 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేసి మరో ఐదు ఓవర్లు మిగిలి ఉండగానే మూడు వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో విజయం అందించారు. అమరావతి రాయల్స్ కెప్టెన్ హనుమ విహారి 41 బంతులలో ఒక సిక్స్, తొమ్మిది 9 ఫోర్లతో 62 పరుగులు చేయగా, ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన ఎం.ప్రణీత్ 21 బంతుల్లో నాలుగు సిక్స్‌లు, మూడు ఫోర్లతో 44 పరుగులు చేశాడు. సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు బౌలర్లలో టి.విజయ్ రెండు వికెట్లు, జై దుర్గా కుమార్ ఒక వికెట్ తీసుకున్నారు. అద్భుతంగా రాణించి 62 పరుగులు చేయడమే కాకుండా రెండు వికెట్లు తీసిన అమరావతి రాయల్స్ కెప్టెన్ హనుమ విహారి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

19న ఆసియాకప్‌కు జట్టు ప్రకటన: బిసిసిఐ

ముంబయి: ఈనెల 19న ఆసియాకప్‌కు జట్టును ప్రకటించనున్నట్లు భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) శనివారం ప్రకటించింది. ముంబయిలో మంగళవారం జరిగే బిసిసిఐ సమావేశం అనంతరం జట్టును ప్రకటించనున్నట్లు, శుభ్‌మన్ గిల్ ఏడాది తర్వాత టి20ల్లో పునరాగమనం చేయడం ఖాయమని ఒక అధికారి తెలిపారు. బ్యాటర్లంతా ఫామ్‌లో ఉన్న దృష్ట్యా ఆసియాకప్ జట్టుకు ప్రకటించే 15మంది ఆటగాళ్లలో కొన్ని కొత్త ముఖాలు కనిపించడం ఖాయమని ఆయన తెలిపారు. శుభ్‌మన్ గిల్‌కు తుదిజట్టులో చోటు దక్కితే.. సంజు శాంసన్, అభిషేక్ శర్మలలో ఒకరు చోటు కోల్పోవాల్సి ఉంటుంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ.. ఇంగ్లండ్ పర్యటనలో రాణించిన శుభ్‌మన్, జస్ప్రీత్ బుమ్రాలకు చోటు కల్పించే విషయమై ఒక అభిప్రాయానికి వచ్చినట్లు, జైస్వాల్‌తోపాటు శ్రేయస్ అయ్యర్‌కు కూడా చోటు దక్కినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఆయన తెలిపారు.

సీరియస్ ఇంజూరీ రీప్లేస్‌మెంట్..

భారత క్రికెట్ నియంత్రణ బోర్డు(బిసిసిఐ) దేశవాళీ క్రికెట్ సీజన్ 2025-26లో 'సీరియస్ ఇంజూరీ రీప్లేస్‌మెంట్' సరికొత్త రూల్‌ను పరిచయం చేయనుంది. అహ్మదాబాద్‌లో జరుగుతున్న సెమినార్‌లో అంపైర్లకు ఈ మార్పు గురించి తెలియజేసేందుకు బిసిసిఐ ఒక ప్రత్యేక సెషన్‌ను నిర్వహించింది. ఈ రూల్ ప్రకారం ఏ ఆటగాడైనా తీవ్రంగా గాయపడితే అతడి స్థానంలో 'లైక్ ఫర్ లైక్ రీప్లేస్‌మెంట్' మరొకరిని తీసుకోవచ్చు. ఉదహరణకు బౌలర్ గాయపడితే బౌలర్, బ్యాటర్ గాయపడితే బ్యాటర్‌ను భర్తీ చెయవచ్చు. టాస్ వేసే ముందు ఆయా జట్లు నలుగురు ఆటగాళ్లతో కూడిన జాబితాను అంపైర్‌లకు అందజేయాలి. ఎవరైనా గాయపడితే వారి నుంచే భర్తీ చేయాలి. ప్రస్తుతానికి ఈ రూల్ సికె నాయుడు ట్రోఫీలో వర్తించనుంది. ఐపిఎల్-2026, రంజీ ట్రోఫీ సీజన్‌లో ఈ కొత్త నియమాన్ని అమలు చేసే అవకాశముంది. అయితే గాయం తీవ్రతను బట్టి వైద్యుడిని సంప్రదించిన తర్వాత ఆటగాడిని రిప్లేస్ చేయాలా? వద్దా? అని నిర్ణయించే తుది అధికారం మ్యాచ్ రిఫరీదేనని బోర్డు అధికారి ఒకరు స్పష్టం చేశారు.

భళా మ్యాక్స్‌వెల్ మెరుపులు

- టి20 సిరీస్ విజేత ఆస్ట్రేలియా
- చివరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై రెండు వికెట్ల తేడాతో గెలుపు



క్వీన్స్‌లాండ్: నిర్ణయాత్మక మూడో, చివరి టి20లో ఆస్ట్రేలియా జట్టు బ్యాటర్లు రాణించారు. దక్షిణాఫ్రికా జట్టు నిర్దేశించిన 173 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ జట్టు ఒక బంతి మిగిలి ఉండగానే ఛేదించింది. స్టార్, మిడిలార్డర్ బ్యాటర్ మ్యాక్స్‌వెల్(62నాటౌట్; 36బంతుల్లో 8ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. కెప్టెన్ మార్ష్(54), హెడ్(19) కలిసి తొలి వికెట్‌కు 66పరుగులు జతచేశారు. చివర్లో మ్యాక్స్‌వెల్ ధనా ధన్ ఇన్నింగ్స్‌తో మెరిసాడు. బోస్చ్‌కు మూడు, రబడా, క్వేనాకు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా బ్యాటర్లు బ్రెవీస్ (53), డుస్సెన్(38నాటౌట్), స్టబ్స్(25) రాణించడంతో 7వికెట్లు కోల్పోయి 172పరుగుల భారీస్కోర్ చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లు ఎల్లిస్‌కు మూడు, జంపా, హేజిల్‌వుడ్ కు రెండేసి వికెట్లు దక్కాయి. దీంతో మూడు టి20ల సిరీస్‌ను ఆతిథ్య ఆస్ట్రేలియా 2-1తో చేజిక్కించుకొంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మ్యాక్స్‌వెల్‌కు, సిరీస్ టిమ్ డేవిడ్‌కు దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68